
# శ్రీ రామాయణానుభవము - అరణ్యకాండ




రచయిత

ఆచి శ్రీనివాసాచార్య, ఎం.ఎ.

శ్రీ రామాయనమః

# శ్రీరామాయణానుభవము - అరణ్యకాండ

## భాగ్యనగర కుసుమము



"జటాయు మోక్షప్రదాత"

"శ్రీరాముడు మా తండ్రియు"
సీతమ్మే మాకు తల్లి


రచయిత

**ఆచి శ్రీనివాసాచార్య, ఎం.ఏ.**

భాగ్యనగర కుసుమము - బోయిన్‌పల్లి

శ్రీ రామాయనమః

**శ్రీరామాయణానుభవం - అరణ్యకాండ**

రచయిత : **ఆచి. శ్రీనివాసాచార్య, ఎం.ఏ.**

ప్రచురణ

**భాగ్యనగర కుసుమము,** బోయిన్‌పల్లి

ప్రచురణకర్తలు

**శ్రీమాన్ బి. ప్రభాకర్ రావుగారు**

ప్రచురణ తేది : **పార్థివ ఆశ్వీయుజము**

రచయిత విలాసము

**ఆచి శ్రీనివాసాచార్య, ఎం.ఏ.**

11-5-29/9, శ్రీ వేంకటేశ్వర కాలని,

సరూర్‌నగర్, హైద్రాబాద్-500 035.

ఫోన్: 24053137

ప్రతులకు:

1. **బి. ప్రభాకర్ రావు,** M.Tech., F.I.E.,
   ఇంజనీరు ఇన్ ఛీఫ్
   రహదారులు మరియు భవనములు, ఆం.ప్ర.
   ప్లాట్ నెం.5, ఇక్రిసియాట్ కాలని
   ఫేస్-1, బోయిన్‌పల్లి, హైద్రాబాద్.

2. **ఆచి. శ్రీనివాసాచార్య, ఎం.ఏ.**
   11-5-29/9, శ్రీ వేంకటేశ్వర కాలని,
   రోడ్ నెం.5, సరూర్‌నగర్, హైద్రాబాద్ - 500 035.

ముద్రణ కార్యాలయము:

**ఆర్. వి. ప్రింటర్స్,**

హైద్రాబాద్.

వెల : **30 రూ.లు**

# అంకితము



అస్మత్పితామహులు

వై.వా. శ్రీ ఉ.వే.ప్ర. ఆచి రాఘవాచార్య

స్వామివారి శ్రీపాదకమలములకు

"రామాయణము వింటే ఆచి (కూడలి)

రాఘవాచార్యస్వామి వారి వలననే వినాలి"

# రచయిత



## ఆచి శ్రీనివాసాచార్య, ఎం.ఏ.

# ప్రచురణ కర్తలు



## శ్రీమతి బి. రమాదేవి & శ్రీ బి. ప్రభాకర్ రావు

ఇంజనీరు ఇన్ ఛీఫ్

రహదారులు మరియు భవనములు, ఆం.ప్ర.

# విషయసూచిక


1. క్వసూర్యప్రభవో వంశః?
2. మంగళాశాసనములు
   I. శ్రీ జీయర్ స్వామివారు
   II. ప్రాజ్ఞుల లోక హిత చింతన
   III. ఆనందానుభవము
   IV. దాసో2హం
3. అరణ్యకాండము
4. తాపసాశ్రమాలు
5. విరాధుడు
6. శరభంగ మహర్షి
7. మహర్షుల శరణాగతి
8. సుతీక్ష్ణాశ్రమము
9. సీతాదేవి హితోక్తి
10. కదిలే ప్రణవము
11. అప్సరసల సరస్సు
12. అగస్త్య మహర్షి
13. జటాయువు
14. పర్ణశాల - సౌమిత్రి శేషత్వము
15. భరతుని భ్రాతృ భక్తి
16. శూర్పణఖ
17. తరుణౌ - రూపసంపన్నౌ
18. రాముడొక్కడు - ధర్మాత్ముడు
19. తంధృష్ట్వా శత్రు హంతారం
20. అకంపనుడు
21. శూర్పణఖ ప్రబోధము
22. మారీచ రావణ సంవాదము
23. సీతాదేవి మృగతృష్ణ
24. మారీచవధ
25. సీతాపహరణము
26. జటాయువధ
27. సీతావిలాపము
28. సీతాదేవి రోషము
29. ఋష్య మూకము-లంకా నగరము
30. రావణ ప్రలోభము
31. తృణ మంత రతః కృత్వా
32. లక్ష్మణ దూషణము
33. సీతాన్వేషణము
34. లక్ష్మణ సాంత్వనము
35. జటాయువు మోక్షము
36. అయోముఖి
37. కబంధుడు
38. శబరి - ఆచార్య నిష్ఠ
39. పంపా సరోవరము

శ్రీ రామాయనమః

# క్వసూర్య ప్రభవో వంశః?

శ్రీ కాళీమాత వరప్రసాదిత మహా కవిత్వ సంపన్నుడైన శ్రీ కాళిదాస కవీంద్రుడు "రఘువంశ" మహా కావ్యమును వ్రాయగోరి, "క్వసూర్యప్రభవో వంశః? క్వచాల్ప విషయామతిః?" అబ్బో! అయోధ్యాధిపతులు ప్రభవించిన అంతటి సూర్యవంశమెక్కడ? అల్పమతినైన నేనెక్కడ? అని ఆలోచించి, "మందుడనైన నేను కవిని కావాలనుకోవడం, ఎత్తైన చెట్ల ఫలాలను పొట్టివాడు చేతులెత్తి అందుకోదలచినట్లు అపహాస్యం పాలు కావాలనుకోవడమే కదా!" అని వెనుకడుగు వేశాడు.

కవికుల గురువే అలా సంశయంతో వెనుకంజవేస్తే అత్యల్ప మతినైన నేనెక్కడ? "శ్రీరామాయణానుభవం"లో అంతటి "అరణ్యకాండ" ఎక్కడ?

అయితే నా అజ్ఞ తనే విజ్ఞతగా భావించుకొని, అహంకారముతో నేనే "శ్రీ రామాయణానుభవము" వ్రాస్తున్నానని అనుకొంటే కదా అంతటి తడబాటు?

"పలికెడిది రామకథయట, పలికించెడువాడు రామభద్రుండట" అనేదే నా విశ్వాసము. "తన్నై తాన్ కవిపాడినాన్" అన్నట్లు తన కథను తానే పలికించుకొనే శ్రీరామభద్రుడే నా నాలుక చివర సింహాసనము వేసికొని స్వయముగా కొలువుదీరి వుండగా నాకెందుకు భయము?

ఆశ్చర్యము! కృపాకూపారుడైన శ్రీ సీతారామచంద్రస్వామి ఇప్పటికే నన్ను నిమిత్తము చేసికొని "శ్రీరామాయణానుభవంలో" "బాల, అయోధ్య, అరణ్యకాండలను" పూర్తి చేయించు కొన్నాడు.

శ్రీరాముడు తన కులగురువైన వశిష్ట మహర్షికి సంబంధించిన, "కౌండిన్య" వంశంలో మా పితృ, పితామహాది మహానుభావులను ప్రభవింపజేసికొన్నాడు.

మా తాతగారు శ్రీ ఉ.వే.ప్ర. మహావిద్వాన్ ఆచి (కూడలి) రాఘవాచార్య స్వామి వారు కూలంకష పాండితీ మండితులు, "శ్రీమద్రామాయణ ప్రవచన పారంగతులు. "శ్రీమద్రామాయణము వింటే శ్రీ రాఘవాచార్య (కూడలి) స్వామివారి వద్దే వినాలి" అనే నానుడి ఆనాడు అందరి నోటి మాటగా ప్రచలితమైంది.

మా నాన్నగారు "ఉపన్యాస కేసరి", "ఉభయవేదాంత విద్వాన్" శ్రీ ఉ.వే.ప్ర. ఆచి వేంకట నృసింహాచార్య (ఆవునూరు) స్వామివారు" పుంభావ సరస్వతీ మూర్తులు: "శ్రీమద్రామాయణ" ప్రవచన వేళలలో "వాల్మీకి" విశిష్ట స్థానవిరాజితులు.

"జనిత్వా2హం వంశే మహతి జగతి ఖ్యాత యశసాం" అన్నట్లు అంతటి మహాత్ములు

అవతరించిన "కౌండిన్య" వంశములోనే నాకు కూడ జన్మను ప్రసాదించి, "పితామహం నాథమునిం విలోక్య" అన్నట్లు మా పితృ, పితామహాది మహామహులను అవలోకించి, నా అజ్ఞతను సరకుగొనక నా చేత "శ్రీరామాయణానుభవంలో - అరణ్యకాండను" వ్రాయించుకొన్నాడు మా కులదైవమైన శ్రీసీతారామచంద్ర ప్రభువు.

ప్రాతఃస్మరణీయ పాదారవిందులు, మహోదారహృదయులు, శ్రీశ్రీశ్రీ చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామివారు, "ఉభయవేదాంతాచార్య" విద్వన్మణులు, కులపతులు శ్రీ ఉ.వే.ప్ర.తె.కం. గోపాలాచార్య స్వామివారు, "ఉభయ వేదాంత విద్వదగ్రేసరులు, శ్రీమద్రామాయణ ప్రవచనవాచస్పతులు శ్రీ భాష్యం అప్పళాచార్య స్వామివార్లు ఇంతవరకే రామప్రభువు నాచే వ్రాయించుకొన్న "బాలకాండ", "అయోధ్యకాండ"లకు "శుభాశంసనము", ఆమోదము, "మంగళాశాసనము", "రసాస్వాదముల" ద్వారా తమ శుభాశీస్సులను అనుగ్రహించి వాటిని ప్రభావ సంపన్నములను కావించారు.

అప్పటికి, ఇప్పటికి, ఎప్పటికి కూడ తమ దివ్యానుగ్రహము ద్వారా నా రచనలకు ఊపిరి నందిస్తున్న శ్రీశ్రీశ్రీ చిన్న శ్రీమన్నారాయణ రామానుజయతీంద్రులు ఈ అరణ్యకాండకు కూడ తమ దివ్య మంగళాశాసనాలను అనుగ్రహిస్తున్నారు. వారికి పాదాభివందనములను సమర్పించుకొంటున్నాను.

అలాగే "వేదాంతవాచస్పతులు, ప్రవచశిరోమణుల" "శ్రీ", "మహా" భాష్యప్రవీణులు, అస్మన్మిత్రవరేణ్యులు శ్రీ ఉ.వే. ప్ర. కందాళైరామానుజాచార్య స్వామివారు తమ "ప్రాజ్ఞుల హితచింతనతో" "అభినవవ్యాసులు" "ప్రవచనవాచస్పతులు" "చతురవచోనిధులు" శ్రీ ఉ.వే.ప్ర. రాఘవన్‌గారు "దాసోऽహం"తో, మహామధురోపన్యాసకులు, ఉభయవేదాంత మహా పండితులు, అస్మత్ సహోదరులు శ్రీ ఉ.వే. ప్ర. శిరిశినగళ్ వేంకటాచార్య స్వామి వారు తమ "ఆనందానుభవంతో" ఈ "అరణ్యకాండను" సుసంపన్నం కావించారు. ఆ పండిత తల్లజులందరికి శిరసాంజలులను సమర్పిస్తున్నాను.

"హిమవత్పర్వత సలిల ధారల నుండి సంభవించి భగీరథాది మహానుభావుల తపః ఫలితంగా, మహా పురుషుల పవిత్ర స్పర్శతో మహిమావంతమై, అనేక ప్రాంతాలను పావనం కావిస్తూ అనేక క్షేత్రాలను సస్యఫలాలతో సంపన్నం చేస్తూ సాగరంలో సంగమిస్తున్న మహానది గంగానది.

అలాగే వాల్మీకి మహా పర్వతం నుండి ప్రభవించి, అనేక మహాత్ముల విద్యా తపః ఫలితంగా వారి హృదయ కేదారాలను రామభక్తి సస్య సంపన్నం కావిస్తూ వారి కుటుంబ ప్రాంతాలను పవిత్రం చేస్తూ, అనంత కాలం నుండి అనవరత ప్రయాణం సాగిస్తూ, రామ సాగరంలో సంగమిస్తున్నది "రామాయణ" మహానది.

"రామ శబ్ద బీజంతోనే తమ విద్యా కృషిని ఆరంభించి, అనేక కష్టనష్టాల కోర్చి, తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి అనితర సాధ్యంగా విద్యార్జనను సాగించి, సమకాలీన సమాజంలో మహా విద్వాంసులుగా తమ ప్రాభవాన్ని నెలకొల్పిన వారు పరమపద వాసులైన అస్మత్పితామహులు శ్రీ ఉ.వే.ప్ర. ఆచి. రాఘవాచార్య స్వామివారు.

ఆ భగీరథుల అపూర్వ తపఃఫలితంగా "రామాయణ" గాంగఝరి మా కుటుంబ ప్రాంతంలోకి ప్రవేశించి వారి పుత్ర, పౌత్ర, ప్రపౌత్రాది పర్యంతము మా మనోక్షేత్రాలను "రామమయం" కావిస్తూ, భక్తి సంపన్నములను చేస్తున్నది.

అట్టి మహానుభావులు పరమపదవాసులు అస్మత్పితామహులైన "శ్రీ ఉ.వే.ప్ర. ఆచి. రాఘవాచార్య స్వామి వారి శ్రీ చరణాలకు" "శ్రీ రామాయణానుభవం"లోని ఈ "అరణ్యకాండ" తృతీయ పుష్పాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో అంకితమిస్తున్నాను".

ఈ "అరణ్యకాండ"కు తమ పవిత్ర ద్రవ్యముతో శాశ్వత అక్షరాకృతిని కల్పించిన మహోదార దంపతులు శ్రీమతి బి. రమాదేవి, శ్రీమాన్ బి. ప్రభాకర్ రావు, (ఈ.ఎన్.సి. ఆర్&బి ఏ.పి. గారు)

ఈ పార్థివ సంవత్సర "శ్రీరామ నవమి" నవరాత్రులలో "శ్రీమద్రామాయణ" ప్రవచనాలను నా చేత జరిపించుకొని శ్రీ సీతారామ చంద్ర ప్రభువుల దివ్య చరిత్ర శ్రవణం చేత ఉత్తేజితులై, తామే ముందుకు వచ్చి ఈ అరణ్యకాండ ముద్రణకు వీరు తమ పవిత్ర కైంకర్యమును సమర్పించుకొన్నారు. వారికి వారి కుటుంబ సభ్యులందరికి ఆయురారోగ్యైశ్వర్యాలను, ఇతోధిక కైంకర్య దీక్షను, భగవద్భాగవత ఆచార్యాభిమానాన్ని ప్రసాదించాలని, అలాగే ఈ "అరణ్యకాండ" ముద్రణలో తమ అమూల్య సమయాన్ని వెచ్చించి, అహర్నిశలు కృషిచేసిన శ్రీమాన్ భూపతిరావు (హెడ్ ఆఫ్ ది పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంటు, డైరెక్టర్ సి.ఇ. ఎస్. ఉస్మానియా యూనివర్సిటి) గారికి వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యైశ్వర్యాలను ప్రసాదించాలని పరమదయా సంపన్నుడైన శ్రీసీతారామచంద్ర ప్రభువును మనసారా ప్రార్థిస్తున్నాను.


ఈ "అరణ్యకాండను" అభిమానంతో స్వీకరించి, రసజ్ఞులైన పాఠకుల విశేషాదరణకు పాత్రము కావించాలని కరుణామయులైన సీతారామ దివ్యదంపతుల శ్రీచరణ కమలాలకు కైమోడ్పులందిస్తున్నాను.

అలాగే ఈ "అరణ్యకాండ" ముద్రణను అందంగా నిర్దుష్టంగా అందించిన ఆర్.వి. ప్రింటర్స్, హైదరాబాదు వారికి అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేసికొంటున్నాను.

సుధీవిధేయుడు

**ఆచి శ్రీనివాసాచార్య**

"శ్రీనివాస నిలయం" సరూర్‌నగర్,
హైద్రాబాద్.



"ప్రాతః స్మరణీయ పాదారవిందులు
"శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య"
శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారు



SRIMANNARAYANA RAMANUJA YAHIBHYO NAMAHA
TRIDANDI CHINNA SRIMANNARAYANA
RAMANUJA JEEYAR SWAMY
JEEYAR EDUCATIONAL TRUST
SITANAGARAM - 522 501
GUNTUR DISTRICT, A.P.
PH. (08645) 272929, 272353

ప్రియశ్రీమన్ ఆచి. శ్రీనివాసాచార్య స్వామిన్!

శ్రీమతే నారాయణాయ నమః

అనేక మంగళాశాసనాలు!

దేవర వారు పంపిన "శ్రీ రామాయణానుభవము" "అరణ్యకాండము" గ్రంథమును చూచితిమి. శ్రీ రామాయణములో "అరణ్యకాండము" చాల ప్రధానమైన భాగము. జీవిత రహస్యములను ఎన్నింటినో ఇందులో తెలియచేస్తుంది.

"వ్యక్తులలో పరస్పరము తేడాలు దేవుడు ఏర్పరచాడా? వేరే ఏదైనా కారణమున్నదా? జీవులలో సుఖదుఃఖాల భేదానికి కారణమేమి? భగవంతునికే చెందిన ఈ జీవుడు ప్రకృతి బద్ధుడై ఉండి, తరించగోరితే గుర్తించదగిన అంశము లేవి? చేయగూడనిదేమి" వంటి కీలకమైన అంశముల నెన్నింటినో వెలువరించే కాండమిా అరణ్యకాండము.

ఉజ్జీవించ గోరే వ్యక్తికి అత్యుత్తమమైన సాధనం 'భాగవతాభిమాన వసతిః', అని నిరూపించేది కూడ అరణ్యకాండమే.

కర్మబంధం తొలగడానికి దండనగ జీవుణ్ణి ఈ జీవనారణ్యంలోనికి పంపిస్తే, ఈ జీవుడు ఎవరినాశ్రయించి ఇందులోంచి తరించవచ్చో సవివరంగ తెలిపే ఈ అరణ్యకాండను శరణాగతికి ముఖ్యమైన 'ద్వయమంత్రం' లోని ఉత్తరార్థాన్ని, పూర్వార్థపు అంతిమపదాన్ని వివరించేదిగ తెలుపుతారు.

అత్యద్భుతమైన ఈ భాగాన్ని దేవరవారు, ప్రవచనముల ద్వార అనుభవించిన రీతిలో, అందమైన శీర్షికలతో ముద్రించడం ముదావహము. ఇది భాగవతోత్తముల హృదయరంజకమై అలరారుగాక!

జై శ్రీమన్నారాయణ!

**చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి**

అస్మద్గురుభ్యోనమః

డా॥ కందాడై రామానుజా చార్య స్వామి
రిటైర్డ్ ప్రిన్సిపల్
శ్రీ వేంకటేశ్వర వేదాంతవర్ధినీ
కళాశాల, సీతారాంబాగ్

# "ప్రాజ్ఞుల లోక హిత చింతనము"

"వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా" అని రామాయణ స్వరూప సాక్షాత్కారము. "సహస్ర మాతాపితృభ్యో వత్సలతరః వేద పురుషః" వేల మంది తల్లిదండ్రుల కంటె అధిక వాత్సల్యము కలవాడు వేదపురుషుడు. ఆ వేదపురుషుడే రామాయణముగా అవతరించెను. తల్లిదండ్రులు తమ సంతానానికి ప్రియమును, హితమును ఆచరించినట్లు వేదము అంతకంటె వేయిరెట్లు ప్రియహితములను ఆచరించును. అట్టి వేదావతారము కూడ సంతానమైన సకల జగత్తు హితమును, ప్రియమును బోధించుటకు సమకట్టిన దనుట సువిదితమే.

ఒక తల్లికి బహు సంతానము ఉండును. ఆమె వారందరికన్నము పెట్టి పోషించునప్పుడు వారివారికి ప్రియములగు పదార్థములనే తినిపించును. ఆ పిల్లలు ప్రయోజకులా? అప్రయోజకులా? అని ఆలోచించి, అప్రయోజకులను పస్తు పడుకోబెట్టునా? లేదు కదా? అట్లే వేదమాతకు కూడ చేతనులందరు బిడ్డలే. వారి వారికి కావలసిన ఫలములకు సాధనములగు ఉపాసనాది సాత్విక కర్మలను, పశుపుత్ర, ధన ధాన్య, గృహ క్షేత్రాది రాజస ఫల సాధన యజ్ఞ కర్మలను, పరహింసా ప్రయోజన సాధనములగు అభిచార కర్మలను బోధించి, వాటి ప్రయోజనములను, అనర్థములను కూడ విశదపరుచును.

ఇట్లే శ్రీరామాయణము కూడ చేతనులందరికి వారు కోరిన అర్థములను బోధించును.

చేతనులు మూడు విధములు. (1) అజ్ఞులు (2) విజ్ఞులు (3) ప్రాజ్ఞులు. కేవలము కథను మాత్రమే విని సంతృప్తిని పొందు సామాన్యులు అజ్ఞులు. విజ్ఞులనగా "విశేషేణ జానంతీతి విజ్ఞాః" అని వ్యుత్పత్తి. కేవలం కథయందే చూపు నిలుపక, దానివలన తెలుపబడు (సజ్జనులకు కావలసిన) ధర్మములను తెలిసికొని, ఆచరించి, తమ నడవడిని సరిదిద్దుకొనుటయే కాక, బాగుపడదలచిన వారికి వాటిని తెలిపేవారు విజ్ఞులు.

ఇక ప్రాజ్ఞులనగా "ప్రకర్షేణ జానంతి" అని వ్యుత్పత్తి. వారు కేవల కథనే కాక,

తద్వారా తెలుపబడు సామాన్య ధర్మాలనే కాక, వాటివలన తెలుపబడే "వేదాంతార్థముల" యందే దృష్టినుంచి చాలా లోతుగా వాటిని అవగాహన మొనర్చుకొని, ఇతరులకు కూడ తెలిపే వారు. వీరు "నిశ్శ్రేయసార్థులు".

శ్రీమద్రామాయణమున ఈ అర్థములు అన్ని ఉన్నవా? ఈ అర్థములను ఉపదేశింప వలెనని వాల్మీకి సంకల్పించి ఉన్నాడా? అన్న ప్రశ్నలు అవగాహన లోపము వలననే కలుగును.

**"ప్రాయేణ పూర్వభాగార్థః ధర్మశాస్త్రేణ కథ్యతే**
**ఇతిహాస పురాణాభ్యాం వేదాంతార్థోపబృంహణమ్"**
**"బిభేత్యల్ప శ్రుతాద్వేదో మామయం ప్రతరిష్యతి"**

అల్పజ్ఞుడు వేదవ్యాఖ్యానము చేయ సిద్ధపడినచో, అపార్థములను కల్పించి, లోకమును వంచించునని, మాతాపితృ సహస్రము కంటె వత్సల తరమగు వేదము భయపడునట. వేదపూర్వ భాగమగు 'కర్మకాండను' ధర్మశాస్త్రములతో, వేదోత్తర భాగములగు ఉపనిషత్తులను ఇతిహాస పురాణములతో సమన్వయ పరచి అర్థమును గ్రహింపవలెనని ఋషుల ఆదేశము. అట్టి సంకల్పము ననుసరించి వేదాంతార్థోపదేశాభిలాష ఋషులకు లేనినాడు, వారు తమ తమ తపస్స్వాధ్యాయములను విడిచి, ఇతిహాస, పురాణ రచన చేయుదురా? అని ఆలోచించవలెను. కావున "రామాయణము ఇతిహాస శ్రేష్ఠమగుటచే దీనిలోని కథా ఘట్టములు, వ్యక్తుల పేర్లు వేదాంతార్థ విశదీకరణములే" అని భావించుట ఋషులకు కృతజ్ఞతను ప్రకటించుటే అగును. శుష్క వేదాంతమును అనగా వేదాంతమును వేదాంతముగా మాత్రమే గ్రహింపజాలని ముముక్షువులకు అట్టి వేదాంతార్థములను కథలో పొదిగి అందజేయుట, ఉపదేశించుట ఋషి హృదయము. ఔషధమును సేవించుటకు ఇష్టపడని తనయునికి, ఆఔషధమును వానికిష్టమైన తేనె, వెన్న మొదలైన రుచ్య పదార్థములతో కలిపి తల్లి తినిపించును కదా!

ఇంతియేకాక ఆలంకారికులు కావ్య లక్షణములను తెలిపి కావ్యములను "ఉత్తమ", "మధ్యమ" "అధమ" ములు అని మూడు విధములని విభజించిరి. "ధ్వన్యర్థ ప్రధానములగు కావ్యములు ఉత్తమములని, వాచ్యార్థమున కంటె భిన్నము కాని వ్యంగ్యార్థ కావ్యములు మధ్యమములని, కేవల వాచ్యార్థమే గల కావ్యములు అధమములని వివరించిరి.

అయినప్పుడు సకల ప్రపంచము ఉత్తమోత్తమ కావ్యముగా ఆదరించు శ్రీరామాయణ మహాకావ్యమునకు ధ్వన్యర్థములే ప్రధానములు కావలెను. అట్టి ధ్వన్యర్థములలో

వేదాంతార్థములే ముముక్షువులకు ముఖ్యములు కదా. ఆ వేదాంతార్థములందు కూడ

**"సర్వేషామేవ ధర్మాణాం । ఉత్తమో వైష్ణవో విధిః**
**రక్షతే భగవాన్ విష్ణుః భక్తానాత్మ శరీరవత్"**

(అని చెప్పుట వలన) శ్రీ వైష్ణవ ధర్మమే విశిష్టము. కావున కావ్యపరముగా, ఇతిహాస పరముగా కూడ శ్రీ రామాయణము, "చేతనా చేతనములన్నిటిని పరమాత్మకు శరీర భూతముల"ని విశ్వసించి, సమర్థించు శ్రీ వైష్ణవ ధర్మములనే ప్రతిపాదించుచున్న దనుట నిర్వివాద విషయము. ఇక వాల్మీకి భగవానుడు శ్రీవైష్ణవుడే యగుటచే అతని వాక్కు నుండి శ్రీ వైష్ణవ ధర్మములే బయట పడును. కనుక కవి తాత్పర్యము కూడ అదియే యగును.

తాత్పర్యము అనగా "తత్ప్రతీతీచ్ఛయా ఉచ్చరితం" అని కదా. ఆ అర్థములనే బోధింపవలెననే ఉద్దేశ్యముతో చెప్పుట తాత్పర్యమనబడును.

వాల్మీకి వైష్ణవ ధర్మావలంబనమే చేసెననుటకు పరమ వైష్ణవాగ్రేసరుడగు నారద భగవానుని శిష్యుడగుటయే ప్రోద్బలకము. శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీరాముని చరితమునే తమ కావ్యకథకు మలచుకొనుట రెండవ ప్రోద్బలకము.

ఈ రీతిగా కవి పరముగా, కావ్యపరముగా, ఇతిహాసపరంగా, ధర్మపరముగా, వేదపరముగా, చేతనపరముగా, ఆరు విధములుగా శ్రీరామాయణము, వేదాంతార్థ ప్రతిపాదకమే. అదియును శ్రీవైష్ణవ ధర్మ ప్రతిపాదకమే అని నిరూపించబడింది. అట్టి వేదాంత నిగూఢమైన శ్రీవైష్ణవ ధర్మమును వ్యంగ్యార్థముగా ప్రాజ్ఞులు మాత్రమే తెలియుదురని, లోకహిత చింతనతో లోకులకు తెలుపుదురని సుస్పష్టము.

అట్టి ప్రాజ్ఞ శిఖామణులే మనకీనాడు "అరణ్యకాండ" స్వాపదేశమును ఉపదేశించిన శ్రీ ఉ.వే. ప్ర. శ్రీమాన్ ఆచి. శ్రీనివాసాచార్య స్వామివారు. వారు అందించిన "అరణ్య కాండ" లో వారి లోకహిత చింతనము ప్రత్యక్షరమున సుస్పష్టమే. సునిశితమైన పరిశీలనా పాటవముతో వ్యాకరణ శాస్త్ర వైదగ్ధ్యముతో పామరులకు కూడ బోధపడవలెననే తలంపుతో, తపనతో, సామాన్య వ్యవహార భాషలో రచన గావించుట వారి హితోపదేశ అభికాంక్షను స్పష్టపరుచుచున్నది.

శబ్దమునకు వ్యుత్పత్తి చెప్పి, పదమును విడదీసి, ప్రకృతి ప్రత్యయములను చూపి, ధాతు నిరూపణతో అర్థ నిరూపణ చేసి అంతటి విశేషార్థముతో లోక వ్యవహారమును దృష్టాంతముగా చూపుట పామరుల యెడ, అజ్ఞుల యెడ, బద్ధుల యెడ శ్రీనివాసాచార్య స్వామివారికున్న విశేష వాత్సల్యమునకు నిదర్శనము. దీనికి దృష్టాంతము "అగస్త్య చరిత"

వ్యాఖ్యానములో "వాతాపి" కథా వ్యాఖ్యానమున "వాతాపి జీర్ణం" అని తల్లులు ఈనాటికిని తమ పాపల బొజ్జలను నిమురుచున్నారనుట.

ఇక ఈ స్వామివారి వ్యాకరణ పాండిత్య నిశిత పరిశీలనలకు దృష్టాంతములుగా కొన్ని వివరణలను పొందుపరుచుచున్నాను. "శ్రీమద్రామాయణములో కథాపరంగా వేదాంత పరంగా అయోధ్య, అరణ్యకాండలు ప్రాధాన్యమును సంతరించుకొనినవి" ఈ ఒక్క మాటే అరణ్యకాండకు తగిన ప్రాధాన్యమీయని వారిచే కూడ అరణ్యకాండ చదివింపబడును. చాలమంది "సీతాపహరణము" మాయామృగ కథా విశేషములు తప్ప అరణ్యకాండలో ఏమున్నదిలే?" అని అనుకొనే వారే. అట్టివారి దృష్టిని ఒక్కసారి "అరణ్యకాండ"పై పడవేయుటకు ఆచార్యుల వారి ఈ ఒక్క మాట చాలును.

పరమాత్మ అయిన రాముని నుండి జీవాత్మ అయిన సీత వేరైనది ఈ అరణ్యకాండ లోనే. వేరైన సీత జాడను (జీవుని జాడను) తెలుపగల వారి జాడ తెలిసినది అరణ్యకాండ లోనే. ఇంతటి విశేషార్థాలను నామకరణమే తెలుపుచున్నదని ఆచార్యుల వారు నామ వ్యుత్పత్తి ని తెలిపిరి.

"అయోధ్యా = యోద్ధుమశక్యా" ఎవ్వరు కూడ యుద్ధము చేసి గెలువరానిది.

ఇంకొక వ్యుత్పత్తి "అకారేణయోద్ధుం శక్యా"

అకార వాచ్యుడైన శ్రీమహావిష్ణువుతో మాత్రమే గెలువదగినది.

ఇట్లే "అరణ్యం" అనగా "రణాయయోగ్యం రణ్యం, రణ్యం, నభవతీతి అరణ్యం", రణము చేయ వీలులేనిది "అరణ్యం", "అకారేణ రణాయ యోగ్యం" శ్రీ మహావిష్ణువుచే రణము చేసి గెలువదగినది. "రణయుద్ధములు రెండింటి అర్థము ఒక్కటే. కాని యుద్ధమంటే ఇంటిపోరు. రణమంటే వీధిపోరు" అనే ఆచార్యుల వారి విశ్లేషణ హృదయంగమము.

"జీవులకు గెలువరానివి" కామము, క్రోధము, అసూయ, పుత్రవ్యామోహాము. ఇవన్నియు అయోధ్యలే. దశరథుని కామవివశత, మంథర అసూయ, కైక పుత్ర వ్యామోహము, మూర్ఖత్వము రామాయణ కథా గమనాన్నే మార్చాయి. ఆగాధలన్ని ఉన్న కాండ అయోధ్యకాండ. రామునిచే గెలువబడిన కాండ అయోధ్యకాండ.

"ధర్మాధర్మముల సంఘర్షణలో ధర్మ పక్షపాతియై, పితృ వాక్యపాలన" చేసి ధర్మ సంస్థాపనలో రాముడు మాత్రమే గెలిచిన కాండ అయోధ్యకాండ".

"ఇక అరణ్యమనగా సంసారమే. కామపిపాసి అయిన రావణుడు శ్రీరామ పత్నిని హరించుట వలన సీతారామలక్ష్మణుల జీవితాలు దుఃఖమయమైనవి. సీతాదేవికి కలిగిన

మృగాభిలాష, శూర్పణఖా వ్యామోహము, రావణుని అహంకారము ఇవన్ని ఉన్న సంసారారణ్యములో మనము గెలువగలమా? ఒక్క రాముడే కదా గెలువగలడు.

అయోధ్యకాండ "గాయత్రీ" మంత్రములోని "వరేణ్య" శబ్దార్థాన్ని, అరణ్యకాండ రాముని తేజస్సును తెలిపినది కనుక "భర్గ" శబ్దార్థాన్ని బోధించినద"ని ఆచార్యుల వ్యాఖ్య యుక్తియుక్తము, మనోరంజకము. ఈ రెండు కాండల శబ్దార్థములను తెలిపి చదువరులలో చదివించే అభిలాషను ఆచార్యుల వారు రేకెత్తించారు. ఆ కాండలలోని వేదాంతార్థ ప్రతిపాదకమైన శబ్దార్థ వ్యుత్పత్తి ప్రదర్శనను దిఙ్మాత్రముగా చూపెదను.

"అయోధ్య = పరమపదము, "అరణ్యము" = సంసారము.

"సంసారము వివిధ విచిత్ర వ్యక్తి, ఘటనా పరిపూర్ణము. అరణ్యము కూడ, ఋషులు, మహర్షులు, యోగులు, భక్తులు, ఆటవికులు, దానవులు, రాక్షసులు, అనురక్తులు, విరక్తులు, ఆసక్తులు, వైరాలు, ఆదరము, పూజ, అవమానము, యుద్ధము ఇవన్నియు ఉన్నది అరణ్యమే మరి" ఇది ఆచార్య వ్యాఖ్య.

"తాపస" శబ్దమునకు "సే" అంతకర్మణి అను ధాతువు వలన తాపములను అంతము చేసుకొనిన వారని ఆచార్య వ్యాఖ్య.

"విరాధః" - ఆరాధన లేనివాడు "విగతోరాధః" అనగా ముఖముతో ఆరాధించని వాడు, అన్నమును ఆరాధించనివాడు.

"శరభంగుడు" - "శర్యతే ఇతి శరః - శరంభంజయతీతి శరభంగః" నశించు శరీరమే శరము. దానిని భంగము చేయువాడు. శ్రీ రాముని ముందు తన శరీరమును అగ్నిలో భంగము కావించుకొని మోక్షము పొందినవాడు శరభంగుడు.

"సుతీక్ష్ణః" - అతి తీవ్ర స్వభావము కలవాడు - కామాదులను కన్నెత్తి చూడనివాడు.

"మాండకర్ణి" - మండాయ "క"+ఋణి" అని విభజించి, భోగానుభవము కొరకు తపస్సు చేసి సుఖమును అప్పుతెచ్చుకొన్నవాడు" అని ఆచార్య వ్యాఖ్య.

"సరస్సు" : "సరతీతి సరః" దినదినము ఆయువును ప్రసరింప (క్షీణింప) జేసేది సరస్సు.

"తటాకము" : తట+అకము అని విడదీసి, పరిసరములలో దుఃఖమును నింపుకొన్నది.

"పదివేల సంవత్సరాలు" : పది ఇంద్రియాలు

"గీత వాద్యములు" : విషయములు

"అగస్త్యః" : "అగస్త్యాయతి" – పర్వతమును నిరోధించిన వాడు, అహంకారమును నిరోధించువాడు.

"ఇల్వలః" : ఇలతే, వలతే ఇతి ఇల్వలః : స్థిరముగా చుట్టుకొనువాడు.

"వాతాపి" : వాతేన ఆప్తి – ప్రాణవాయువును పొందిన వాడు. ప్రాణమును పోగొట్టు కొనువాడు.

జనన మరణ సంసార చక్రములో, వాతాపి మమకారము ఇది స్వామివారి వ్యాఖ్య.

"మేషము" : మా+ఈష = ప్రకృతి యందు కోరిక అనగా మోహము. మమకారమే మోహముగా మారును – ఇది ఆచార్యుల వారి అద్భుత విశ్లేషణ.

ఇట్లు కొన్ని వ్యుత్పత్తులను దిఙ్మాత్రముగా చూపితిని. ఇంకనూ ఆచార్యుల వారి పాండిత్య ప్రకర్షను, వైభవమును చూపుట సూర్యునికి దివిటీ పట్టుటే. రెండవది గ్రంథ విస్తరణ భీతియే.

ఒక శబ్దమును, కథను, ఘట్టమును, సందర్భమును ఎట్లు పరిశీలించ వలెను, ఎట్లు ఆలోచించవలెను, విశ్లేషించవలెను, అర్థము చేసికొన వలెను. ఇత్యాది రీతులన్నిటికి ఆచార్యుల వారి కృషి ఉత్తమ ప్రతీక. వారి "లోకహిత చింతన"కు ఇది పరమాదర్శము.

ఇట్టి అరణ్యకాండను ప్రత్యక్షరము సావధానముగా చదివి, ఆచార్యుల వారు చూపిన లోతులను తెలిసి, ఆనందించి రామాయణ కథాసుధను, తత్త్వహిత పురుషార్థములను ఆచార్యుల ఉపదేశాను రూపముగా గ్రహించి, ఆచరించి, తరించ వేడుచున్నాను.

ఇట్లు
భాగవత పాదరేణువు
**డా. కందాడై రామానుజాచార్య**

మహామధురోపన్యాసక, ఉభయ వేదాంత విద్వాన్
**శ్రీ ఉ.వే.ప్ర. శిరిశినగళ్ వేంకటాచార్య స్వామి,**
కంఠేశ్వర్, నిజామాబాద్.

# ఆనందానుభవము

పరమాత్మ ఆనందధాముడు, పరమానంద స్వరూపుడు, అఖిలాత్మలకు ఆయన సన్నిధి ఆనందానుభవాల పెన్నిధి.

ఆయన సన్నిధిలో శాశ్వతంగా ఉండవలసిన ఆత్మలం - మహానందాన్ని అనుభవింపవలసిన వాళ్లం.

ఎందుకో మరి! ఈ ప్రకృతి పంకిలంలో మునిగి తేలుతున్నాం? మురికి శరీరాల్లోకి మారి మారి దూరుతున్నాం!

ఏనాడో ఒకనాడు మన ఈ పరిస్థితి మారాలి. జనన మరణాల చిక్కుముడి విప్పుకోవాలి. అమృతత్వాన్ని అందుకోవాలి.

దానికి దారి చూపుతుంది "శ్రీరామాయణం". అరణ్యకాండ దానికి గుండె లాంటిది. రామకథలోని అసలు ప్రాణం అందులో ఉంది. శ్రీ రామాయణంలో బాల, అయోధ్య కాండల కథ అరణ్యకాండకు ఉపోద్ఘాతం. తరువాత కాండల కథ అరణ్యకాండకు ఫలశ్రుతి.

శ్రీరాముని అవతార ప్రయోజనం సాధురక్షణ. దుష్టశిక్షణ దాని అనుబంధమే. అరణ్యకాండలో అది అమలుపరచబడింది. శ్రీరాముడు సీతమ్మ సాక్షిగా సాధు రక్షణ కొరకు శపథం చేసింది ఇందులోనే. దుష్టశిక్షణ కొరకు అగస్త్య మహర్షి అందించిన ఆయుధాలు పుచ్చుకొంది ఇక్కడే. మనిషిగా తనను తాను మలచుకొన్న మహాపురుషునిలో దాగి ఉన్న దివ్యశక్తులు ఒక్కటొక్కటిగా ఇక్కడే బయటపడడం మొదలైంది. రావణ వధానంతరం ఆయన అసలు తత్వం అందరికీ తెలిసింది.

ఇంతటి ప్రాముఖ్యం గల అరణ్యకాండ అంతరంగం విప్పి చూడాలి. అప్పుడే మనకు మృత్యు సంసారం నుండి అమృతత్వానికి చేరుకొనే దారి దొరుకుతుంది. శ్రీరాముడు అయోధ్య నుండి అడవికి బయలు దేరాడు. మహారణ్యంలో ప్రవేశించాడు. తోడునీడలా సీతమ్మ ఆయనను అనుసరించింది. లక్ష్మణుడు వారి సేవలో ముందుకు నడిచాడు.

శ్రీరాముడు పరంధాముడు. సీతమ్మ శ్రీ మహాలక్ష్మి. లక్ష్మణుడు ఆదిశేషుడు, ఆచార్య స్వరూపుడు.

అయోధ్య అంటే పరమపదం. అరణ్యం ప్రకృతి మండలం. మహారణ్యం మనమున్న భూమి. దానికే "దండకారణ్యం" అని పేరు. మనము చేసికొన్న పుణ్య పాపాల ఫలితాలను కఠినంగా అనుభవింపజేసే వాని కార్య స్థలమిది.

పరమపద నాథుడే సపరివారంగా వచ్చి ఈ లోకంలో సాక్షాత్కరించినట్లుగా సీతా లక్ష్మణ సమేతుడైన శ్రీరామచంద్రుడు దండకారణ్య ఋషులకు దర్శనమిచ్చాడు.

శ్రీరామచంద్రుని దివ్యదర్శనం మునిజనులను ముగ్ధపరిచింది. దండకమండలాలు పక్కన పెట్టారు. సర్వ రక్షకుని సన్నిధిలో శరణాగతి చేశారు. వారి ఆత్మ సమర్పణంతో రాముని మనస్సు కరిగింది. వారి రక్షణాభారాన్ని తానే మోయడం మొదలుపెట్టాడు.

శరభంగుడు మహా తపస్వి. అంతిమ దశలో అతనికి దర్శనమిచ్చాడు శ్రీరాముడు. స్వర్గాదిభోగాలను కాలదన్నాడు శరభంగుడు. సర్వతపః ఫలాలను స్వామి శ్రీపాదాలలో సమర్పించి ఆనందధామాన్ని అందుకొన్నాడు.

జటాయువు ఒక పక్షి. అయితేనేం? సీతమ్మ కోసం శత్రువుతో పోరాడి తన ప్రాణాలనే అర్పించింది. పరమాత్మ కృపతో మహాత్ములు కూడ అందుకోలేని మహోన్నత స్థానాన్ని అందుకొంది.

తన సేవకన్న తన వాళ్ల సేవ భగవంతుని దృష్టిలో ఎంతో విలువైనది. శబరిమాత ఆచార్య సేవలో తరించింది. ఆచార్యుడు పరమాత్మకు ప్రాణం వంటివాడు. ఆచార్య సంబంధం ఉన్న జీవులకు తానే వైకుంఠం కృపజేస్తాడని మన పూర్వాచార్యుల నిర్వాహము.

శ్రీరాముడు మతంగాశ్రమం దాకా వెళ్లి ఆమెకు దర్శనమిచ్చాడు. స్వామి కృపతో ఆమె హరి పదంలో ఆచార్య పాదాలకు ఆత్మ సమర్పణం చేసింది.

ఇలా పరమాత్ముని సేవగా మన సకల కర్మ ఫలాలను సమర్పించినా భగవత్, భాగవత, ఆచార్య సేవలో మన సర్వశక్తులు ధారవోసినా జీవితపు అంతిమ దశలో పరమాత్మ కరుణా కటాక్షాలతో మహానంద రూపమైన మోక్షాన్ని అందుకోవచ్చంటుంది అరణ్యకాండ.

అయితే శరభంగుడు, జటాయువు, శబరి వీళ్లంతా జ్ఞానులు. ఏదో రకంగా పరమాత్మను ప్రేమించిన వాళ్లు.

కాని విరాధుడు, ఖరదూషణాదులు, కబంధుడు మొదలైన వారు రాక్షసులు. ఆత్మ స్థితిని మరచిన శాపగ్రస్తులు. విరాధుడు పరమాత్మను ఆరాధించని వాడు. ఖర దూషణాదులు చేతల్లో మాటల్లో పురుషోత్తముని పట్ల పరుషత్వం ప్రదర్శించిన వాళ్లు. కబంధుడు పరమాత్మను కూడ పొట్టన పెట్టుకోవాలనుకొన్నవాడు. వీరిని గూడ తన దర్శన స్పర్శనాదులతో తరింపజేశాడు శ్రీరామచంద్రుడు.

పరమాత్ముని నిర్హేతుక కృపకు ఇంతకన్న వేరే నిదర్శనం ఏం కావాలి?

భగవంతుని కృప తప్ప ఈ జీవులను తరింపజేసేది మరొకటి లేదు. అది కలిగే దాక ఎవరి ధర్మాన్ని వారు భగవదర్పణంగా కొనసాగించాలి. ఇది అరణ్యకాండ మనకు అందించే అంతరంగ సందేశం.

ఇలా మన బతుకు బాట బాగుపడడానికి ఎన్నెన్నో రహస్యాలను వినిపిస్తుంది శ్రీ రామాయణం. వాటిని చెవి పెట్టి వినాలి. మనస్సు నిండా నింపుకోవాలి. ఆత్మలో సాక్షాత్కరించుకోవాలి. అనుభవంలోకి తెచ్చుకోవాలి. మహానందంలో మునక లేయాలి.

అలా ఆనందానుభవం పొందిన వాళ్లు ఎందరో ఉండొచ్చు కాని తమ అనుభవాన్ని పదిమందికి పంచాలని తపించే వాళ్లు ఏ కొందరో ఉంటారు. అలాంటి కృపా మాత్ర ప్రసన్నాచార్యులలో శ్రీమాన్ ఆచి. శ్రీనివాసాచార్య స్వామివారు ఒకరు.

శ్రీమాన్ ఆచి. స్వామికి శ్రీరాముడు ఇష్టదైవము. ఇక్ష్వాకు కులదైవం శ్రీరంగనాథుడు వారి ఆరాధ్య దైవం.

వారి తాతగారు శ్రీమాన్ ఆచి. రాఘవాచార్య స్వామివారు శ్రీరామ తత్వాన్ని సాక్షాత్కరించుకొన్నవారు.

వారి పితృపాదులు శ్రీమాన్ మహావిద్వాన్ ఉభయ వేదాంత ప్రవర్తకాచార్యులు ఆచి. నృసింహాచార్య స్వామివారు "అపరవాల్మీకులు". వారి ఊరి కోవెలలోనున్న శ్రీ సీతారామ చంద్రస్వామి తరతరాలుగా ఆచి. వారి కైంకర్యాలను అందుకొంటున్న కరుణామూర్తి.

ఇలా వారసత్వపు వాతావరణంలో శ్రీ రామతత్వం శ్రీనివాసాచార్య స్వామి గుండెలో ఊపిరి పోసుకొన్నది. సదాచార్య సదుపదేశంలో పెరిగి పెద్దదయింది.

అతి గంభీరంగా, అత్యంత మధురంగా వేలాది భక్తులకు "వాల్మీకి హృదయాన్ని" విప్పి చెప్పిన వారి నాన్నగారి అంతేవాసులుగా శ్రీమాన్ ఆచి శ్రీనివాసాచార్య స్వామి వారు "శ్రీరామాయణ రహస్యాల"ను ఆకళింపు చేసికొన్నారు. నిరంతర అధ్యయన, అధ్యాపనాల ద్వారా "శ్రీరామాయణ అమృత సాగరం"లో మునకలేసిన వారి ఆనంధాను భవం అగాధం, అపారం.

వారు దర్శించి, అనుభవించిన లోకాభిరాముని ఆనందతత్వాన్ని అక్షరరూపంగా మన కళ్లముందుంచారు. అదే "శ్రీరామాయణానుభవం"గా మన చేతిలో ఉంది.

ఇంతకు ముందు "బాలకాండ" "అయోధ్యకాండ"లలో వారందించిన మధురాను భవాన్ని నెమరువేసుకొంటూ "అరణ్యకాండ"లోని అమృతత్వాన్ని అనుభవిద్దాం!

ఇతిశం

"ప్రవచన వాచస్పతి"
"చతురవచోనిధి"
"అభినవవ్యాస"
**డా॥ టి.కె.వి. రాఘవన్**
ఫోన్: 55734223
సెల్: 9849351724

శ్రీ వేంకటేశ్వర ఎన్‌క్లేవ్,
10-35/12/34,
రెడ్ క్రాస్ వెనుక, గడ్డి అన్నారము,
హైద్రాబాద్ - 60.

# దాసోఽహమ్

ప్రకృత కృతి "శ్రీ రామాయణానుభవము - అరణ్యకాండ" భక్తి వినయాకృతి. "వినయ" శబ్దానికి "చక్కని శిక్షణ" అని అర్థం చెప్తారు. సాంప్రదాయాన్నే దాయంగా స్వీకరించి, తమ వంశీయులు తీర్చిదిద్దిన బాటలో నడుస్తూ "ఋషి ఋణము" తీర్చుకొనే ప్రయత్నం కొనసాగిస్తున్న సదాచార నిష్ఠులు, సదాచార్య ప్రవణులు, ఉ.వే.ప్ర. శ్రీనివాసాచార్య స్వామివారు.

రామాయణ, భారత, భాగవతాదుల మీద ఏ ప్రక్రియ చేపట్టినా తమ పేరు (ముద్ర) తగిలించుకొని "..................... రామాయణము", "............ భాగవతము" అంటూ ప్రచురించుకోవడం చాలామందికి అలవాటు. కాని ఆచార్యులవారు ఆ ప్రయత్నం చేయలేదు. సరికదా! విశిష్టమైన రీతిలో నామకరణం చేశారు, "శ్రీరామాయణ అనుభవము", నిజమే "శ్రీరామాయణ పఠనము, పారాయణము, శ్రవణము, ప్రవచనము... ఇత్యాదుల ద్వారా కలిగిన అనుభూతి విశేషమిది. ఇంతకు ముందు, "బాల", "అయోధ్య" కాండలు వెలుగు చూచాయి. ఇప్పుడు "అరణ్యకాండ" వెలువడుతోంది.

**"చత్వారివాక్ పదా పరిమితాని - తాని విదుః మనీషిణః బ్రాహ్మణాః యే గుహా త్రీణి నిహితా నేంగయంతి - తురీయం వాచో మనుష్యాః వదంతి... యతో వాచో అనాప్తం తన్మనుష్యా ఉపజీవంతి"**

వాక్కు (శబ్దము) నాలుగు భాగములలో మూడు ప(పా)దాలు గుహలో రహస్యంగా ఉండిపోతాయి. మనకి అవి అందవుట. బ్రహ్మనిష్ఠులకి, తత్వవేత్తలకి మాత్రమే అవి దర్శనమిస్తాయి, అనుభవానికి వస్తాయి. మనం మాట్లాడగల్గింది, వినగల్గింది నాల్గవ భాగమే.

సత్సంప్రదాయ నిష్ఠ కలిగి యుండి, సదాచార్య సమాశ్రయణము చేసి, గురూపదేశ

ప్రాప్తమైన మంత్రానుష్ఠానము కలిగి, అధ్యయనం చేసే శాస్త్రము మీద విశ్వాసము నిలిపి, “ఏకస్స్వాదు నభుంజీథాః” అన్నట్లు తాము ఎరిగినది పదిమందికి పంచాలని అనిపించిన మహానుభావులు “మనీషులని”, “బ్రాహ్మణులని” నిర్వచించింది వేదము. వారు పలికే మాటలే ప్రవచనములు, అనుభవ రూపములైన సూక్తములు అవుతాయి. అందుకే ఇది “రామాయణ అనుభవము”.

“నా దృష్టిలో రామాయణము”, “నేనూ భగవద్గీత”ల వంటి గ్రంథము కాదిది. తరతరాలుగా ఎందరెందరో రామాయణ విశేషాలను వారి శైలిని అనుసరించి వివరించగా, వాటిని అవగాహించి, తమదైన రీతిలో మనకి అందించడానికి చేస్తున్న ప్రయత్నం ఇది. ఈ గ్రంథంలో ప్రతి పదము, ప్రత్యక్షరము “గాలికి పోగుచేసి” మలచింది కాదు, సాధికారికంగా చెప్పినదే. ఆచార్యులవారు ఎదురుగా ఉండి మనతో సంభాషిస్తున్నట్లుంటుంది.

రామాయణమును (ఇతర గ్రంథాలను కూడ) అధ్యయనం చేసేవారు కాండలకి పూర్వాపరముల సమన్వయము జోలికి పోవడము ఉండదు. చాలమందికి “రామాయణమంటే సుందరకాండ” అంతే. ఇలాంటి భావముతో ఈ రచన సాగలేదు. “అరణ్యకాండ” అని ఎత్తుకొన్నా, ఇతర కాండ(ము)ల తోసంబంధాన్ని కలుపుకొంటూ సాగింది.

చక్కని శీర్షికలు, మంచి వివరణ, పర్యాయపదాలుగా కనిపించే “యుద్ధము” “రణము” అన్న పదాల వ్యంగ్యార్థాన్ని “అయోధ్య”, “అరణ్యకాండ”లకి సమన్వయం చేయడం భోగ్యముగా ఉంది. “దదర్శ తాపసాశ్రమమండలం” అని వాల్మీకి సూచన ప్రాయంగా అన్న మాటని ఎంత అందముగా వివరించారు ఆచార్యులవారు “విరాధుని” సంగతి చెప్పనక్కర లేదు. ఆచార్యుల వారి వివరణను ఆస్వాదించండి. ప్రతి ఘట్టాన్ని హృద్యంగా మలిచారు.

ఆచార్యులవారి వినయానికి (క్రమశిక్షణకు) “ఉపయుక్త గ్రంథసూచి” యివ్వడం సూచిక. చెప్పవలసిన విషయాలను సంగ్రహంగా, సమగ్రంగా చెప్పి, విశేషంగా తెలిసికొన గోరేవారు ఆయా గ్రంథాలని చూస్తారుగదా అని స్వామివారి ఆకాంక్ష! ఇది పై తరము వారిని ఉద్దేశించి కాదు. వారి తరానికి దిగువనున్న అస్మదాదులను ఉద్దేశించి. మా తరువాత తరం వారిని సంభావించి, వక్తలుగా, ఉపన్యాసకులుగా ఎదుగుతున్న వారు ఇది గమనించగలిగితే అదృష్టమే!

ఆచార్యా! తమ కృషికి దాసో2హమ్, అంతకన్న వేరు మాట అందడం లేదు.

దండవత్ప్రణామములతో

**రాఘవన్**

శ్రీ రామాయ నమః

# అరణ్యకాండము

శ్రీమద్రామాయణములో కథాపరంగా అయోధ్య, అరణ్య కాండలు చాల ప్రభావవంతంగా ఉన్నాయి. మానవ జీవితంలో కూడ ఈ రెండు కాండలు చాల ప్రధానమైనవే.

"అయోధ్య" అంటే "యోద్ధుమశక్యా" అని వ్యుత్పత్తి. శత్రువులెవ్వరికి కూడ గెలవ డానికి వీలులేని నగరమిది.

మానవ జీవితములో కామము, అసూయ, పుత్రవ్యామోహాలు గెలువరానివే (అయోధ్యలే). దశరథుని కామవివశత, మంథర యొక్క అసూయామాత్సర్యాలు, కైకేయి యొక్క పుత్ర వ్యామోహము, మూర్ఖత్వము రామాయణ కథా గమనాన్నే మార్చి వేశాయి. పట్టాభిషిక్తుడై ప్రజారంజకంగా పరిపాలించవలసిన రామభద్రుడు అడవుల పాలైంది వీటి వలననే కదా! "అయోధ్య" అంటే మరొక అర్థము కూడ ఉంది. "అ" అంటే భగవంతునికి మాత్రమే "యోద్ధుం శక్యా" అంటే స్వశక్తితో సాధ్యమైనది. (అది పరమ పదమే) అకారమునకు అర్థమైన శ్రీరాముడు ధర్మాధర్మముల మధ్య సంఘర్షణలో గెలిచాడు. ధర్మపక్షపాతియై, పితృవాక్యపాలన మొనర్చి "ధర్మ సంస్థాపనార్థాయ" అన్న తన అవతార ప్రయోజనాన్ని నిర్వహించాడు.

అందువలన "అ" కారవాచ్యుడైన రాముడు అయోధ్యలో వరేణ్యుడయ్యాడు. అసూయా వ్యామోహవివశలైన మంథర, కైకేయిలు తమ ప్రయత్నాలు విఫలమై, పాపిష్ఠులుగా మిగిలిపోయారు.

అలాగే "అరణ్యకాండ" కూడ రామాయణకథపై, మన జీవితాలపై కూడ చెరిగిపోని ముద్రను వేస్తుంది. "రణ్యం నభవతీతి అరణ్యం" అని అరణ్య శబ్దానికి వ్యుత్పత్తి. "రణము చేయుటకు సాధ్యము కానిది" అని అరణ్య శబ్దార్థము. అరణ్యమంటే సంసారమే.

కామపిపాసి అయిన రావణుడు శ్రీరాముని సంపద అయిన సీతాదేవిని అపహరించి, అరణ్యములో పదునాలుగేండ్లు ప్రశాంతంగా గడిపి అయోధ్యకు తిరిగి వెళ్లవలసిన సీతారామ లక్ష్మణుల జీవితాలను దుశ్శకమైన శోకానికి గురిచేసింది అరణ్యకాండలోనే.

అలాగే సీతాదేవికి ఆకస్మాత్తుగా కలిగిన మారీచ మృగాభిలాష (మృగమరీచిక), శూర్పణఖా (విషయ) వ్యామోహము, రావణుని (అహంకార) స్వభావాలతో ఈ సంసారారణ్యములో మనము పోరాడి గెలువగలమా?

"అ" భగవంతుని అవతారమైన శ్రీరామునికి మాత్రమే "రణ్యం" గెలువదగినది (సంసార) అరణ్యము. గాయత్రీ మంత్రములోని "భర్గ" శబ్దాన్ని వివరిస్తూ శ్రీరాముని తేజస్సును ప్రకాశింప జేస్తుంది అరణ్యకాండ. "మునుల ఆశ్రమాలలో పదునాలుగు సంవత్సరాలు ప్రశాంతంగా గడుపుకొని అయోధ్యకు తిరిగి వెళ్లకుండా మనకు ఈ అకారణ రాక్షస వైరము ఎందుకండీ" అని ప్రశ్నించిన సీతాదేవికి "అప్యహం జీవితం జహ్యాం। త్వాం వా సీతే సలక్ష్మణాం" సీతా! రాక్షసులతో రణంలో నా ప్రాణము పోయినా ఫరవాలేదు. నిన్ను, లక్ష్మణునితో కూడ వదలు కోవడానికైనా సిద్ధమే. అంతేకాని మహర్షుల కిచ్చిన మాటను వదలుకోవడానికి అంగీకరింపజాలను. **"నతు ప్రతిజ్ఞాం సంశ్రుత్య, బ్రాహ్మణేభ్యో విశేషతః"** అని ధీరోదాత్తంగా, తేజస్వంతంగా సమాధానమిచ్చాడు రామచంద్ర స్వామి.

మొత్తముపైన మనము వదలుకోవలసిన "విరాధ" "ఖర" "శూర్పణఖ" "కబంధాది" రాక్షసుల వికృత స్వభావాలను రావణుని కామాహంకారాలను, మహర్షుల "భరన్యాస" సుకృత స్వభావాన్ని అరణ్యకాండ అపురూపంగా అందిస్తుంది.

యుద్ధ (అయోధ్య), రణ (అరణ్య) శబ్దాలు ఒకే అర్థాన్ని ఇచ్చేవిగా కనిపించినా యుద్ధమంటే "ఇంటి పోరు అని" "రణము అంటే రాక్షసులతో రచ్చ పోరు" అనే అర్థాలను రామాయణము సూచిస్తుంది.

మహాద్భుతమైన ఈ అరణ్యకాండలోనికి మనము ఇక అడుగిడుదామా?

ఇతిశం

"ఈ నేలపై నదులు, గిరులు నిలిచినంత కాలం
రామనామము జనుల మనస్సులలో నిలిచి ఉంటుంది".

# తాపసాశ్రమాలు

**"ప్రవిశ్యతు మహారణ్యం । దండకారణ్య మాత్మవాన్**
**దదర్శరామో దుర్ధర్షః । తాపసాశ్రమ మండలమ్"**

ఆత్మవంతుడు దుర్ధర్షుడు అయిన శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతంగా దండకారణ్యములో ప్రవేశించాడు. అరణ్యమును గెలువ గలిగిన శ్రీరామలక్షణాలు రెండు. (1) ఆత్మవత్త్వము (2) దుర్ధర్షత్వము. సీతాలక్ష్మణులతో కూడ శ్రీరాముడు దశరథ చక్రవర్తి ఛాయలో అయోధ్యలో ద్వాదశ సంవత్సరాలు అత్యంత సుఖసంతోషాలను అనుభవించాడు.

"అయోధ్య" అనబడే పరమపదములో పరమాత్మ నిత్యముక్త జనుల మధ్య, శేష సింహాసనుడై విష్వక్సేన పర్యవేక్షణలో అందరితో కలసి ఆనందాన్ని అనుభవిస్తుంటాడు.

దూరంగా ఉన్న తన సంతానము దుఃఖాలను అనుభవిస్తుంటే భరింపజాలని దయామయుడైన తండ్రి ఆ తనయుల దగ్గరికే వెళ్లి వారిని కాపాడినట్లు, ఆనందంగా అయోధ్యలో అన్ని సుఖాలను అనుభవిస్తుండే శ్రీరాముడు కైక కోరిక అనే నెపంతో మహర్షుల దుఃఖ నివారణార్థము అరణ్యంలోకి ప్రవేశించాడు.

అయోధ్య పరమపదమైతే అరణ్యమే సంసారము. సంసారమువలె అరణ్యము కూడ ఆశ్చర్యకరమైనది. ఒకవైపు ఋషులు, మహర్షులు సంపూర్ణ భక్తి ప్రపత్తులతో భగవంతుని పై భారము వేసి, తపోమయంగా జీవితాలను గడుపుకొంటుంటే, మరొకవైపు స్వార్థము, అహంకారము దౌర్జన్యాలతో కరుడుగట్టిన దానవులు సాధువులను, సజ్జనులను క్రూరంగా హింసిస్తూ భయంకరంగా జీవిస్తుంటారు.

అదుగో! సాధువులై సర్వభారములను తనపై వేసి సత్పురుషులైన మహర్షులను సంరక్షించడానికి శ్రీరామచంద్ర స్వామి సీతాలక్ష్మణ సమేతంగా సంసారారణ్యంలోకి ప్రవేశించాడు.

పూర్వము దక్షిణాపథములో "దండకుడ"నే ధరణీ విభుడు తన సామ్రాజ్య పాలనను సాగించాడు. ఒకరోజు మెరుపువంటి సౌందర్యము కల శుక్రపుత్రి అతని కంట పడింది. కన్నుమిన్ను కానని ఆయన కామము ఆ అబలను కాటువేసింది. ఆగ్రహోదగ్రుడైన శుక్రాచార్యుడు ఆ అవనీపతిని "అసురునివి కమ్మ"ని శపించాడు. అప్పటి నుండి ఆ దండకుడు అసురుడయ్యాడు. అతని రాజ్యము దుర్గమారణ్యము అయింది.

శ్రీరాముడు సీతాలక్ష్మణులతో కలసి, ఆ దండకారణ్యములో ప్రవేశించగానే స్థానికులైన సంయమీంద్రులు వారికి మనఃపూర్వకంగా స్వాగతాంజలులను సమర్పించారు.

ఆకాశంలో సూర్యమండలమువలె, అరణ్యములో తాపసుల ఆశ్రమ మండలము ప్రకాశించింది. ఆ అరణ్యము అనేక మృగ, పక్షి గణ సమావృతమైనది. అప్సరసలు అక్కడికి వచ్చి అనునిత్యము పూజలు జరుపుకొంటారు.

ఆ ప్రాంతమంతా ప్రతిరోజు యజ్ఞయాగాలతో వేదఘోషలతో నిండి ఉంటుంది. అక్కడి మహర్షులందరు సూర్య వైశ్వానర తేజస్సులతో, నియతాహారులైన బ్రహ్మవేత్తలు.

"సే" అంతకర్మణి అనే ధాతువును బట్టి ఆ మహర్షులకు ప్రాపంచిక తాపములు అంతమయ్యాయి. అందువలన తాపసులనగా తాపములు అంతమైన వారు. వారి ఆశ్రమములే తాపసాశ్రమములు. తాపసులకు సంసార సంబంధమైన శ్రమలు లేవు. వారి సమూహములే తాపసాశ్రమ మండలులు. "తాపస+ఆశ్రమ+మండలులు, తాపస+అశ్రమ+మండలులు కూడ.

శ్రీరామచంద్రుడు ఆ మునుల కన్నుల ముందు ఉదయిస్తున్న చంద్రునివలె ఆహ్లాద కరంగా కనుపించాడు. సీతాదేవి పురుషకార యశస్సుతో శోభిస్తూ వారికి దర్శనాన్ని ప్రసాదించింది. సౌమిత్రి కైంకర్య లక్ష్మీ సంపన్నుడై వారికి ఆనందాన్ని అందిస్తూ ముందు నిలిచాడు. విస్మితులైన ఆ సంయమీంద్రులు ఆ ముగ్గురికి దృష్టిదోషము తగులకుండా వారికి మంగళాశాసనములను చేయసాగారు. భగవద్గోష్ఠికి దృష్టిదోషము తగులకుండా తత్ క్షణమే మంగళాశాసనము చేయడమే ప్రపన్నకర్తవ్యము కదా!

నగరవాసులైన ఆ ముగ్గురికి వనవాసులు హార్దికంగా ఆతిథ్యాన్ని సమర్పించారు. వారి చర్యలతో పరమ ప్రీతుడైన రామచంద్రస్వామి ముందు తమ ఆవేదనను నివేదించు కొన్నారు.

"రాఘవా! నగరవాసులైన నీ ప్రజలు తమ ఆదాయంలో ఆరవ భాగాన్ని పన్నుగా చెల్లించినట్లే వనవాసులమైన మేము ఆర్జించిన మా తపస్సులో నాల్గవ భాగాన్ని మహారాజుకు పన్నుగా సమర్పిస్తాము. కాబట్టి మేము కూడ నీ రక్ష్య కోటిలోని వారమే.

లోకపాలుల అంశలతో కూడినవాడే భూపాలుడు. పృథివి వలె మహారాజు క్షమను కల్గి ఉంటాడు. చంద్రుని వలె ప్రియ దర్శనుడు. జలాలను కొద్దికొద్దిగా పీల్చివేసే సూర్యుని వలె, ప్రజల ఆదాయాల నుండి కొద్ది కొద్దిగా రాజు పన్నులను వసూలు చేస్తాడు. వర్షాలను వర్షించి భూమిని సస్యశ్యామలం చేసే వరుణుని వలె తటాకముల ద్వారా సేద్యజలాన్ని, త్రాగునీటిని అందించి భూపాలుడు తన రాజ్యాన్ని సుభిక్షం చేస్తాడు.

అధికారపాశంతో అధికారులను నిగ్రహిస్తాడు. తనముందున్న దేనినైనా దహించే అగ్నిహోత్రుని వలె ఎంతటి శత్రువీరులనైనా తన పరాక్రమంతో భస్మం చేస్తాడు. సకల లోక సంరక్షకుడైన సురేంద్రుని వలె నరేంద్రుడు తన ఆశ్రిత లోకానికి సంరక్షణ కల్పిస్తాడు. యమునిలె దండన విధిస్తాడు. వాయువువలె చారుల ద్వారా అంతట ప్రవేశిస్తాడు.

"ఇంద్రో మాయాభిః పురురూప ఈయతే". "ఇది పరమైశ్వర్యే" అనే ధాతువును బట్టి పరమేశ్వరుడవైన నీవు నీ అమోఘ సంకల్పంతో నలుగురు కుమారులుగా దశరథునికి జన్మించావు.

మేము నీ రాజ్యంలోని వారము. నీవు ఆర్త రక్షా దీక్షితుడవు. మేము తపోదీక్షితులము. నీవు దండధారివి. మేము దండాయుధమును వదలినవారము. నీకు గర్భ భూతులము. శిశువును సంరక్షించే మాతవలె మమ్ము నీవే సంరక్షించాలి. నీ శరణాగతే మా ధనము" అని ఆ పార్థివేశ్వరుని పరమర్షులు అనేక విధాల ప్రార్థించారు.

ఇతిశం

"అనుచరుడైన హనుమను - భవిష్యత్ బ్రహ్మగా
మలచిన మహా మహితాత్ముడు శ్రీరాముడు"

"ఈ నేలపై నదులు, గిరులు నిలిచినంత కాలం
రామనామము జనుల మనస్సులలో నిలిచి ఉంటుంది".

# విరాధుడు

సంసారము మంచి చెడుల కలయిక కదా! దండకారణ్యము కూడ ఋషులకు రాక్షసులకు కూడ నిలయమైంది. మొదట మహర్షుల మంగళ స్వాగతములందుకొన్న రామచంద్రుడు ఇప్పుడు విరాధుడనే ఘోరాసురుని వలలో చిక్కుకొంటున్నాడు.

"విగతోరాధః విరాధః" ఆరాధన లేనివాడు విరాధుడు. "ముఖతో2స్మాన్నగ్ం రాధ్యతే" (ముఖముతో) ఆరాధింపదగినది అన్నము. "అన్నం పరంబ్రహ్మ", "అన్నం న నింద్యాత్" అన్నం బహుకుర్వీత" మొదలైన వాక్యాలతో అన్నము ఆరాధింపదగినదని వేదము వివరిస్తున్నది.

"అన్నం బహుకుర్వీత" అంటే "తాను సంపాదించిన అన్నాన్ని తాను, తనవారు, అతిథులు, అభ్యాగతులు అందరు తిని తృప్తి పడేలా వాడుకోవడం" అని అర్థము. "ఆరాధ్యస్మా అన్నమిత్యా చక్షతే" అతిథి, అభ్యాగతుల కొరకు వినియోగమవడం వలననే అన్నము అనబడుతుంది.

అలా కాకుండా, ఎవ్వరికి మిగిల్చక, తానొక్కడే అందరి అన్నాలను దోచుకొని, తిన్నంతా తిని, మిగిలినదానిని వ్యర్థముచేయడం అన్నము పట్ల ఆరాధన లేక పోవడం అవుతుంది. అటువంటి స్వభావము కలవాడే (అన్నాన్ని అనాదరణ చేయువాడే) విరాధుడు.

మన సమాజములో అన్నము పట్ల ఆ విధంగా ఆరాధన లేని వారెందరో మన నిత్య జీవితంలో అగుపడుతూనే ఉంటారు. వారందరికి ప్రతినిధే "విరాధుడు".

విరాధుడు పర్వతమంత ఎత్తుతో, పెద్ద గుహ వంటి నోరుతో, రక్తము వంటి ఎఱ్ఱని కళ్లతో, పిడుగువంటి కంఠధ్వనితో భయంకరంగా ఉంటాడు. రక్తంతో తడిసిన పచ్చిపులి తోలును ధరిస్తాడు. తిన్నదంతా తిని, తన శూలానికి మూడు సింహాలను, నాలుగు పెద్ద పులులను, రెండు తోడేళ్లను, పది లేళ్లను, ఒక పెద్ద ఏనుగు తలను కుచ్చుకొని వచ్చాడు.

సీతారామలక్ష్మణులను చూడగానే యమునివలె పరుగెత్తి వచ్చాడు. వికృతంగా సీతాదేవిని చంకలోనికి ఎత్తుకొన్నాడు. "ఈ సుందరి నా స్వంతమైంది – అడ్డు వచ్చారో మీ మాంసాన్ని తిని, మీ రక్తాన్ని త్రాగుతాను" అని వికటాట్టహాసం చేశాడు.

శ్రీరాముడు ఆ పరిస్థితిని చూచి వికలమనస్కుడై ఎండిపోతున్న నోటితో, "లక్ష్మణా మీ వదిన దుస్థితిని చూచావా? మనను అడవికి పంపుమని కైకేయి కోరిన కోరిక చివరకు ఎలా ఫలించిందో గమనించావా? పదునాలుగేండ్ల భయంకర అరణ్యవాసం కంటె నా సీత ఈ రాక్షసునికి పరాధీనం కావడమే నాకు దుర్భర దుఃఖదాయకమైనది" అని దీనంగా విలపిస్తూ లక్ష్మణునితో పలికాడు.

అన్నగారి దైన్యము లక్ష్మణుడిలో ఆగ్రహావేశాలను పెంచింది. ఆదిశేషుని వలె భయంకరంగా బుసలు కొడుతూ అతడు విరాధుని వైపు గుడ్లురిమి చూస్తూ "ఎవడివిరా నీవు? ఈ అడవిలో ఎందుకు ఇలా తిరుగుతున్నావు?" అని గర్జించాడు. శ్రీరాముడు కూడ ధైర్యాన్ని తిరిగి తెచ్చుకొని రాక్షసాధముని ఆ ప్రశ్ననే రెట్టించాడు.

విరాధుడు వికటంగా నవ్వుతూ, "నేను జయుడి పుత్రుడను. నా తల్లి శతహ్రద. నా పేరు విరాధుడు. నా తపస్సుకు మెచ్చిన బ్రహ్మదేవుడు "శస్త్రాస్త్రాలన్నిటితో నీవు అవధ్యుడవు" అని నాకు వరమిచ్చాడు. మీ బ్రతుకుల మీద మీకు ఆశ ఉంటే ఈ అతివను నాకు వదలి పారిపొండి" అని హుంకరించాడు.

రాక్షసుని ఆ మాటలు విన్న శ్రీరాముడిలో ఆగ్రహము కట్టలు తెంచుకొంది. ఆయన ఏడు బాణాలను విరాధునిపై ప్రయోగించి, ఆ రాక్షసుని రక్తసిక్తుని కావించాడు. వాడు ప్రయోగించిన శూలాయుధాన్ని మార్గమధ్యంలోనే ముక్కలు చేశాడు. సీతాదేవి చంకలో ఉన్నందువలన పోరాటానికి ఆటంకమవుతున్నదని గ్రహించిన విరాధుడు ఆమెను క్రింద దించి, రామలక్ష్మణులిద్దరిని రెండు చంకలలో ఇరికించుకొని పరుగు తీయసాగాడు.

వారిద్దరిని ఎత్తుకొని వెళ్లుతున్న దృశ్యాన్ని చూచి భయకంపితురాలైన సీతాదేవి తనను ఏ అడవి మృగమో తప్పక తింటుందని భావించి, వారిద్దరికైనా విముక్తిని కల్పించాలను కొని, "రాక్షసా! వారిద్దరిని వదిలిపెట్టు. కావాలంటే నన్నే అపహరించుమ"ని ఆక్రోశింప సాగింది.

వైదేహి విషాదవాక్కులను వింటున్న రామ లక్ష్మణులు వెంటనే తమ ఖడ్గాలతో వాడి రెండు బాహువులను ఖండించారు. తన భుజాలు రెండు తెగిపడిపోవడంతో రాక్షసుడు నేలపై పడి రక్తంలో కొట్టుకోసాగాడు. రామలక్ష్మణులు ఆ రాక్షసాధముని తమ పిడికిళ్లతో, మోకాళ్లతో బలంగా మోదసాగారు. వాడి ఒళ్లంతా పిండి పిండి అయింది. అయినా వాడు చావలేదు.

అప్పుడు శ్రీరాముడు తన సోదరునితో "వీడు శస్త్రాస్త్రాలతో వర ప్రభావం వలన చావడు. కనుక వీడిని బ్రతికి ఉండగానే పాతిపెట్టుదాం" అన్నాడు.

అప్పుడు విరాధుడు శ్రీరామునితో “కౌసల్యానందనా! ముందు నేను మోహము వలన మిమ్ము గుర్తించలేదు. నేను పూర్వజన్మలో తుంబురుడను. ఒకనాడు రంభా సంగ వ్యామోహము వలన, కుబేరుని సేవలను మరచిపోయాను. అందువలన నన్ను “రాక్షసుడివి కమ్మ”ని కోపంతో కుబేరుడు శపించాడు. శాపోపసంహారము కొరకు నేను వేడుకోగానే “దాశరథి నిన్ను యుద్ధంలో సంహరించగానే శాపము తొలిగి, తిరిగి గంధర్వుడవై స్వర్గానికి చేరుకొంటావు” అని వైశ్రవణుడు వివరించాడు. “మీ దెబ్బలను తిన్నందువలన నా శాపవృత్తాంతము గుర్తుకు వచ్చింది. రాక్షసులకు ఖననం ద్వారానే విముక్తి కలుగుతుంది. కనుక నన్ను పూడ్చిపెట్టి మీరు ఇక్కడికి అర్ధయోజనం దూరంలో ఉన్న సూర్యసన్నిభుడైన శరభంగ మహర్షిని వెంటనే సందర్శించండి. ఆయన మీకు శ్రేయస్సును కల్గిస్తాడ”ని వివరించాడు. అప్పుడు లక్ష్మణుడు ఏనుగు అంత లోతు బిలాన్ని త్రవ్వాడు. రామ లక్ష్మణులు అందులో రాక్షసుని పడగొట్టారు. అప్పుడు విరాధుడు పెట్టిన బొబ్బలతో ఆ అడవి అంతా ప్రతిధ్వనించింది. రామలక్ష్మణులు ఆ బిలాన్ని మట్టితో రాళ్లతో కప్పివేశారు. రామలక్ష్మణులు విరాధ వధ తరువాత మేఘముల నుండి బయటికి వచ్చిన సూర్యచంద్రుల వలె ప్రకాశించారు.

విరాధుడు ఆహారము పట్ల ఆరాధన లేని వాడని ఆయన శూలానికి కుచ్చుకొన్న పులులు, లేళ్లు, ఏనుగు తల, రక్తముతో తడిసిన వ్యాఘ్ర చర్మము వలన తెలిసింది. వాడికి ఆహారము పట్లనే కాక సమాజము పట్ల కూడ ఆరాధన లేదు.

ఎవ్వరికున్న దానితో వారు సంతృప్తి చెందడం సమాజ ధర్మము. విరాధుడు ఆ ధర్మాన్ని లెక్క చేయక సమాజ సంపద అంతా తన స్వంతమే అని భావించాడు. శ్రీరాముని ధర్మపత్ని అయిన సీతాదేవిని స్వాధీనం చేసికోవాలని ప్రయత్నించాడు. అడ్డువచ్చిన రామలక్ష్మణులను పరిమార్చడానికి ప్రయత్నించాడు. చివరకు వాడి అధర్మమే వాడిని దైవస్వరూపులైన శ్రీరామలక్ష్మణుల చేతులలో నశింప జేసింది.

ఆధునిక సమాజంలో అనేకమంది విరాధులు ఉన్నారు. అయితే విరాధుని చరిత్రవలన గుణపాఠం నేర్చుకోవడానికి వారు ఎవ్వరు సిద్ధంగా లేరు. తమ పాపాలు ఎల్లప్పుడు అలాగే కొనసాగుతాయని, తమకే శిక్ష కూడ పడదని, తాము చిరంజీవులమని వెఱ్ఱిగా నమ్ముతారు. ఈ ప్రపంచము పిచ్చిది కదా!

ఇతిశం

# శరభంగ మహర్షి

విరాధ వధ తరువాత సీతా లక్ష్మణులను శ్రీరామచంద్రుడు ఓదార్చి శరభంగాశ్రమము వైపు వారితో కలిసి బయలుదేరాడు.

శరభంగాశ్రమమునకు సమీపంలో వారికొక అద్భుతము కనుపించింది. సూర్యాగ్నుల సమానకాంతితో అక్కడ ఒక రథము నిలబడి ఉంది. దానిని పచ్చని గుఱ్ఱాలు వహించాయి. ఇంద్రుడు అనేక దేవతలు చుట్టు ప్రక్కల నిలువగా నేలపై కాలుమోపకుండా క్రిందికి దిగాడు. కొంతమంది ఆయన తలపై చంద్రుని వంటి తెల్లని గొడుగును పట్టుకొన్నారు. వెండి దండములు కల చామరాలను, విసనకఱ్ఱలను పట్టుకొని సురస్త్రీలు అతనికి వీచసాగారు. దేవ, గంధర్వ, మహర్షులు అతని స్తోత్రగానం చేయసాగారు. శ్రీరాముడు ఇంద్రుని, అతని రథ హయ పరివారమును గుర్తించి లక్ష్మణునికి వివరించాడు.

శరభంగాశ్రమము లోపల మహర్షితో మాట్లాడుచున్న మహేంద్రుని పలుకులు విన దలచి లక్ష్మణుని సీతాదేవితో కూడ అక్కడే నిలిపి, శ్రీరామచంద్రుడు మహర్షి ఆశ్రమాన్ని సమీపించాడు. రాముడు వస్తుండడాన్ని గమనించిన పురందరుడు మహర్షితో తాను రావణవధ వరకు శ్రీరాముని చూడజాలనని, తాను శ్రీరాముని ఇప్పుడు దర్శిస్తే దైవకార్యము విఘ్నమవుతుందని తెలిపి వెంటనే దేవలోకానికి అనుచరులతో కలిసి తిరిగి వెళ్లాడు.

తరువాత శ్రీరాముడు సీతా లక్ష్మణ సమేతుడై శరభంగ మహామునిని అతని ఆశ్రమములో సందర్శించి, దండవత్ప్రణామములను ఆచరించాడు.

సంయమీంద్రుడు మానవేంద్రునికి దేవేంద్రుడు వచ్చి వెళ్లిన విషయాన్ని వివరించాడు. "తపోధనులకు, శమదమాది సాధన సంపన్నులకు కూడ సాధ్యము కాని బ్రహ్మలోకానికి రమ్మని అమరేంద్రుడు నన్ను ఆహ్వానించాడు. కాని నా తపశ్శక్తితో పురుషోత్తముడివైన నీవు సీతాలక్ష్మణులతో నా ఆశ్రమ సమీపంలో నిలువడం గమనించి నీకు ఆతిథ్య మివ్వడమే ముఖ్యమని భావించి, మహేంద్రుని మాటను నిరాకరించాను. రామభద్రా! నేను తపశ్శక్తితో ఆర్జించిన దివ్యలోకాలన్నిటిని నీకు సమర్పిస్తాను స్వీకరింపు"మని శ్రీరాముని శరభంగుడు ప్రార్థించాడు.

అప్పుడు రామచంద్రుడు "మునీంద్రా! నాకు కావలసిన లోకాలన్ని నేనే సంపాదించు కొంటాను. ఈ అరణ్యములో మాకు ఆవాస స్థానాన్ని నిర్దేశించండి" అని వేడుకొన్నాడు.

శరభంగుడు అక్కడికి సమీపములో తూర్పువైపు ప్రవహిస్తున్న ఒక పుణ్య నదికి ఎదురుగా పశ్చిమ ముఖంగా వెళ్తే, అక్కడ ఉంటున్న సుతీక్ష్ణ సంయమి నివాసస్థలాన్ని నిర్దేశిస్తాడని శ్రీరామునికి నివేదించి, అతని సమక్షములోనే అగ్నికి తన శరీరాన్ని ఆహుతి గావించుకొన్నాడు. భస్మమైన ఋషి శరీరం నుండి దివ్యకాంతితో మూడు పదుల వయస్సు గల ఒక దివ్యపురుషుడు బయలుదేరి బ్రహ్మలోకాన్ని చేరుకొన్నాడు.

"శ్రూ" హింసాయాం అనే ధాతువును బట్టి "శర్యత ఇతి శరః" అని శరానికి వ్యుత్పత్తి. శరము అనగా బాణము. అది హింసకు కారణమైనది. శరీరము కూడ హింసానుభవానికి కారణమైనది. అందువలన శరమంటే శరీరానికి ప్రతీక.

"శరభంగము" అంటే "శరీర విమోచనము లేక శరీర భంగము". శరభంగుడు తన తపశ్శక్తితో తన జీవితకాలంలోనే "జీవన్ముక్త స్థితిని" చేరుకొన్నాడు. అమోఘములైన అనేక తేజో లోకాలను ఆర్జించుకొన్నాడు. బ్రహ్మ లోకానికి రమ్మని స్వయంగా అమరేంద్రుడే ఆహ్వానించాడు.

అయితే మహర్షి తపశ్శక్తితో సాధించుకొన్న అమరలోకాలు, ఇంద్రుడు ఆహ్వానించిన బ్రహ్మలోకము సత్కర్మసాధ్యాలు. కర్మ అచేతనమైనది. కర్మఫలము అల్పము, అస్థిరము. బ్రహ్మలోకము అంటే "చతుర్ముఖ" బ్రహ్మలోకము. అది కూడ అల్పమైంది, అస్థిరమైందే.

శాశ్వతము, అక్షయానంద ప్రదమైనది పరమాత్మ యొక్క అసాధారణమైన పరమపదమే. అది భగవదనుగ్రహము వలననే లభిస్తుంది. అందుకే శరభంగ మహర్షి అమరేంద్రుడు ఆహ్వానించిన చతుర్ముఖ బ్రహ్మలోకాన్ని నిరాకరించి, పరాత్పరుడైన శ్రీరామునికి అత్యంత ప్రియంగా ఆతిథ్యమిచ్చి ఆ పరమాత్మ యొక్క కరుణా కటాక్ష వీక్షణములు తనపై ప్రసరిస్తుండగా హోమాగ్నికి తన దేహాన్ని ఆహుతిచ్చి అక్షయము, అనంతానందప్రదమైన బ్రహ్మలోకాన్ని అనగా పరమపదాన్ని చేరుకొన్నాడు.

శరభంగ సంయమీంద్రుడు రామచంద్రుని రాకను ముందుగా కోరుకొనలేదు. అయితే ఆ మహర్షి జీవితాంతము ఆచరించిన అమోఘ తపోయజ్ఞములకు పరమాత్మ ప్రీతి చెందాడు. ఆయనను పరమ భాగవతోత్తమునిగా గుర్తించాడు. అందుకే స్వయంగా తానే సీతాలక్ష్మణ సమేతంగా ఆ తపోగరిష్ఠునికి అంత్యకాలంలో దర్శనమిచ్చాడు.

అంతేకాదు శ్రీరాముడు ఆ మహానుభావుని దర్శించింది సాధారణంగా కాదు. ఎవ్వరికైనా కావలసినవి రెండు: (1) ఇష్టప్రాపణము, (2) అనిష్టనివారణము. అంటే కావలసింది ఇవ్వడము, ఇష్టముకాని దాన్ని తొలగించడము.

శరభంగుడు మహాత్ముడు. ఆతనికి వ్యక్తిగత ఇష్టానిష్టాలు వేరే ఏవి లేవు. సమాజహితమే ఆయన హితము.

ఆనాటి ఋషి సమాజమునకు ప్రమాదకరుడు విరాధుడు. విరాధవధ సమాజానికి శ్రేయస్కరము. విరాధ ప్రమాదాన్ని నివారించడమే మహర్షికి ప్రమోదకరము. అందుకే "విరాధం రాక్షసం హత్వా శరభంగం దదర్శహ" అన్నట్లు విరాధవధతో ప్రమోదాన్ని కల్గించి శ్రీరాముడు శరభంగుని సందర్శించాడు. ఆయనకు పరమపదాన్ని అనుగ్రహించాడు.

ఇతిశం

"అతిహేయమైన గ్రద్దకు కూడ - అపునరావృత్తిని
అందించింది - శ్రీరాముని ఘన మహిమే".

# మహర్షుల శరణాగతి

శరభంగ మహర్షి దివానికి ఏగగానే అక్కడి మహర్షులందరు శ్రీరాముని సేవింప వచ్చారు. వారిలో అనేక విధాల మహర్షులున్నారు. బ్రహ్మ నఖసంజాతులై విఖనసముని సంప్రదాయమును అనుసరించే వైఖానసులు, క్రొత్త ఆహారము లభింపగానే పాతది పారవేసుకొనే బ్రహ్మ యొక్క రోమజాతులైన వాలఖిల్యులు, ఎల్లప్పుడు తడిబట్టలను ధరించే ఆర్ద్రవాససులు, నిరంతర తపోనిష్ఠులైన తపోనిత్యులు, ఉపవాసమే వ్రతముగాగల వ్రతోపవాసులు, భూమిపైననే శయనించే స్థండిలశాయులు, నీరునే ఆహారముగా గ్రహించే సలిలాహారులు, గాలినే మ్రింగి ఉంటుండే వాయుభక్షులు, పంచాగ్నుల మధ్య తపస్సులు చేసే పంచతపోనిత్యులు, బొత్తిగా పడుకోవడమే లేక నిలుచొని, కూచొని ఉండే అశయ్యులు, రాతిలో ధాన్యమును దంచుకొని తినే అశ్మకుట్టులు, ఆకులు తింటుండే పత్రాహారులు, సూర్యకిరణాలను పానము చేసే మరీచిపులు, కంఠము వరకు నీటిలో మునిగి ఉండే ఉన్మజ్జకులు, నిరంతరము శరీరమును కడుగుకొనే ప్రక్షాళకులు మొదలైన ఎన్నో రకాల తపస్వులు ఉన్నారు.

విరాధ వధ గావించిన శ్రీరాముని అసమాన పరాక్రమమును, శరభంగ మహర్షి - మహేంద్రుని కంటె మిన్నగా నిర్ణయించిన రాముని పురుషోత్తమత్వమును గుర్తించిన మునీంద్రులు శ్రీ రామచంద్రస్వామికి శరణాగతి కావించారు. **"ఏహి పశ్య శరీరాణి। మునీనాం భావితాత్మనాం"** అని అనేక రాక్షసులు తపో మగ్నులయిన మహర్షుల శరీరాలను కబళించి వేసిన దృశ్యాన్ని, గుట్టలు గుట్టలుగా పడి ఉన్న ఋషుల ఎముకల రాశులను రామభద్రునికి చూపెట్టారు. గ్రామాలలో నగరాలలో ఉండే ప్రజలు తమ ఆదాయాలలో ఆరవ వంతును, అడవులలో ఉండే ఋషులు నాలుగవంతు తపస్సును రాజుకు సమర్పిస్తారని అందువలన ప్రజలతో పాటు, మహర్షులైన తాము కూడ రాజు చేత రక్షింపబడే వారమేనని తెలిపారు. అంతేకాదు రాజు నగరంలో ఉన్నా, అడవిలో ఉన్నా, ఆయనే రక్షకుడని తెలిపారు.

శ్రీరామచంద్రుడు వారి మాటలు విని చాల నొచ్చుకొన్నాడు. **"ఉపస్థేయైరుపస్థితః"** అన్నట్లు నేనే స్వయంగా మీ దగ్గరకు రావలసినవాడిని కదా! అయ్యో మీరే స్వయంగా నా దగ్గరికి వచ్చారే? మీరు కోరక ముందే మిమ్ము రక్షింపవలసిన వాడిని. అటువంటిది మీరే రక్షింపుమని కోరవచ్చారా? ఎంత పొరపాటు జరిగింది?

ఇక ముందు ఏ మాత్రము ఆలస్యము చేయను. నేను, నా తమ్ముడితో కలసి ఆపద తలపెట్టిన రాక్షసులందరిని హతమారుస్తాను. నా అరణ్య వాసము మిమ్ము రక్షించినందు

వలన సార్థకము కాగలదు. మీరు నన్ను మీ రక్షణకై ప్రార్థించడం కాదు. ఆజ్ఞాపించండి. మీ ఆజ్ఞను నెరవేర్చడమే మా కర్తవ్యము" అని అభయమిచ్చాడు.

శరభంగ మహాముని మహాతపశ్శక్తిశాలి. ఆయన ప్రభావంతో ఆ ప్రాంతంలోని ఋషులు సాధారణ జనులు, సాధుజంతువులు శత్రు బాధలేక, వైరి భావము లేక హాయిగా ఉన్నారు. కాని చిత్రకూట ప్రాంతము, మందాకిని, పంపానది ప్రాంతాలలోని మహర్షులు రాక్షసాక్రమణకు గురి అయ్యారు.

శరభంగ మునీంద్రుడు దివానికి వెళ్లిన తరువాత ఆయన ఆశ్రమ ప్రాంతంలోని వారందరు కూడ అభద్రతకు గురి అయ్యారు.

అంతేకాదు తపోనిష్ఠులైన మహర్షులందరు భగవద్ధ్యాన పరాయణులుగా ఉంటారు. వారు తమ శరీర రక్షణను ప్రధానంగా భావింపరు. అటువంటి వారందరు అనుకోకుండా "కుంటివానిపై గంగ ప్రవహించినట్లు", "వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లు" పరమాత్మే తమ వద్దకు రావడాన్ని గమనించి తమ అదృష్టానికి తబ్బిబ్బై ఆశ్రిత రక్షాదీక్షితుడైన శ్రీరామచంద్రుని "శరణు" వేడారు.

శరణాగతినే "భరన్యాసము" అంటారు. అంటే శరణు వేడినవారు తమ రక్షణ భారాన్ని పూర్తిగా (పరమాత్మపై) రక్షకునిపై ఉంచుతారు **"న్యాసమేషాం తపసాం అతిరిక్తమాహుః"** అన్నట్లు (భర) న్యాసము అన్ని తపస్సుల కంటె గొప్పది.

శరణాగతులు రక్షకునికి శరీరము వంటి వారు అవుతారు. తన శరీరమును తానే రక్షించుకొన్నట్లు శరీర భూతులైన ఆశ్రితుల రక్షణ బాధ్యత కూడ అతనిదే అవుతుంది.

శరణాగతిలో దేశకాలాది నియమాలు లేకున్నా విషయ నియమము ఒక్కటే ముఖ్యంగా ఉంటుంది. "విషయ నియమము" అనగా "ఎవ్వరిని ఆశ్రయించవలెను?" అనే నియమము.

ఇక్కడ మహర్షులు శరణు వేడింది సాక్షాత్తుగా ధర్మసంస్థాపనకై అవతరించిన శ్రీరామచంద్ర పరమాత్మనే. అందువలననే వారు రామభద్రుని శరణువేడి తమను కృతకృత్యులుగా భావించుకొని నిశ్చింతగా తమ తపస్సులలో నిమగ్నమయ్యారు. ఇక తమ రక్షణ రామచంద్రుని బాధ్యతే అని గుర్తించి నిర్భరంగా ఉండిపోయారు.

ఇతిశం

# సుతీక్ష్ణా శ్రమము

శ్రీరామచంద్రస్వామి సీతా లక్ష్మణ సమేతంగా కొందరు మునులు వెంటరాగా సుతీక్ష్ణాశ్రమానికి బయలుదేరాడు. కొంతదూరము వెళ్లి లోతైన నదులను అనేకము దాటి దట్టమైన అడవిలోకి ప్రవేశించాడు.

కొంతదూరము వెళ్లిన తరువాత నారచీరలు గల ఒక ఆశ్రమాన్ని, అక్కడ మలినమైన జడలుగల్గి, తపోవృద్ధుడైన సుతీక్ష్ణ సంయమిని చూచాడు. ఆయనతో "నేను రాముడను, మిమ్ము సేవింపవచ్చానని" పలికాడు.

మహర్షి ధర్మవేత్తలలో ముఖ్యుడైన రాముని చూచి, ఆతినిని కౌగిలించుకొని "మహా వీరా! మీకు స్వాగతము. నీ రాకతో మా ఆశ్రమము సనాథమైనది. నీ కొరకు ఎదురు చూస్తున్నాను. అందువలన ఈ శరీరము విడిచి స్వర్గమునకు వెళ్లలేదు.

నీవు రాజ్యము వీడి చిత్రకూటము చేరుకొన్నప్పటి నుండి నీ గురించి వింటున్నాను. దేవరాజైన మహేంద్రుడు నన్ను సమీపించి నా పుణ్యము వలన అన్ని పుణ్య లోకాలు నాకు వశమయ్యాయని చెప్పాడు. నీకు వాటిని దానం చేస్తాను. వాటిలో నీవు భార్యా సహితంగా విహరించుము" అని తెలిపాడు.

అందుకు శ్రీరామచంద్రుడు, "మహాత్మా! అన్ని పుణ్యలోకాలను నేనే సంపాదించు కొంటాను. గౌతమ గోత్రజుడైన శరభంగ మహర్షి వలన మీ ప్రభావము విన్నాను. అరణ్యములో మేము కొంతకాలము ఉండుటకు స్థలాన్ని తెల్పండి" అని మనవి చేసి కొన్నాడు.

అందుకు సంతోషముతో సుతీక్ష్ణర్షి "రామా నీవు భార్యా సోదర సమేతంగా ఇక్కడే ఉండవచ్చును" ఈ ఆశ్రమము ఫల, మూల సంపన్నమై, అభయమై మృగపక్షిగణ సంసేవితమై ప్రశాంతమైనది" అని తెలిపాడు.

అప్పుడు శ్రీరాముడు "మహర్షీ! మాకు ఈ ఆశ్రమము సరి అయినది కాదు. ధనుర్ధారులమై, మృగములను వేటాడే మా వలన మీ ఆశ్రమ ప్రశాంతతకు భంగము కలుగుతుంది" అని నివేదించుకొన్నాడు. అంతలో "సాయం సంధ్యా" సమయమైనందు వలన, సంధ్యావందనములు చేసికొన్నారు. ఆ రాత్రి సుతీక్ష్ణుడు వారికి తాపసాహారాన్ని కల్పించాడు. ఆ రాత్రి వారు సుఖనిద్రను పొందారు. ఉదయాన్నే లేచి కాలకృత్యాలను, దైవకార్యాలను నిర్వర్తించుకొని సుతీక్ష్ణ మునిని సందర్శించి, మిగిలిన ఋషుల ఆశ్రమాలను దర్శించ అనుమతిని వేడారు.

మహర్షి వారిని మరొకమారు ఆలింగనము చేసికొని, "శ్రీరామచంద్రా! ఫలపుష్ప భరితములు, పుణ్య సలిలమయములైన మునుల ఆశ్రమాలన్ని సందర్శించి, మళ్లీ మా ఆశ్రమానికి తిరిగి రావాలి" అని తెలిపాడు.

సీతాదేవి రామలక్ష్మణులకు ధనుర్బాణ తూణీరాలను, ఖడ్గాలను అందించగా వాటిని ధరించి రూపసంపదలతో ఆ అడవిని ప్రకాశింపజేస్తూ వారు బయలు దేరారు.

సుతీక్ష్ణుడు తీక్ష్ణమైన తపస్సును చేసి అనేక పుణ్యలోకాలను ఆర్జించుకొన్న మహానుభావుడు. ఆయన సీతారామలక్ష్మణులు తన ఆశ్రమానికి రానున్నారని ముందుగానే గుర్తించి, తన ప్రాణాలను నిలుపుకొన్న సంయమీంద్రుడు. వారికి ప్రియమైన ఆతిథ్యమును సమకూర్చడమే కాక, కర్మఫలరూపంగా తాను ఆర్జించిన పుణ్యలోకాలను కూడ "శ్రీరామార్పణము" కావింప సిద్ధపడిన పరమ ప్రపన్నుడు. పుణ్యపాపములను తొలిగించుకొని పరమపదమునకు మార్గమును సిద్ధము చేసికొన్న పరమ భాగవతోత్తముడు.

శ్రీరామచంద్రుడు సత్ క్షత్రియుడు. దానము చేయడమే కాని ప్రతిగ్రహమునకు సిద్ధపడని మహోత్తముడు. "సత్ప్రవర్తన వలన మానవుడు ఎన్ని ఉన్నత లోకాలనైనా సాధించు కోవచ్చు"నని నిరూపించిన మహోన్నతుడు. భగవంతుడెప్పుడు భక్తుల మధ్య ఉండడానికే ఇష్టపడుతాడని సూచిస్తూ మహర్షుల ఆశ్రమ మండలిని దర్శించాలనే తన తపనను శ్రీరాముడు ఆవిష్కరించాడు. మొత్తము మీద మంచితనములో శ్రీరామ సుతీక్ష్ణులిద్దరు ఒకరినొకరు మించిపోయారు.

ఇతిశం

"ఉడుత చేసిన బుడుత సాయాన్ని -
సాయమెత చేసిన శాశ్వతుడు
- సాకేత రాముడు"

# సీతాదేవి హితోక్తి

సుతీక్ష్ణాశ్రమము నుండి ఋషులెవ్వరు తోడులేకుండానే సీతారామలక్ష్మణులు మిగిలిన ఋష్యాశ్రమ సందర్శనాభిలాషతో అడవిలో బయలు దేరారు.

సీతాదేవిని చాల కాలం నుండి మనస్సులో ఒక ఆలోచన బాధిస్తున్నది. శరభంగ మహర్షి ఆశ్రమ ప్రాంతములో సంయములందరు "తమను రక్షింపుమని, రాక్షసులను శిక్షింపుమని" రామునికి శరణాగతి చేశారు. శ్రీరామభద్రుడు ఋషులందరికి "భద్రాన్ని కల్పిస్తానని" అభయమిచ్చాడు. ఇకముందు మునులకు రాక్షస భయము లేకుండా చూస్తానని, తాను, తన సోదరుడు కలసి సమస్త దుష్టరాక్షస సంహారము కావిస్తానని వాగ్దానం చేశాడు.

సీతాదేవి శ్రీరాముని ప్రియ పత్ని. పతి అనుసరణలోనే అమర లోక సౌఖ్యాలన్నిటిని అన్వేషించుకొన్న పతివ్రతా శిరోమణి. (శివధనుర్భంగమును స్వయముగా వీక్షించిన) ఆ వీరపత్నికి శ్రీరామభద్రుని అవక్ర పరాక్రమము పట్ల ఆవగింజంత అయినా అవిశ్వాసము లేదు. అయితే శ్రీరామచంద్రుని అవాఙ్మానస గోచర సౌందర్య సౌకుమార్యాలు ఆయన అరిభీకర విక్రమాన్ని ఆమె మనస్సులో కప్పివేశాయి. అందువలన తన అభిప్రాయాన్ని కాంతా సమ్మితంగా ఆయనకు తెలియజేయాలని ఆ ఉత్తమురాలైన ఉవిద అభిలషించింది.

కాబట్టి ఆ కాంత తన ప్రియకాంతునితో ఈ విధముగా అన్నది.

"ప్రాణ నాథా! మనము పదునాలుగేండ్లు పదిలంగా గడుపుకొని అరణ్యవాసాన్ని ముగించుకొని అయోధ్యకు తిరిగి వెళ్లాలనుకొన్నాము. అందుకొరకు ఈ అరణ్యములో ఋష్యాశ్రమాలలో కాలము ప్రశాంతంగా గడుపుకొని వెళ్లకుండా శరభంగాశ్రమ ప్రాంతంలో మహర్షులందరికి రాక్షస భయాన్నుండి అభయప్రదానం చేశారు. ఎందుకండీ మనకు భయంకరులైన రాక్షసులతో అకారణ వైరము? మనకు ఆహారసముపార్జనార్థమే ఆయుధాలు ఉపయోగపడాలి. కాని ప్రశాంతమైన ఆశ్రమ ప్రాంతాలలో ఆయుధాలతో అవసరమే లేదు కదా!

ప్రియవల్లభా! మానవజీవితంలో వినాశకరమైన వ్యసనాలు మూడు ఉంటాయి. (1) అసత్య భాషణము, (2) అన్యస్త్రీగమనము (3) అకారణ వైరము. ఈ మూడింటిలో "అసత్య భాషణము" ఆ ఒక్కవ్యక్తికే నరకాన్ని కలిగిస్తుంది. "అన్యస్త్రీ గమనము" తనతో

పాటు ఆ స్త్రీల జీవితాలకు కూడ వినాశకరమైనది. ఇక "అకారణ వైరము" తనను, తనతో పాటు అమాయకులైన తనవారినందరిని నశింపజేస్తుంది.

ఆర్యపుత్రా! పూర్వము ఒక మహర్షి తీవ్రమైన తపస్సును ఆచరింపసాగాడు. శతక్రతువు శతవిధాల అతని తపస్సును ఆప ప్రయత్నించినా సాధ్యము కాలేదు. అప్పుడు అమరేంద్రుని మనస్సులో అమోఘమైన ఒక ఆలోచన కలిగింది. మరుక్షణమే మహేంద్రుడు ఒక నిశితమైన ఖడ్గాన్ని ఆ మహర్షికి అప్పగించి తాను "తిరిగి వచ్చేదాకా ఆ ఖడ్గాన్ని కాపాడుమ"ని అంతర్హితుడయ్యాడు. మహర్షి మనస్సులో ఆ క్షణం నుండి తపస్సాధనము కంటె ఖడ్గాన్ని కాపాడడమే ప్రధానమై నిలిచింది. అప్పటి నుండి ఆ ఖడ్గాన్ని చేతిలో ధరించే తపశ్చరణముతో పాటు తదితర కార్యక్రమాలన్ని ఆ ముని నిర్వహింప సాగాడు. "అనవరత ఆయుధ ధారణము" ఆ పరమర్షి పరమసాత్విక ప్రకృతిని పరిమార్చి "ఆ ఆయుధాన్ని ఎవ్వరు అపహరిస్తారో" అనే అనుమానమును, "అపహరించిన వారినెవ్వరినైనా హతమార్చవలసిందే నన్న ఆగ్రహమును" ఆయన మనస్సులో క్రమంగా వ్యాపింపజేసింది. ఫలితంగా పాకశాసుని అన్యప్రయత్నాల అవసరం లేకుండానే "అహింసా పరాయణుడైన ఆ తపస్వి భయంకర హింసాభరిత మనస్వి" అయ్యాడు.

అందువలన ఆర్యపుత్రా! అకారణ వైరాలోచనయే ప్రమాదకరమైనది. అయినా అఖండ బుద్ధి సంపన్నుడివైన నీకు బోధించడానికి ఎవ్వరికి సాధ్యము? స్త్రీ చాపల్యాన్ని బట్టి నాకు తోచినది నీకు తెలిపాను. నీవు ధీమంతుడైన నీ తమ్మునితో సంప్రదించి ఏది ఉత్తమమైనదో దానిని ఆలోచించి, ఆచరింపు"మని తెలిపి ఆ ఉత్తమ మహిషి ఊరకుంది.

ఇక్కడ అవనిజ ఆలోచనలు అనేక అభిప్రాయాలకు అవకాశమిస్తున్నాయి.

"సాధుపరిత్రాణ సంకల్పముతో అవనిపై అవతరించిన శ్రీరాముని ధర్మపత్ని అయిన సీతాదేవి శ్రీరామభద్రుని అభయప్రదానాన్ని ఎదిరించడం న్యాయమా? అది అధర్మం కాదా?" అనే సందేహము అందరి మనస్సులను వేధిస్తుంది.

అయితే సీతాదేవి అభిప్రాయాన్ని రెండు రకాల మనం విశ్లేషించి చూడాలి. (1) సామాన్య స్త్రీ అభిప్రాయంగా (2) పురుషకార స్వరూపిణి అయిన శ్రీదేవి అభిప్రాయంగా.

సామాన్యంగా ఏ స్త్రీ అయినా కుటుంబశాంతినే కోరుకొంటుంది. తన భర్త అకారణ వైరాన్ని కొనసాగించి ప్రమాదాన్ని కొనితెచ్చుకోవాలని ఏ భార్య కూడ కోరుకోదు. ఆ విషయంలో కుటుంబ ప్రధాన సభ్యురాలిగా సీతాదేవి తన అభిప్రాయాన్ని తప్పక తెలియజేయవలసిఉంటుంది. అలాగే ఆమె రాక్షస వైరాన్ని మానుకొమ్మంది.

పురుషకార స్వరూపిణి అయిన శ్రీదేవి స్వామి రక్షా ప్రయత్నాన్ని ప్రోత్సహించాలి కాని నిరోధించకూడదన్న మాట సత్యమే. అయితే ఇక్కడ ఒక విషయాన్ని ప్రత్యేకంగా గమనించాలి.

శ్రీదేవి పరస్పర విముఖులైన జీవేశ్వరులను అభిముఖులుగా జేయడం కొరకు తన సదుపదేశ సౌందర్యములతో పురుషకారము చేస్తుంది. తత్ఫలితంగా వారి మధ్య వ్యామోహము కలుగుతుంది. అయితే పరమాత్మ వ్యామోహము ఎంతవరకు నిలుస్తుందో పరీక్షిద్దామని ఆ తల్లి ప్రయత్నిస్తుంది. ఆ ప్రయత్నంలో ఆ మాత జీవుని విషయంలో అనేక కొండెములను (ఫిర్యాదులను) కల్పించి ఆ పరమపితకు తెలుపుతుంది.

వ్యామోహమే మూర్తీభవించిన వాడు పరమాత్మ. ఆయనకు జీవునిపై అభిమానము కలిగిన తరువాత ఆయన దృఢ మనస్సును మార్చడం ఆ పురుషకారిణికి కూడ సాధ్యము కాదు.

అప్పుడు **"ఎన్నడియార్ అదుశెయ్యార్ శెయ్దారేల్ నన్రు శెయ్దార్"**

"నా దాసులు అటువంటి తప్పులను చేయనే చేయరు. ఒకవేళ వారు అలా చేసినా ఆ తప్పులు నాకు ఒప్పులే" అని ఆ తల్లికే ఎదురు నిలుస్తాడు. అప్పుడు పరమాత్మ యొక్క దృఢవ్యామోహానికి ఆ తల్లే నివ్వెరపోతుంది.

అదుగో సీతాదేవి శ్రీరాముని రక్షా ప్రయత్నమును మార్చడానికి ప్రయత్నించడము కూడ శ్రీరాముని మనోదార్ఢ్యమును పరీక్షించడము కొరకే అనుకోవాలి. తన పరీక్షా ప్రయత్నము పరమాత్మ యొక్క పట్టుదలను మరింత దృఢం చేస్తుందని ఆ తల్లికి స్పష్టంగా తెలిసినదే.

సీతాదేవి అభిప్రాయాన్ని విని ఆమె మనస్సు గ్రహించిన శ్రీరాముడు ఆగ్రహించలేదు. ఆమె ప్రేమే ఆమెతో అలా మాట్లాడించిందన్నాడు. ఆమె కాక మరెవ్వరు అలా మాట్లాడ లేరని ఆమెను అనునయించాడు. అయినప్పటికి తన ఆశ్రిత రక్షా దీక్షను ఆవగింజ అంత అయినా సడలింప లేదు ఆ రక్షా దీక్షితుడు.

ఇతిశం

# కదిలే ప్రణవము

సీతారామలక్ష్మణులు వన సంచారము కావిస్తున్నారు. వారి గమన సౌందర్యము వాల్మీకి మహామునినే విస్మితుని కావించింది.

**అగ్రతః ప్రయయౌరామః**
**సీతా మధ్యే సుమధ్యమా**
**పృష్ఠతస్తు ధనుష్పాణిః**
**లక్ష్మణోZను జగామహ**

ముందు రాముడు నడుస్తున్నాడు. మధ్యలో ఉన్న సీతాదేవి రాముని అనుసరిస్తున్నది. ధనుష్పాణి అయి లక్ష్మణుడు వారిద్దరి వెంట వెళ్తున్నాడు. ఓహో?! ఎంత ఆశ్చర్యము "హ" అని వాల్మీకి విస్తుపోతున్నాడు.

ఏమిటి ఇంతగా ఆశ్చర్యపడవలసింది వారి వనగమనములో? "దదృశుః విస్మితాకారాః" అన్నట్లు లోకాతీత సౌందర్య సంశోభితులైన సీతారామ లక్ష్మణుల నడక వనవాసులందరిని ఆశ్చర్యపరవశుల కావించి ఉండవచ్చు. కాని ఇప్పుడది ప్రధాన విషయము కాదు.

ఈ శ్లోకములోని శబ్దములు సూచించే సామాన్యార్థము కంటె విశేషార్థము ముఖ్యమైనది. అది వేదాంతపరమైది. ఆ అర్థము ప్రణవార్థాన్ని సూచిస్తున్నది. ఆ అర్థానికే వాల్మీకి ఆశ్చర్యపరవశుడైనది.

శ్రీరాముడు పరమాత్మ. అన్ని కాలాల్లో కూడ సకల చరాచరములకు అగ్రగామిగా ఉండేది ఆయనే. "దాసభూతాః స్వతస్సర్వేహ్యాత్మానః పరమాత్మనః" అన్నట్లు జీవులందరు ఆయనను అనుసరించవలసిన వారే. అయితే సాధారణంగా జీవ పరమాత్మలు వారి స్వభావాలను (స్వాతంత్ర, దోషములను) బట్టి పరస్పరవిముఖులుగా ఉంటారు. వారి స్వభావాలను తీర్చిదిద్ది వారిని పరస్పరాభిముఖులుగా మార్చదానికి (సుమధ్యమా) వారిద్దరి మధ్యలో చక్కగా నిలిచి పురుషకారము చేయవలసినది అమ్మవారే కదా!

ప్రణవంలో అకారము 'పరమాత్మను', మకారము "జీవుని" తెలుపుతాయి. మధ్యలో ఉండే "ఉకారం" లక్ష్మీవాచకమై, జీవులందరు పరమాత్మకు సంబంధించిన వారే ("ఏ") (ఏవ) అని అవధారణార్థమును తెలియజేస్తుంది.

అరణ్యవాసానికి శ్రీరాముడు బయలుదేరే ముందు లక్ష్మణుడు తాను కూడ వెంట వస్తానన్నాడు. శ్రీరాముడు ముందుగా లక్ష్మణుని అభిప్రాయాన్ని అంగీకరింపలేదు. అయితే లక్ష్మణుడు తన పట్టు విడువలేదు.

**"స భ్రాతుశ్చరణౌగాఢం నిపీడ్య రఘునందనః**
**సీతాముహాచాతియశాః రాఘవంచ మహావ్రతం"**

తన పట్టుదలను విడువని లక్ష్మణుడు శ్రీరాముని పాదాలను గట్టిగా పట్టుకొని (ఆశ్రయించి) సీతాదేవి ముఖాన్ని చూస్తూ మళ్లీ ప్రార్థించాడు. అప్పుడు శ్రీరాముడు కూడ సీతాదేవి వైపు చూచాడు. ఆమె ఘటకత్వము (జీవపరమాత్మలను ఒక దగ్గర చేర్చే స్వభావము) శ్రీరాముని కాఠిన్యమును మార్చి లక్ష్మణుని అంగీకరింప జేసింది. అయినా మళ్లీ వారి మధ్య వేర్పాటు కలుగుతుందేమో అనే భయంతో వారిని విడువకుండా తాను వారి మధ్యలో చక్కగా నిలిచి నడుస్తు ఉంది (సుమధ్యమా).

ఋషులు నిరంతరము ప్రణవోపాసకులు. అందువలననే వాల్మీకితో సహా వనవాసులందరిని సీతారామలక్ష్మణుల సంచార సౌందర్యము ప్రణవార్థ సూచకమై సంభ్రమ పరవశుల గావించింది.

ఈ శ్లోకంలో "సీతామధ్యే సుమధ్యమా" మంచి నడుము సౌందర్యముగల సీతాదేవి వారిద్దరి మధ్యలో నడుస్తున్నదని సామాన్యార్థాన్ని, వారిద్దరి మధ్య ఘటకత్వాన్ని నిర్వహిస్తూ (ఉకారార్థాన్ని) విశేషార్థాన్ని వివరిస్తున్నది.

**"పృష్ఠతస్తు ధనుష్పాణిః లక్ష్మణోఽనుజగామహ"**

సీతారాములిద్దరిని సేవిస్తూ వారిని రక్షించడానికి చేతిలో ధనుస్సును ధరించి వారిని అనుసరిస్తున్నాడని సామాన్యార్థము. అయితే అంతకంటె ముఖ్యంగా "ప్రణవోధనుః" అంటుంది వేదము. అందువలన ధనువును సూచించే ప్రణవార్థమును అనుసరించి వారిద్దరికి దాసుడై అనుసరిస్తున్నాడని విశేషార్థము. ప్రణవము శేషత్వ స్వరూపమును సూచిస్తుంది కదా!

ఇతిశం

# అప్సరసల సరస్సు

శ్రీ సీతారామలక్ష్మణులు అరణ్యములో ముందుకు వెళ్తున్నారు. ఆ ఘోరారణ్యములో వారికి ఒక పెద్ద సరస్సు కనబడింది. అది ప్రసన్నమైన జలములతో అనేక యోజన విస్తారమైనది. ఆ తటాకములోపలి నుండి గీతవాద్య ధ్వనులు వింతగా వినిపించసాగాయి.

రామలక్ష్మణులు ఆ విచిత్ర వృత్తాంతాన్ని గురించి "ధర్మభృత్తు" అనే పరమర్షిని ప్రశ్నించారు. ధర్మభృత్తు ఆ సందర్శకులకు ఆ సరోవర వృత్తాంతాన్ని అపూర్వంగా వివరింపసాగాడు. "ధర్మభృత్" అంటే శాశ్వత ధర్మమైన పరమాత్మను కలిగినవాడు.

"రామభద్రా! పూర్వము "మాండకర్ణి" అనే ఒక ముని పదివేల సంవత్సరాలు నీటిలో నిలిచి ఉండి వాయువునే భుజిస్తూ తీవ్రమైన తపమాచరించాడు.

దేవతలందరు ఒక చోట గుమిగూడి ఆ తపస్సు వలన తమ పదవులకు ప్రమాదము కలుగుతుందనే భయముతో ఆయన తపస్సుకు అవాంతరము కల్పింప దలచి, మెరుపుతీగల వంటి అయిదుగురు అప్సరసలను సృష్టించారు. మాండకర్ణి ఆ అప్సరసలను చూడగానే అంగజబాణ పీడితు డయ్యాడు. తన తపము చాలించి ఆ తరుణులను స్వంతము చేసికొని ఈ సరస్సులో ఒక అంతర్గృహాన్ని నిర్మించుకొన్నాడు. ఇందులో నిరంతరము గీతవాద్య ధ్వనులతో పంచాప్సరలకు పరవశుడై కాలము గడుపుతున్నాడు. ఈ జలాశయము అన్ని కాలాల్లో జలభరితమై, విచిత్రధ్వని విశిష్టమై ఉంటుంది".

పరమ రమణీయమైన ఆ సరోవర వృత్తాంతాన్ని విని సీతారామలక్ష్మణులు విస్మిత మనస్కులయ్యారు.

"సరతీతి సరః" ప్రవహించే (ప్రసరించే) నీరు గలది సరస్సు. అశాశ్వతమైన జారిపోయే ఆయువు కల్గిన శరీరానికి ప్రతీక సరస్సు. అది అనేక యోజనాయుతమైన తటాకము. "తటము" (తన పరిసరాల)లో "అకం" (దుఃఖసంబంధమైన) అనేక యోజనా వృతమైనది. (అనేకాలోచనలను కల్గింది) ఆ సరస్సు (శరీరము) లోపల మాండకర్ణి (జీవుడు) ఉన్నాడు.

(మండాయ) "మండ" అంటే తన అలంకారాని కొరకు, భోగానుభవం కొరకు అని అర్థము.

"మండ" శబ్దమే స్వార్థములో ఆదిలో దీర్ఘము వచ్చి "మాండ" అయింది.

"కర్ణి" అనే పదములో క+ఋణి అనే రెండు శబ్దాలు ఉన్నాయి. "క" సుఖాలను "ఋణి" అడిగి తీసికొన్నవాడు.

తన తపస్సు (పూర్వకర్మ) ఫలితంగా "క" సుఖాలను, "ఋణ" అనుభవార్థమై అడిగి తెచ్చుకొన్నవాడు.

దశ సహస్ర వర్షములు తపస్సు చేశాడు. దశేంద్రియాలతో నిరంతరము విషయాలోచనలు చేశాడు.

"పంచాప్సరసలు" పంచజ్ఞానేంద్రియాలు. అవి సుఖదుఃఖానుభవము అనే నీటిలో (అప్పుల్లో) జారిపడవేసేవి (సరములు)

ఆ అప్సరసలు చేసే గీత వాద్య ధ్వనులు జీవుని ఆకర్షించే విషయసుఖాలు.

జలాశయములో గృహము కట్టుకొన్నవాడు. "లడ" యోర్నభేదః – జడత్వానికి ఆశ్రయమైన శరీరములో ఉనికి కలవాడు.

"మాండకర్ణి" అనే పదానికి మరొక అర్థాన్ని కూడ చెప్పుకోవచ్చును. "డ" "ద" గా మారగా "మాండకర్ణి" మాందకర్ణి అవుతుంది. "మంద" స్వార్థములో "మాంద" అవుతుంది. అప్పుడు "మందకర్ణి" అనగా మందమైన కర్ణములు కలవాడు.

కర్ణము మందమైనప్పుడు ఇంతవరకు కలిగిన జ్ఞానము మందమై, ఇకముందు జ్ఞానము కలుగకుండా పోతుంది. కనుక "మాందకర్ణి" అనగా వివేకశూన్యుడు అని అర్థము. అందువలననే తన తపఃఫలంగా అనగా పూర్వకర్మ ఫలంగా సరోగృహాన్ని నిర్మించుకొని, పంచాప్సరసలతో శృంగారానుభవంలో పరవశుడయ్యాడు.

తపస్సు వ్యాస వాల్మీకి, వశిష్ఠాది మహర్షులకు బ్రహ్మజ్ఞానాన్ని కలిగించి బ్రహ్మానంద ప్రదమైనది. అదే తపస్సు మాందకర్ణి వంటి మందమతులకు అల్పము అస్థిరమైన విషయానుభవమునకు కారణమవుతుంది.

ఇతిశం

"సీత కంటె కూడ సుగ్రీవునే ప్రాణంగా
భావించిన – పరముడు శ్రీరాముడు"

# అగస్త్య మహర్షి

శ్రీ సీతారామలక్ష్మణులు అరణ్యములో అనేకాశ్రమాలను దర్శిస్తూ వాటిలో కొంత కొంత కాలము సుఖంగా నివసిస్తూ ఆయా మహర్షులను సేవిస్తూ పది సంవత్సరాలు ప్రశాంతంగా గడిపారు.

సుతీక్ష్ణ మహర్షి మాటననుసరించి మళ్లీ ఆయన ఆశ్రమాన్ని చేరుకొన్నారు. అక్కడ కొంత కాలము హాయిగా ఉన్నారు.

కొంతకాలము తరువాత శ్రీరామభద్రుడు సుతీక్ష్ణునితో : "ముని చంద్రమా! నాకు ఎంతో కాలము నుండి మహా మహిమోపేతుడైన అగస్త్య మహర్షిని సేవించాలని వుంది. ఆయన ఆశ్రమానికి మార్గము ఆనతివ్వండి" అని అడిగాడు.

అప్పుడా మహర్షి రాజర్షి అయిన శ్రీరామునితో "నేనే అగస్త్య మహర్షి ఆశ్రమాన్ని దర్శింపుమని చెప్పాలనుకొన్నాను. నీవే కోరావు – రామభద్రా! ఇక్కడినుండి దక్షిణ దిశ వైపు నాలుగు యోజనాలు వెళ్తే అక్కడ అగస్త్య భ్రాత యొక్క ఆశ్రమప్రాంతము వస్తుంది. దానిలో పిప్పళ్ల చెట్లు అధికంగా ఉంటాయి. కారపు వాసన నిండి ఉంటుంది. అక్కడ అనేక తటాకాలు, హంస కారండవాది జలపక్షులు ఉంటాయి. అక్కడ ఒక రాత్రి గడిపి తెల్లవారి మరొక యోజన దూరం అదే దిశలో వెళ్లితే అగస్త్య మహర్షి ఆశ్రమము వస్తుంది" అని సుస్పష్టం చేశాడు.

సుతీక్ష్ణుని సెలవునంది శ్రీరాముడు సీతాలక్ష్మణులతో అనేక వనాలను, పర్వతాలను, సరోవరాలను గమనిస్తూ అగస్త్య భ్రాత ఆశ్రమాన్ని చేరుకొన్నాడు.

ఆ ఆశ్రమ ప్రాంతము సమిధల రాశులతో దర్భలతో నల్లని పర్వతము వంటి హోమ ధూమముతో నిండి ఉన్నది. శ్రీరామచంద్రుడు సౌమిత్రితో "లక్ష్మణా! ఇదే అగస్త్య సోదరాశ్రమము. ఈయన సోదరుడే అగస్త్యుడు. పూర్వము ఈ అరణ్యములో "వాతాపి", "ఇల్వలుడు" అనే రాక్షస సోదరులు ఉండేవారు. వారిద్దరు బ్రాహ్మణహంతకులు. అందులో ఇల్వలుడు తన సోదరుడైన వాతాపిని మేకగా మార్చి దానిని వండి, ఋషులను "బ్రాహ్మణార్థము" పిలిచేవాడు. శ్రాద్ధానికి నిమంత్రితులైన ఋషులు ఇల్వలుడు కనపరచిన కపట శ్రద్ధకు సంతుష్టులై శ్రాద్ధ భోజనము కావించేవారు. శ్రాద్ధానంతరం "తృప్తాస్థః?" మీరు తృప్తి చెందారా? అని ఇల్వలుడు అడుగగా – "తృప్తోఽస్మి" తృప్తి చెందానని వారు సమాధానమిచ్చేవారు. వారికిహస్తోదకము, తాంబూల, దక్షిణ, పరిచర్యలు సమర్పించిన తరువాత ఇల్వలుడు "వాతాపీ బయటకు రా" అని పిలిచేవాడు. ఆ

భూసురుల పొట్టలను చీల్చుకుని వాతాపి వెలుపలికి వచ్చేవాడు. ఈ విధంగా బ్రాహ్మణ మారణకాండను జరుపుతూ వారి మాంసభక్షణతో వాతాపి, ఇల్వలుడు ఇద్దరు కాలము గడుపుతూ వచ్చారు.

ఒకరోజు సురులు, భూసురులు మహా తపో బలసంపన్నుడు, అసమాన ప్రతిభాశాలి అయిన అగస్త్య మహర్షిని సేవించి ఈ దురాగతాన్ని నివారించుమని కోరారు. అందుకు అంగీకరించిన అగస్త్య మహాముని స్వయంగా ఇల్వలుడి దగ్గరకు వెళ్లి తాను "బ్రాహ్మణార్థము" వచ్చానని తెలిపాడు. అగస్త్యుని అంతటివాడు తమకు ఆహారం కానున్నాడనే సంతోషంతో ఇల్వలుడు తన సోదరుడైన వాతాపిని మేషంగా వండి శ్రాద్ధాహారంగా సమర్పించాడు. శ్రాద్ధానంతరము యథావిధిగా ఇల్వలుడు తన సోదరుడైన వాతాపిని బయటకు రమ్మని నవ్వుతూ పిలిచాడు. కాని అప్పుడు అగస్త్యుడు తిరిగి నవ్వుతూ "వాతాపి జీర్ణం" అని అంటూ తన బొజ్జను నిమురుకొన్నాడు. తన తపశ్శక్తితో వాతాపిని జీర్ణం చేసికొన్నాడు. ఆగ్రహంతో తనపై పడబోయే ఇల్వలుని కూడ హుంకారముతో భస్మము కావించాడు. ఇంతటితో ఇల్వల వాతాపుల భయంకర ప్రమాదమును బ్రాహ్మణులకు తప్పించి అగస్త్య మహర్షి లోక కల్యాణ కారకుడయ్యాడు.

ఇప్పటికి తమ పిల్లలకు పెట్టిన ఆహారము అరుగాలని "వాతాపి జీర్ణం" అంటూ తల్లులు తమ పిల్లల బొజ్జలను నిమరడం మనకు ప్రత్యక్షానుభవమే కదా!

ఈ కథలో వాతాపి, ఇల్వలు ఇద్దరు రాక్షస సోదరులు – ఇల్వలుడు అనే పదంలో రెండు మాటలు ఉన్నాయి. **"ఇలతే ఇతి ఇలః" వలతే ఇతి వలః"** "స్థిరంగా చుట్టుకొనేవాడు" అని అర్థము. ఇల్వలుడు తన మాయమాటలతో, కపట వినయ విధేయతలతో "శ్రాద్ధ భోజనాహ్వానమ"నే వలను బ్రాహ్మణులపై విసిరేవాడు. అన్ని తెలిసిన వారిని కూడ ఆ వల చుట్టుకొనేది.

ఇక వాతాపి. ఆయన జనన మరణాలను స్వచ్ఛందంగా పొందేవాడు. **"వాత"** (ప్రాణవాయువులను) **ఆ** (పూర్తిగా) **పిః** (పీల్చివేసే వాడు, నిరోధించేవాడు) తనంతట తాను మరణాన్ని పొందేవాడు.

తిరిగి తనంతట తాను **"వాతం"** (ప్రాణ వాయువును) **"ఆపిః"** "అప్నోతి" పొందేవాడు అనగా బ్రతికేవాడు.

ఆయన "మేషాకృతి"ని పొందేవాడు. **"మా"** ప్రకృతిలో **"ఈషా"** కోరిక కలిగించేది మేక. వీరిద్దరి విజృంభణాన్ని **"అగ"** పర్వతమువలె **"స్త్యః"** స్థంభింపజేసిన అమోఘ

తపశ్శక్తి సంపన్నుడు అగస్త్యమహర్షి. (దేహంపై) **ప్రకృతిపై మోహాన్ని** జయించిన పరమర్షి అగస్త్యుడు.

ఈ మహర్షి కావించిన మరొక అద్భుత కార్యము "వింధ్యా నిరోధము".

పూర్వము వింధ్యాచలము గర్వముతో హిమవన్నగముతో పోటీ పడి పెరగడం ప్రారంభించింది. వాటి పోటి వలన సూర్యసంచారము కూడ కష్టమైపోయింది. పరమేశ్వరుని పరిణయోత్సవాలలో పాలుపంచుకొంటున్న అగస్త్య మహర్షిని అమరులందరు ఆశ్రయించి "వింధ్యా గర్వాపహరణము" కావించుమని ప్రార్థించారు.

దైవాజ్ఞను తలదాల్చి అగస్త్యుడు దక్షిణ దిశకు బయలుదేరాడు. ఆయన రాకకు సంతోషించిన వింధ్యుడు తలవంచి తన గురువైన అగస్త్యునికి దక్షిణ దిశకు వెళ్లడానికి వీలు కల్పించాడు. అయితే అగస్త్య మహర్షి తిరిగి తాను వచ్చే దాకా "అలాగే తలను వంచి ఉండుమని" వింధ్యుని ఆజ్ఞాపించాడు. మళ్లీ అగస్త్యుడు ఉత్తర దిశకు వెళ్లలేదు. వింధ్యుడు వంచిన తల తిరిగి ఎత్తలేదు. ఇప్పటికి తెలుగులో ఒక సామెత వాడుకలో ఉంది. "అగస్త్యుడు రాడు, వింధ్యుడు లేవడు" అని. జరుగని విషయాన్ని చెప్పడానికి వింధ్యుని ఉదాహరణగా తెలుపుతారు. **"అగ"** అంటే వింధ్య పర్వతాన్ని, "స్త్యః" అంటే స్థంభింప జేసినవాడు అని అగస్త్య శబ్దానికి మరొక వ్యుత్పత్తి.

ప్రకృతిలో మేరు, హిమాచలములే అత్యున్నత పర్వతాలు. మేరువు అందరికి కనపడేది కాదు. కనపడే హిమవంతమే అన్నిటికంటె అధికోన్నతమైనది.

సహజోన్నతుడైన హిమవంతుని అహంకారముతో వింధ్యుడు అడ్డుకొంటు పెరిగి పోతుంటాడు. "పెరుగుట విరుగుట కొరకే" అన్నట్లు దైవాజ్ఞను అనుసరించి అగస్త్యుడు వింధ్యుని అహంకారమును త్రుంచి, ఎప్పటికి తలవంచి ఉండేట్లు ఆజ్ఞాపిస్తాడు. మొత్తముపై వింధ్యా నిరసనము "అహంకార నిర్మూలనమునకు" ఒక ప్రతీక.

అగస్త్యుని మహిమను గురించి మాట్లాడుకొంటూ సీతారామలక్ష్మణులు ఆయన సోదరుని ఆశ్రమంలో ప్రవేశించి ఆ మహర్షి అనుజ్ఞతో ఆ రాత్రి అందులో సుఖంగా నిద్రించుతారు. తెల్లవారి ఆ మహర్షి ఆజ్ఞతో అగస్త్యాశ్రమానికి బయలు దేరుతారు.

అక్కడకు యోజన దూరంలో దక్షిణ దిశలో ఉన్న అగస్త్యాశ్రమానికి చేరుకొంటారు. శ్రీరాముడు సోదరునితో "లక్ష్మణా! ఈ ఆశ్రమము శ్రమాపహరంగా ఉంది. హోమ ధూమము ఆకాశాన్ని అంటింది. చెట్లపై మునుల నారవస్త్రాలు ఆరవేయబడి ఉన్నాయి. మృగయూధములు తమ సహజ వైరమును మాని ప్రశాంతంగా నివసిస్తున్నాయి. అగస్త్యుడు ఈ ప్రాంతానికి వచ్చినప్పటి నుండి ఈ దక్షిణ దిశ **"అగస్త్య"** దిశగా ప్రఖ్యాత

మైంది. రాక్షసులు అగస్త్యాగ్రహమునకు భీతులై ఇక్కడికి రావడం మానుకొన్నారు. ఈ ఆశ్రమవాసులకు అమరులు యక్ష, అమర రాజ్యాధిపత్యాలనిచ్చారు. ఈ ఆశ్రమం లోపలికి వెళ్లి ఆశ్రమవాసుల ద్వారా మన రాకను గురించి మహర్షి చంద్రునకు నివేదించు" మని వివరించాడు.

లక్ష్మణుడు మున్యాశ్రమంలో ప్రవేశించి ఒక ముని శిష్యునితో "దశరథాజ్ఞతో శ్రీరాముడు, భార్యతో, తమ్ముడైన తనతో మహారణ్యములోనికి వచ్చాడని మహర్షికి నివేదించుమని" తెలిపాడు. శిష్యుని ద్వారా దాశరథుల వృత్తాంతము విన్న మహర్షి హర్ష పరవశుడయ్యాడు.

వారు ఆశ్రమంలో ప్రవేశించి యజ్ఞశాలలో బ్రహ్మ, అగ్ని, విష్ణు, మహేంద్ర, సూర్య, సోమ, భగ, కుబేర, ధాత, విధాత, వాయు, అనంత, గాయత్రీ, వరుణ, కార్తికేయ దేవతా స్థానాలను దర్శిస్తూ వెళ్లారు.

అగస్త్యమహర్షి శిష్యమండలి మధ్య నుండి బయలు వెడలి, ఔదార్యముతో శ్రీరామునికి స్వాగతము పలికాడు. శ్రీరాముడు సీతాలక్ష్మణులతో మునీంద్రునికి ప్రణమిల్లాడు.

మునీంద్రుడు హోమము పూర్తిగావించి, సీతా రామలక్ష్మణులకు అర్ఘ్యము నొసగి, వారికి వానప్రస్థ భోజనమును సమకూర్చాడు. "హోమానంతరము అతిథి పూజ చేయనివాడు అసత్యవాదివలె స్వమాంస భక్షణము కావిస్తాడు" అని తెలిపి అగస్త్య మహర్షి శ్రీరామ భద్రునికి విశ్వకర్మ నిర్మించిన హేమరత్న విభూషితమైన "వైష్ణవ ధనుస్సును", మహేంద్రు డొసగిన అక్షయతూణీరాలను, రజతకోశముతో కూడిన హేమఖడ్గాన్ని ప్రదానం చేశాడు.

"ఈ ధనుస్సుతోనే శ్రీ మహావిష్ణువు రాక్షస సంహారము కావించి దేవతలకు విజయలక్ష్మిని ప్రసాదించాడని" మహాముని తెలిపాడు.

శ్రీ రామభద్రుడు భార్యాసోదరులతో తన ఆశ్రమానికి రావడం తనకు మహానందాన్ని కలిగించిందని –సీతాదేవితో హాయిగా ఉండుమని తెలిపాడు.

"స్త్రీలు సాధారణంగా సుఖంలో పురుషులను అనుసరిస్తారని, దుఃఖములో వదలివేస్తారని, వారు మెరపుతీగ యొక్క చాంచల్యము, శస్త్రము యొక్క పదను, గరుడుని యొక్క వేగాన్ని కల్గి ఉంటారని, కాని సుకుమారి అయిన సీతాదేవి కష్టాల్లో భర్తనే అనుసరించిన అపురూప వ్యక్తి అని, అరుంధతి వంటి మహా పతివ్రత" అని తెలిపాడు.

శ్రీరాముడు తన భార్యా, సోదరుల ప్రవర్తన మహర్షికి హర్షదాయకమని గుర్తించి ఆనందంతో "తమకు వాస స్థానాన్ని" నిర్దేశించుమని నివేదించాడు.

ఆ ఆశ్రమంలో ఉండక, వేరే నివాస స్థలాన్ని అడుగడంలో శ్రీరాముని అభిప్రాయాన్ని గుర్తించిన అగస్త్య మహాముని "ఇక్కడికి రెండు యోజనాల దూరంలో ఫలమూల జలసంపన్నమైన పంచవటి" ప్రదేశము ఉంది. అక్కడ పితృాజ్ఞను నీవు పాలిస్తూ "స్వపుత్ర ధర్మముతో తరించిన యయాతివలె" దశరథుని తరింప జేస్తావు. నీ శక్తితో నీ దారను, ఆశ్రితమహర్షులను రక్షిస్తావు. గోదావరీ పవిత్ర ప్రాంతాలలో సీతాదేవి రమిస్తుంది. ఈ మధూకవనం దాటి ఉత్తరమువైపున నున్న మఱ్ఱిచెట్టు దాటితే అక్కడ మహోన్నత స్థలము కనిపిస్తుంది. దానిని దాటితే పంచవటి ప్రాంతము వస్తుంది" అని మహర్షి వారికి వాసస్థానాన్ని నిర్దేశించాడు.

వారు మహర్షి పాదాలకు అభివందనము కావించి మహావీరులై మహర్షి సూచించిన "పంచవటి"ని చేరడానికి బయలుదేరారు.

అగస్త్యుడు వాతాపి, ఇల్వలులను నిర్జించిన మహాతపశ్శక్తి సంపన్నుడు. వింధ్యాచలము యొక్క గర్వము నణచిన గౌరవశాలి. సముద్ర జలాన్నంతటిని ఆపోశనము పట్టిన మహా మేధావి.

శ్రీరామచంద్రుని పరాత్పరుని యొక్క అవతారమూర్తిగా గుర్తించి దుష్ట సంహారము కొరకు వైష్ణవ ధనుస్సును, అక్షయతూణీరాలను, సునిశిత సువర్ణ ఖడ్గాన్ని తన వంతు కైంకర్యంగా సమర్పించిన మహాతపశ్శాలి. తద్వారా రాముని ప్రణవాధిపత్యమును జ్ఞాన స్వరూపమును గుర్తించిన ధీశాలి.

శ్రీరామచంద్రుడు కూడ ఆశ్రిత జనసంరక్షణానికి, దుష్టరాక్షస సంహారానికి ముందు అగస్త్య మహాముని వంటి పరమ భాగవతోత్తముని మహిమాన్విత మంగళా శాసనములను గ్రహించి తన అవతార ప్రయోజనమైన సాధుపరిత్రాణాన్ని, దుర్మార్గుల వినాశాన్ని నెరవేర్చ డానికి నడుము కట్టాడు. ఈ విధముగా భగవదాదరముతో అగస్త్య మహర్షి, భాగవత సమాదరముతో శ్రీరామభద్రుడు కృతకృత్యులయ్యారు.

ఇతిశం

# జటాయువు

సీతాలక్ష్మణ సమేతుడైన శ్రీరామచంద్రుడు అగస్త్యుని అనుమతిని తీసికొని పంచవటికి బయలుదేరాడు. త్రోవలో ఒక మఱ్ఱి చెట్టుపైన ఒక పెద్ద గ్రద్ద పడుకొని ఉంది. దానిని చూచి వారు ఒక రాక్షసుడు అనుకొన్నారు. శ్రీ రాముడు ఆ గ్రద్దను దాని వివరాలను గురించి ప్రశ్నించాడు. అప్పుడు అది తన వివరాలను ఇలా తెలిపింది.

"శ్రీరామభద్రా! పూర్వము ఈ జగత్తును సృష్టించడానికి తనకు సహాయంగా ఉండడానికి 14 మంది ప్రజాపతులను బ్రహ్మదేవుడు సృష్టించాడు. వారిలో మొదటి ప్రజాపతి కర్దముడు, చివరివాడు కాశ్యప ప్రజాపతి. ప్రజాపతులలో దక్షుడు అత్యంత ప్రసిద్ధుడు. ఆయనకు అరవై మంది కుమార్తెలు. వారిలో ఎనమిది మందిని కాశ్యపుడే పెండ్లి చేసికొన్నాడు.

కాశ్యపుని భార్యలలో తామ్ర అయిదుగురు పుత్రికలను కన్నది. వారిలో శ్యేనికి, వినతాసుతుడైన అనూరుని వలన జన్మించిన వాడను నేను. నా పేరు జటాయువు. మా అన్న సంపాతి పక్షీంద్రుడు.

రాక్షస సంహారములో దేవతలకు నేను, మీ జనకుడు చాల కాలం నుండి సహాయ పడుతున్నాము. మీ తండ్రి అయిన దశరథ చక్రవర్తి ధరపై అనేకాయుధాలతో అసుర సంహారం కావిస్తే, అంతరిక్షంలో నేను నా రెక్కలతో గోళ్లతో, ముక్కు కొనతో అనేక రాక్షసులను అంతం చేశాను. ఆ విధంగా నేను, మీ తండ్రి గారు చిరకాల మిత్రులము.

**"ఉవాచ వత్స మాం విద్ధి వయస్యం పితు రాత్మనః"**

ఇప్పుడు కూడ ఈ భయంకరారణ్యములో మీకు కావలసిన ఏ సహాయమైనా చేస్తాను. ముఖ్యంగా నీవు, లక్ష్మణుడు తోడులేక ఒంటరిదైన సీతాదేవిని సంరక్షిస్తాను.

"సీతాంచ తాత రక్షిష్యే! త్వయియాతే సలక్ష్మణే". జటాయువు పలుకులను విని సంతోషంతో శ్రీరాముడు ఆ పక్షీంద్రుని అమితంగా ఆదరించాడు. తన తండ్రిగారితో ఆయనకు ఉన్న చిరకాల మైత్రిని గూర్చి పలు విధాల ప్రసంగించుకొన్నారు. ఆయనను తోడుంచుకొని వారు పంచవటికి చేరారు.

వినతాదేవికి కాశ్యప ప్రజాపతి వలన రెండు అండాలు కలిగాయి. చాలా కాలం ఆగిన తరువాత ఆమె ఒక గుడ్డును పగుల గొట్టగా అందులో నుండి అనూరుడు అర్థ

శరీరంతో జన్మించి, సూర్యరథసారథిగా వెళ్లి పోయాడు. రెండవ గుడ్డు చాల కాలానికి స్వయంగా పగిలి దాని నుండి గరుడుడు పుట్టాడు.

సూర్యుడు ప్రపంచానికి ప్రత్యక్ష దైవము. ఆయన వేదమయుడు. ఆయన సారథిగా అనూరుడు వేద విజ్ఞానాన్ని ఆకళింపు చేసికొన్నాడు. అనూరుని పుత్రుడైన జటాయువు కూడ వేదవిజ్ఞాన మయుడే.

"జటాయువు" అంటే రెండు అర్థాలు ఉన్నాయి. సామాన్యార్థములో "జటలలో అనగా రెక్కల జడలలో ప్రాణాలు కల పక్షి" అని అర్థము.

ఇక విశేషార్థములో "జట" అనగా "ఘన" తో పాటు ఒక వేదానుసంధాన విధానము. కాబట్టి "జటాయు" వంటే **"జట (వేదానుసంధానము) తో ఆయువును గడుపు కొన్నవాడు"** అని అర్థము. ఈ అసాధారణార్థము జటాయువు యొక్క జ్ఞాన స్వభావాన్ని తెలుపుతుంది.

వేదవిదుడు వేదవేద్యుడైన పరమాత్మకు విధేయుడుగా ఉంటాడు. విధేయుడైన వాడు స్వామికి దాసుడుగా, పరతంత్రుడుగా, కైంకర్యకారిగా (సేవలు చేసేవాడిగా) ఉంటాడు. సర్వజీవులకు స్వామి పరమాత్మే. ఆయనకే కాక ఆయనకు అత్యంత ప్రియులైన భాగవతోత్తములకు కూడ విధేయులుగా ఉండడము ప్రపన్నుల లక్షణము.

జటాయువు వేదవిదుడైన ప్రపన్నుడు కనుకే దశరథ మిత్రుడై, శ్రీరామునికై ప్రియుడై సీతను రక్షిస్తానని తెలిపాడు.

ఇతిశం

**"కాకికి, కోతికి, బోయకు, గ్రద్దకు**
**శరణునిచ్చిన - సర్వసముడు శ్రీరాముడు"**

# పర్ణశాల : సౌమిత్రి శేషత్వము

జటాయువుతో కలసి సీతారామలక్ష్మణులు పంచవటికి చేరారు. ఆ ప్రాంతమంతా ప్రశాంతమై పుష్పాలతో చెట్లతో, జలాలతో నిండి ఉంది.

శ్రీరాముడు లక్ష్మణుని పిలిచి, "నాయనా! పర్వత ప్రాంతాలను, వన ప్రాంతాలను గురించి చక్కగా తెలిసినవాడవు. మనకెక్కడ ఆశ్రమము ఉంటే బాగుంటుందో విచారించి నిర్మించు. ఎక్కడైతే వైదేహి విహరింప గలుగుతుందో, స్థల, జల రామణీయకతలను కలిగిన దేశమేదో, చూచి అక్కడ పర్ణశాలను మనకు సకల సౌకర్యాలతో నిర్మించు" మని తెలిపాడు.

అప్పుడు లక్ష్మణుడు చేతులు జోడించి, సీతా సమక్షములో శ్రీరామభద్రునితో ఇలా నివేదించుకొన్నాడు.

**"పరవానస్మి కాకుత్థ్స। త్వయివర్షం శతే స్థితే**
**స్వయంతురుచిరే దేశే। క్రియతామితి మావద"**

ఓ కాకుత్థ్స ప్రభూ! నీకు నేను నూరేండ్లు (ఎప్పటికీ) పరతంత్రుడనే. పర్ణశాల నిర్మాణ స్థలాన్ని నిర్ణయించే స్వాతంత్ర్యాన్ని (బాధ్యతను) నాపై పెట్టవద్దు. నీవే ఆ స్థలాన్ని నిర్ణయించి పర్ణశాల నిర్మాణానికి ఆజ్ఞాపించు".

లక్ష్మణుని యొక్క పారతంత్ర్య స్వభావానికి శ్రీరాముడు సంతోషించాడు. తనకు అన్ని విధాల నచ్చి సర్వ లక్షణోపేతమైన స్థలాన్ని గుర్తించి లక్ష్మణునికి ఈ విధంగా వివరించాడు.

లక్ష్మణా! సూర్యసమాన కాంతి గల్గి, సుగంధ భరితములైన అనేక పద్మములు గల తటాకము ఇక్కడికి దగ్గరలో కనిపిస్తున్నది. దానిలో హంసలు మొదలైన జలపక్షులు తేలి ఆడుతున్నవి. నెమిళ్ల కేరింతలు వినవస్తున్నాయి. వృక్ష పరివేష్టితములైన గిరులు అక్కడక్కడ ఉన్నాయి. అనేక పుష్పద్రుమాలు, ఫలవృక్షాలు నిండుగా ఉన్నాయి. అనేక పక్షులకు, మృగాలకు, భద్ర గజాలకు ఇది ఆటపట్టుగా నుంది. ఇది చాల పరిశుభ్రంగా ఉంది. పవిత్రంగా ఉంది. ఇక్కడ ఈ జటాయువుతో సహా జీవితము గడుపుతాను".

శ్రీరాముని చేత నిర్దిష్టమైన ఆ స్థలములో సౌమిత్రి విశాలమైన పర్ణశాలను మట్టి గోడలతో గట్టి, వెదురు బద్దలతో పై కప్పులను ఏర్పరచి, దానిపై జమ్మికొమ్మలను పరచి,

దర్భలతో కప్పి, అచిరకాలంలోనే రుచిరంగా నిర్మించాడు. గోదావరి నదికి వెళ్లి స్నానము చేసి తామర పుష్పాలను తెచ్చి, ఆ పర్ణశాలకు పుష్పాంజలిని సమర్పించాడు. కొన్ని ఫలాలను తెచ్చి దేవతలకు పూజ కావించాడు.

ఆ తరువాత ఆ ఆశ్రమాన్ని సీతారాములిద్దరికి చూపెట్టాడు. ఆ ఆశ్రమ నిర్మాణ కౌశల్యానికి సంతోషించి రామచంద్రుడు లక్ష్మణుని ప్రేమతో గట్టిగా కౌగిలించుకొని, "లక్ష్మణా! నీవు ధర్మాన్ని చక్కగా తెలిసినవాడివి, నా భావాన్ని పూర్తిగా గుర్తించిన వాడివి. నీవు కృతజ్ఞత కలవాడవు. నీ నిరంతర పరిచర్యలతో నాన్నగారి సౌకర్యాలను మరపింప జేశావు. అంతేకాక తరువాత నాకెన్ని కష్టాలు వస్తాయో అని నాన్నగారు నాపై బెంగతోనే పరమపదించారు. ఈ ఆశ్రమ నిర్మాణముతో వారి మనస్తాపాన్ని కూడ పోగొట్టావు.

**"భావజ్ఞేన కృతజ్ఞేన । ధర్మజ్ఞేన చ లక్ష్మణ ।**
**త్వయాపుత్రేణ ధర్మాత్మా । న సంవృత్తః పితామమ"**

ఈ ఆశ్రమంలో మా భార్యాభర్తలకు ఏకాంతమందిరాన్ని నిర్మించావు. సేవా పరాయణుడివైన నీవు నీకొరకు ప్రత్యేక మందిరాన్ని కట్టుకోలేదు.

మన తండ్రిగారు అయోధ్యలో నాకై నిర్మింపజేసిన మహా భవనాన్ని మరపించే విధంగా అతిథులను, అభ్యాగతులను ఆదరించడానికి సకల సౌకర్యాలను కల్పించావు. అందువలన తండ్రిగారు లేని లోటును తీర్చావు. నీవు కృతజ్ఞుడవు" అని పలు విధాలుగా లక్ష్మణుని ప్రశంసించాడు. స్వర్గంలో అమరులతో ఇంద్రుడున్నట్లు ఆ ఆశ్రమంలో రాముడున్నాడు.

ఇతిశం

**"పరమేశ్వరుడు పరవశంతో జపించే**
**నామము శ్రీ రామనామము"**

# భరతుని భ్రాతృ భక్తి

సీతారాములు ఆ ఆశ్రమంలో ఉంటుండగా శరదృతువు గడిచి హేమంతము వచ్చింది.

ఒకనాడు ఉదయము రాఘవుడు సీతతో కలసి రమ్యమైన గోదావరిలో స్నానం చేయడానికి బయలుదేరాడు. వారిద్దరి వెనుక నడుస్తున్న లక్ష్మణుడు ఆ ఋతు శోభను వర్ణింప సాగాడు.

"ఈ కాలము సంవత్సరానికి అలంకారమువలె శోభిస్తున్నది. పృథివి పంటలతో నిండుగా ఉంది. అగ్నిదేవుడు చల్లబడి అందరికి సులభుడై ఉన్నాడు. క్రొత్త ధాన్యాలతో క్రొత్త పండుగలతో పితృదేవతలు అర్చింపబడుతున్నారు.

సూర్యుడు దక్షిణ దిశలో ఉన్నందు వలన ఉత్తర దిశ తిలకహీనమైన స్త్రీ వలె వెలవెల బోతున్నది. బలమైన చల్ల గాలులు వస్తున్నాయి. శ్రీరామా! నీ మనస్సువలె ప్రకృతి మొత్తము చల్లగా ఉంది.

ఈ కాలములో అయోధ్యలో నున్న భరతుడు అత్యంత దుఃఖభరితుడై ఉన్నాడు. రాజ్యసౌఖ్యములను వదలుకొని కఠినమైన నేలపై పడుకొంటున్నాడు.

అత్యంత సుఖాలతో పెరిగిన భరతుడు అపర రాత్రులలో సరయూనదిలో స్నానము చేసి తడిబట్టలతో ఇంటికి ఎలా తిరిగి వెళ్తున్నాడో? ఉదయమైతే తనను "రామద్రోహి" అని ప్రజలు నిందిస్తారేమో అని తన ముఖము చాటు చేసికొని వెళ్తున్నాడు.

తన తపస్సుతో మహాత్ముడైన భరతుడు స్వర్గలోకాలను గెలుచుకొన్నాడు. రాజుగా ఉండి కూడ వానప్రస్థులమైన మనవలె జీవితము గడుపుకొంటున్నాడు.

మనుష్యులు తండ్రికంటె తల్లినే ఎక్కువగా అనుకరిస్తారనే లోకప్రవాదము భరతుని విషయములో అపవాదమైనది.

ధర్మాత్ముడైన దశరథుని వంటి భర్తను కలిగి, సజ్జనుడైన భరతుని వంటి పుత్రుని కలిగిన కైకేయి అంతటి క్రూరస్వభావమును ఎలా కలిగి ఉందో" అని తన పట్ల స్నేహముతో పలుకుచున్న లక్ష్మణుని మాటలను సహింపక ధార్మికుడైన శ్రీరాముడు తీవ్రంగా ఖండించాడు.

"లక్ష్మణా! సంభాషణము మధ్యలో మన మధ్యమ మాత అయిన కైకేయిని నీవు నిందించుట కూడదు. ఇక్ష్వాకునాథుడైన భరతుని విషయము నాకు మిక్కిలి ప్రియమైనది."

**"నతేzంబామధ్యమాతాత । గర్హితవ్యాకదాచన".**

నా మనస్సు వనవాసమందే దృఢంగా నిలిచింది. భరతుని ప్రియ వాక్యాలను మధురంగా జ్ఞాపకం చేసికొంటున్నాను.

నేను మహాత్ముడైన భరతునితో, వీరుడైన శత్రుఘ్నునితో, నీతో కూడ నిరంతరం కలసి, సుఖంగా జీవించే కాలమెప్పుడు వస్తుందో కదా! **"కదాన్వహం సమేష్యామి । భరతేన మహాత్మనా । శత్రుఘ్నే నచ వీరేణ । త్వయాచరఘునందన"**

ఈ విధంగా విలపిస్తూ సీతాలక్ష్మణులతో కలిసి శ్రీరాముడు గోదావరి పవిత్ర జలాల్లో స్నానం చేసి పితృదేవతలకు జలతర్పణాల నొసగాడు. గిరిరాజ పుత్రితో కలిసి హిమగిరి జలాల్లో పవిత్రస్నాతుడైన నందీ సమేతుడైన పరమేశ్వరుని వలె సీతాలక్ష్మణులతో కలసి శ్రీరాముడు ప్రకాశించాడు.

ఈ కాండలో భరతుని మాహాత్మ్యము వర్ణింప బడింది. శ్రీరాముని ముగ్గురు సోదరులు మూడు విధాలుగా వాసికెక్కారు. లక్ష్మణుడు శేషత్వ విశేష విభూషితుడు. శ్రీరాముని అనుసరించి అతనికి, సీతాదేవికి అన్ని విధాల కైంకర్యాలను సమర్పించాలని ఉవ్విళ్లూరాడు. తనను శ్రీరాముడు తోడు రావద్దన్నప్పుడు తనను జీవచ్ఛవంగా భావించు కొన్నాడు. సీతాదేవి సమక్షంలో శ్రీరాముని నిర్బంధించి తన కోరికను సఫలం చేసికొన్నాడు.

భరతుడు పారతంత్ర్య సంపద్భరితుడు. శేషత్వము కంటె పారతంత్ర్యము గొప్పది. భరతునికి రాజ్యపాలనము అసహ్యమైనది. శ్రీరాముని రాజుగావించి అతని సేవలో ధన్యజీవుడు కావడమే భరతుని అభివాంఛ.

రాముడు భరతుని ప్రార్థనను మన్నించలేదు. పైపెచ్చు అతనికి అయిష్టమైన రాజ్యపాలన బాధ్యతనే అప్పగించాడు. అయినప్పటికి భరతుడు రామాజ్ఞను పాలించాడు. అచేతనమైన వస్తువు వలె రామునికి పరతంత్రుడుగా ఉండుటకే నిశ్చయించుకొన్నాడు. తనను రాజుగా భావించుకోలేదు. రామపాదుకలనే రామప్రతినిధులుగా సంభావించాడు. వాటికే రాజకార్యాలను ప్రతిదినము నివేదించేవాడు.

రాజభోగాలు ఆయన మనస్సును ఆకర్షింపలేదు. రాజై నగరంలో ఉండి కూడ వనస్థులైన రామలక్ష్మణుల భోగరహిత జీవనాలనే అనుకరించాడు. శ్రీరామ

పరతంత్రుడుగా ప్రజలను కన్నతండ్రివలె పాలించాడు. రాజ్యంలో సుఖశాంతులను నింపాడు. పదునాల్గు సంవత్సరాలు ఒక మహర్షిగా మమతారహితంగా రాజ్యపాలన మొనర్చి, శ్రీరామునికి రాజ్యమును అత్యంత సంతోషంగా అప్పగించాడు.

"రాజ్యం చాzహంచరామస్య" అన్నట్లు రాజ్యమెట్లా పరతంత్రమో, తాను కూడ అలాగే రామునికి పరతంత్రుడుగా భావించుకొన్నాడు.

"భరణాత్ భరతః" భరించినందువలన భరతుడు. రాముడు అడవికి వెళ్లినా భరతుడు రాజ్యాన్ని సుఖ సమృద్ధులతో పరిపాలించాడు. తన పారతంత్ర్య ధర్మాన్ని కూడ చక్కగా పాలించుకొన్నాడు. అదే భరతుని పారతంత్ర్య మహిమ. అందువలననే వాల్మీకి ఎప్పుడు భరతుని గురించి ప్రస్తావించినా "మహాత్మా" అని అభివర్ణించాడు.

నిజంగా ధన్యజీవి భరతుడు. నిజంగా మహాత్ముడు భరతుడు. ఆయన పాలనలో భారత దేశము ధన్యమైనది. మహిమాన్వితమైనది.

ఇతిశం

"రాతిని నాతిగా ఉద్ధరించిన
మహోదారుడు శ్రీరాముడు"

# శూర్పణఖ

శ్రీరామచంద్రుడు సీతాదేవితో కూడి చిత్రాసహిత చంద్రునివలె ఆశ్రమంలో కూర్చొని ఉన్నాడు. అనేక మహర్షులు అతనిని పరివేష్టించి ఉన్నారు. వారు అనేక విషయ ప్రసంగాలలో మునిగి ఉండగా అక్కడికి రావణాసురుని సోదరి అయిన శూర్పణఖ అనుకోకుండా ఏతెంచినది.

ఆజానుబాహువు, అరవింద దళాయతాక్షుడు, జటామండలధారి సింహ వక్షస్థలుడు, సుకుమారుడు, మహాబలుడు, దేవసముడైన శ్రీరాముని శూర్పణఖ చూచింది. వెంటనే ఆమె కామ పరవశురాలు అయింది. వికృతనయన, లంబోదరి, కరాళవదన, అసంస్కృత కేశి అయిన ఆమె రూపంలో శ్రీరామునికి పూర్తిగా వ్యతిరేకమైంది. అంతటి ఘోరారణ్యము లోనికి వారి రాకకు గల కారణాన్ని ఆమె ప్రశ్నించింది.

శూర్పణఖ రాక్షసి అని గమనించి కూడ శ్రీరాముడు తమ గురించి ఉన్నదున్నట్లు సూటిగా తాము "దశరథాజ్ఞతో కైకేయి మాత కోరికలకు అనుగుణంగా ధర్మార్థము అడవికి వచ్చామని" తెలిపాడు. ఆమె గురించి వివరాలు అడిగాడు.

మదన పరవశ అయిన శూర్పణఖ "తాను రాక్షసేశ్వరుడైన రావణుని చెల్లెలునని ఆ అరణ్యమంతా భయంకరంగా ఒంటరిగా తిరుగుతుంటానని తెలిపింది. తాను ప్రభావ సంపన్నురాలనని, స్వచ్ఛంద బలగామినని తాను శ్రీరాముని పతిగా వరించానని తెలిపింది. సౌందర్య రహిత అయిన సీతాదేవిని వదలి పెట్టుమని, తాను సీతాలక్ష్మణులిద్దరిని మ్రింగివేస్తానని" వివరించింది.

అప్పుడు శ్రీరాముడు చిరునవ్వు నవ్వుతూ తాను భార్యా సహితుడను కనుక తనను వరిస్తే సవతి పోరు ఉంటుందని, తన సోదరుడైన లక్ష్మణుడు వీరుడని రూపయవ్వన సంపన్నుడని ముఖ్యంగా భార్యా రహితుడని, అతనిని వరించుమని తెలిపాడు.

శూర్పణఖ ఒక్కసారి లక్ష్మణుని వైపు దృష్టి సారించింది. అతడు అద్భుత సౌందర్య శాలిగా కనపడ్డాడు. వెంటనే రాముని వదలి లక్ష్మణుని చేరింది. "ఓ సౌందర్య సంపన్నా! నీకు తగిన సౌందర్యవతిని నేను. నన్ను భార్యగా అంగీకరించు. మన మిద్దరము దండకారణ్యంలో యథేచ్ఛగా విహరిద్దాము" అని అతనిని వేడుకొన్నది.

అప్పుడు లక్ష్మణుడు దరహాస వదనంతో, "యువతీ! నేను సీతారాముల దాసుడను. నన్ను పెండ్లాడితే నీవు కూడ దాసివే అవుతావు. అది నీకు అయిష్టము కదా! అందువలన నీవు రాముని చిన్న భార్యవు అయినా మంచిదే. అతడు వృద్ధురాలయిన సీతాదేవిని

వదిలి నిన్నే ప్రేమిస్తాడు. నీ అద్భుత రూపసంపదతో నీవు మా అన్నను వశం చేసికోగలవు" అని వివరించాడు.

మళ్ళీ ఆమె శ్రీరామునివైపు చూచింది. అతడే తనకు తగిన పతి అని తలచింది. అయితే ఆమెకు సీత అవరోధంగా అగుపడింది. వెంటనే భయంకర రూపు దాల్చి సీతాదేవిని భక్షించడానికి ముందుకు ఉరికింది.

శ్రీరాముడామెను నిగ్రహించి లక్ష్మణునితో "సోదరా! రాక్షసులతో పరిహాసము తగదు. ఆమెను ముక్కు, చెవులు ఖండించి వికృత రూపను కావించుము" అని ఆజ్ఞాపించాడు.

లక్ష్మణుడు సునిశితమైన ఖడ్గంతో ఆమె ముక్కు, చెవులను కోసి వేశాడు. రక్తము ధారగా ముక్కు చెవుల నుండి స్రవిస్తుండగా, ఆమె వర్షకాలపు మేఘము వలె భయంకరంగా గర్జిస్తూ మహారణ్యములోనికి పరుగెత్తింది. జనస్థానంలో ఖరుడనే మహా రాక్షసుని ముందు ఆకసము నుండి పిడుగు పడ్డట్లుగా పడిపోయింది.

శూర్పణఖ వ్యామోహమే మూర్తీభవించిన రాక్షస స్త్రీ. చాపల్యమే రూపుదాల్చిన మదవతి. స్వచ్ఛంద కామము, స్వైర విహారము ప్రధాన ప్రవృత్తులుగా గల ఆసురీవనిత. మొదట శ్రీరాముని ముగ్ధమోహన సౌందర్యము ఆమెను పరవశను కావించింది. అతనిని పతిగా వరించింది.

శ్రీరాముడు ఆమెకు లక్ష్మణుని చూపెట్టాడు. లక్ష్మణుని అందము, అతని చిన్న వయస్సు, తోడుగా అతనికి భార్య లేక పోవడం ఆమెను కట్టివేశాయి. సర్వలక్షణ సంపన్నుడైన శ్రీరాముని వదలి లక్ష్మణుని విషయంలో మరులవలలో ఆమె మనస్సు తగులుకొన్నది.

పోనీ లక్ష్మణుని విషయంలోనైనా ఆమె చిత్తము స్థిరంగా నిలిచిందా అంటే లేదు. తన దాస్యము, రాముని ప్రభుత్వముల గురించి ఆయన తెలుపగానే మళ్ళీ రామునివైపు ఆమె మనస్సు పరుగెత్తింది. "ఒక్క విషయంలో స్థిరంగా ఉండక, ఒకదానికంటె మరొక విషయము పట్ల వ్యామోహము పెరిగి మనస్సు పలు విధాలుగా పరిభ్రమించడానికి ప్రతీక శూర్పణఖ." (ఏదైనా మనము ఒక కొట్టుకు వెళ్లినప్పుడు ముఖ్యంగా బట్టల కొట్టుకో నగల కొట్టుకో వెళ్లినప్పుడు ఏది నిర్ణయించుకోవాలో తెలియక శూర్పణఖ వ్యామోహము మనను కూడ ఆవేశిస్తుంది కదా!)

శూర్పణఖకు శరీరము పట్ల వ్యామోహము ఎక్కువ. తనకున్న సౌందర్యము కంటె ఇంకా ఎక్కువ గాపెంచుకోవాలనే తపన ఎక్కువ. అందుకే తన నఖాలను శూర్పముల (చేటల) అంత పెంచుకొంది. తాను కురూపి అయినా సౌందర్యవతిననే భ్రాంతి కలది.

ఈ రోజులలో కూడ కొంతమందికి తమ వేళ్ల గోళ్లను వికారంగా పెద్దగా పెంచుకోవడం ఒక సరదాగా ఉంటున్నది. వాళ్ల వేళ్ల గోళ్లు ఎంతగా పెరిగితే వారికి అందము అంతగాపెరుగుతుందనే భ్రమ ఉంటుంది.

అయితే వాళ్లందరికి తమకు పూర్వము శూర్పణఖ అనే ఒక రాక్షస స్త్రీ ఉండేదని, ఆమె తమ ఆదర్శానికి ప్రతీక అని ఆమె సౌందర్యభ్రమ ఆమెనే విధంగా అధఃపతితను జేసిందనే విషయము వారికి తెలుసో తెలియదో?

శూర్పణఖ వాస్తవానికి విరూప అయినా తనను గొప్ప స్వరూపగా భావించుకొన్నది. సౌందర్యానికి ముఖ్యంగా స్త్రీ సౌందర్యానికి ప్రధాన సాధనములు ముక్కు చెవులు. ముక్కును సంపెంగ పూవుతో, చెవులను శ్రీకారములతో పోల్చి చెప్పుతారు కవులు. అవి సహజంగానే సౌందర్య సాధనాలు, అలంకారాల వలన ఆడవాళ్ల అందానికి అవి మరింత వన్నె తెస్తాయి.

శూర్పణఖ తనను వరవర్ణినిగా రామునికి అనురూపగా తలచింది. తన అనుభవానికి అవరోధంగా నిలిచిన సీతాదేవిని అంతమొందించడానికైనా తెగించింది.

అటువంటి ఆమె దురభిమానాన్ని అంతమొందించాలంటే ఆమె తన అందానికి ముఖ్య సాధనాలుగా భావించే ఆమె, ముక్కు, చెవులను తెగ గోయడమే ముఖ్యము. ముక్కు, చెవులు తెగగానే ఇంకొక్క క్షణమైనా ఆమె అక్కడ నిలువలేదు. ఆ అవమానాన్ని భరించలేక బొబ్బలిడుతూ ఆమె వెంటనే జనస్థానానికి పరుగెత్తింది.

శూర్పణఖ "వాసన"కు ప్రతీక. వాసనలు విషయానుభవవాంఛను బలంగా రేకెత్తిస్తాయి, రుచులను మొలకెత్తింప జేస్తాయి.

ఒక విషయంపై రుచి కల్గాలంటే, దానిని గురించి సంపూర్ణంగా జ్ఞానం కల్గాలి. చెవి మొట్టమొదటి జ్ఞాన సాధనము. చెవి ద్వారా విన్న విషయములపై రుచి కలిగి, అనుభవించాలనే ఆసక్తి కలుగుతుంది. ముక్కు అనుభవ సాధనాలలో ప్రధానమైనది.

వాసన పూర్వజన్మ సంస్కారము. దాని వలననే వినడము, రుచి, అనుభవము మొదలైనవి ఈ జన్మలో ఏర్పడతాయి.

అందువలన "వాసన" కు ప్రతీక అయిన శూర్పణఖను పరాభవించాలంటే (నిర్వీర్యము చేయాలంటే) వాసన వలన కలిగే శ్రవణ, అనుభవ సాధనాలయిన చెవులను, ముక్కును ఛేదించాలి.

ఇదే శూర్పణఖ, చెవులను, ముక్కును కోయడంలోని అంతరార్థము.

ఇతిశం

"పరమేశ్వరుడు పరవశంతో జపించే
నామము శ్రీ రామనామము"

"చావు నుండి బ్రతికించే - సంజీవని
శ్రీరామ నామము"

# తరుణౌ రూపసంపన్నౌ

ఖరుడు మహాక్రూరుడు, అరివీర భయంకరుడు, అప్రతిమాన బలసంపన్నుడు, అమోఘ వరగర్వితుడు. దూషణ, త్రిశిరులు అనే క్రూర రాక్షసులిద్దరు ఈతని తమ్ములు.

ఖరుని భయంకర రూపము, శత్రుదుర్నిరీక్ష్య క్షాత్రము రాక్షస రాజైన రావణుని ఆకర్షించాయి. అందుకే రావణుడు సోదర ఖరుని జనస్థానాధిపతిగా నియమించాడు.

శూర్పణఖ లక్ష్మణుని వలన నాసికా కర్ణాలు తెగి నెత్తురోడుతూ పెడబొబ్బలిడుతూ ఖరుని ముందుకు వచ్చి పడిపోయింది. ఖరుని ఆగ్రహము కట్టలు త్రెంచుకొంది. ఆయన శూర్పణఖతో "సోదరీ! నిన్నీ విధంగా అవమానించిన దుర్మార్గుడెవ్వడు? దేవగంధర్వులా? స్వయంగా దేవేంద్రుడా? వాడెవ్వడైనా ఎంతవాడైనా నా భయంకర బాణాఘాతముతో రక్తము కక్కుతూ చావవలసిందే! కాకులు, గద్దలు వాడి మాంసాన్ని పీక్కొని తినవలసిందే. దేవగంధర్వ పిశాచాదులలో ఎవ్వడు కూడ వాడిని రక్షింప జాలడు. అందువలన కొంచెము ఓపిక తెచ్చుకొని ఆ దుష్కర్ముని గురించి తెలుపుము" అని ఖరుడు గద్దించాడు.

శూర్పణఖ ఒక దుష్ట రాక్షసి. మహా గర్విష్ఠి. సాక్షాత్తుగా రావణ సహోదరి. రామలక్ష్మణుల వలన ఘోర పరాభవానికి గురి అయింది. అటువంటప్పుడు ఆమె నోటి నుండి ఎంతటి కఠినోక్తులు రావాలి? కాని ఆశ్చర్యము! ఆమె నోటినుండి వారి సౌందర్య, బలప్రశంసలు వినవచ్చాయి. ఆమె చిత్తములో వారి సౌందర్య మహాబలాలు ముద్రింప బడ్డాయి. "శత్రుమిత్ర సమాన వశీకరణ సమర్థము కదా శ్రీరామ సౌందర్యము!"

శూర్పణఖ రామలక్ష్మణుల యౌవనాన్ని, రూపసంపదలను బలంగా కామించింది. ఆశ్చర్య మేమిటంటే సోదరసముడైన ఖరుని ముందు కూడ తన కామాన్ని ఆమె కప్పి పుచ్చుకోలేదు. "కామాతురాణాం న భయం, న లజ్జా".

తనను వికృతాకారను కావించిన రామలక్ష్మణుల గురించి ఆమె మాటలనే గమనిద్దామా!

**"తరుణౌ రూపసంపన్నౌ, సుకుమారౌ, మహాబలౌ,**
**పుండరీక విశాలాక్షౌ, చీరకృష్ణా జినాంబరౌ "**

**తరుణౌ:** స్త్రీ పురుషుని కామించడానికి ముఖ్యకారణము పురుషుని యౌవనమే.

(1) భగవంతుని యౌవనాన్ని వర్ణిస్తూ వేదము అతనిని "యువా కుమారః"

అంటుంది. అప్పుడప్పుడే కౌమారము నుంచి యౌవనంలో ప్రవేశించిన వయస్సు. ఇంకా ముప్పదేండ్లు కూడ రాని ప్రాయము.

(2) సీతాదేవి శ్రీరాముని గురించి తెలుపుతూ, "భర్తా మే పంచ వింశకః" (నా భర్త వయస్సు ఇరవై అయిదేండ్లు అంటుంది.

(3) లీలావిభూతిలో దశరథ, వశిష్ఠ, వామదేవాదులు, నిత్య విభూతిలో నిత్యముక్తులు తమ మనస్సులలో నింపుకొన్నది భగవంతుని యౌవనాన్నే.

(4) ప్రేయసీ, ప్రియులు ఆశపడేది తారుణ్యాన్నే.

(5) అయితే శూర్పణఖ ముందుగా కామించింది శ్రీరామునే కదా! అప్పుడు "తరుణః " (తరుణుడు) అని ఒక్క రామునే తెలుపక "తరుణౌ" అని ఇద్దరి ప్రాయాన్ని ఎందుకు తెలిపింది? అంటే "అన్యోన్య సదృశౌ" అన్నట్లు రమణులను రమింప జేయడంలో రామలక్ష్మణులిద్దరి పరువము సమానమే.

(6) లక్ష్మణుడు తన నాసికా, కర్ణాలను తెగ గోశాడు కదా! ఆయన పైన కోపము లేదా? అంటే అలా చేయుమని ఆజ్ఞాపించింది రాముడే. అలా చేసింది లక్ష్మణుడు. కోపము ఇద్దరిపైనా ఉంది. అయితే అంత కోపంలో కూడ నవనవ లాడే వారి వయస్సును ఆమె మనస్సు మరువలేక పోతున్నది.

(7) వారి గురించి ఖరునికి తెలిపే సమయంలో వారి తరుణ రూపాలు ఆమె కళ్లముందే కదలాడుతున్నాయి.

(8) సాధారణంగా అన్నదమ్ములిద్దరిలో ఒకరికంటె మరొకరు పెద్దగానో, చిన్నగానో ఉంటారు కదా! అంటే అలా కాదు. వారిలో అన్న ఎవ్వరో, తమ్ముడెవరో క్రొత్త వారు గుర్తు పట్టజాలని సమాన స్థితి వారిది.

**రూపసంపన్నౌ**

(1) వయస్సు ఆకర్షణకు ఒక కారణం కావచ్చు. అయితే అది సాధారణంగా ప్రతి వ్యక్తిలో ఎప్పుడో ఒకప్పుడు ఉండేదే. అంతమాత్రాన వయస్సులో ఉన్న వారంతా ఒకే రకమైన ఆకర్షణను కల్గిస్తారా? లేదే! వయస్సుతో పాటు అందము కూడ జత అయితేనే ఆకర్షణ అధికంగా ఉంటుంది. రామలక్ష్మణులిద్దరు సుందరరూపులే. రూపమేనా వీరి సంపద! అనుకొనేంతగా సౌందర్యమే రూపుదాల్చినవారు.

(2) "సాక్షాన్మన్మథ మన్మథః" మన్మథుని మనస్సును కూడ పిచ్చెక్కింప జేసే సౌందర్య స్వరూపులు రామలక్ష్మణులు.

(3) **ఉత్పన్నం ద్రవ్యం క్షణం నిర్గుణం తిష్ఠతి"** అన్నట్లు ఏ వస్తువును చూచినా వెంటనే దాని గుణము గోచరింపదు. అయితే దాని గుణాన్ని బట్టే దానికి గౌరవము.

అలాగే రామలక్ష్మణులు ముందు వ్యక్తులు తరువాత యువకులు. అయితే యౌవనము కొంత కాలానికి వచ్చిపోయేది (ఆగంతుకము) కదా! అలాగే వారి రూపసంపద కూడ ఆగంతుకమేనా?

కాదు "రూపదాక్షిణ్య సంపన్నః ప్రసూతః" వారిద్దరు పుట్టుకతోనే రూపసంపన్నులు. వారి సౌందర్యము శాశ్వతము.

(4) సాధారణంగా స్త్రీలు పురుష రూపానికి, పురుషులు స్త్రీ సౌందర్యానికి ఆకర్షింప బడుతారు. అయితే రామలక్ష్మణుల రూపసంపద లోకాతీతమైనది. పురుషులనే సమ్మోహితులను కావించేది రామలక్ష్మణ సౌందర్యము.

**సుకుమారౌ**

(1) పురుషులు సుందరులయినా సహజంగా వారి శరీరాలు మొరటుగా ఉంటాయి. అయితే తరుణులయిన రామలక్ష్మణులు సుందరులు మాత్రమే కారు సుకుమారులు కూడ. వారి ఆలింగనం పాషాణ కఠినము కాదు. సుకుమార కుసుమ సదృశము.

(2) "రామం ఇందీవర శ్యామం" "పూవై పూవణ్ణా" అన్నట్లు సుకుమారమైన కలువ పూవు, కానుగ పూవు కాంతులను కల్గి ఉంటారు రామలక్ష్మణులు.

(3) శ్రీదేవి తన సుకుమార శ్రీహస్తాలతో స్వామి సుందర శరీరమును మృదువుగా స్పృశించాలని ఆశపడుతుంది. ఆ తల్లి తాకి తాకనట్లు మెల్లగా స్పృశించగానే స్వామి కంది పోతాడట. మన మాటలకందేదా, మనస్సుల కందేదా స్వామి సౌకుమార్యము!

(4) "నడందకాల్ నొందవో?" స్వామి నాలుగు అడుగులు నడిస్తే అంతరంగులు "స్వామీ! నీవు నడచిన కాళ్లు ఎంత నొచ్చాయో?" అని బాధపడేంతటి సౌకుమార్యము స్వామిది.

(5) మన్మథుడొక్కడే. కాని రామలక్ష్మణులను చూస్తే మన్మథులిద్దరా? అని అనుపించక మానదు.

**మహాబలౌ**

వారి తారుణ్య సౌందర్య, సౌకుమార్యాలు దూరము నుండి చూచి ఆనందించ దానికేనా? యువతుల ఆలింగనములను వారు సహింప జాలరా? అప్పుడు రమణీ మణులకు వారి వలన ప్రయోజనమేమిటి? అంటే

(1) అలా కాదు. వారెంత సుకుమారులో అంతటి మహాబలులు. భరత, హనుమదాది భక్తులకు పరిష్వంగ సౌఖ్యాన్ని అందించిన మహానుభావులు.

(2) "భర్తారం పరిషస్వజే" అన్నట్లు సీతాదేవి శ్రీరాముని వీర విజయస్వరూపాన్ని అన్ని వైపుల నుండి ఆలింగనం చేసికొని ఆనందంలో తలమున్కలైంది.

(3) "రామస్తు సీతయాసార్థం విజహార బహూన్ ఋతూన్" ఒక్కసారి మాత్రమే కౌగిలించుకొని విడువడం కాదు. సీతాదేవితో అనేక ఋతువులలో అనేక మారులు కౌగిలింతల ద్వారా శృంగార విహార సమర్థములు స్వామి బాహువులు.

**పుండరీక విశాలాక్షౌ**

అన్యులను ఆకర్షించడంలో అన్ని అవయవాలు ఒక ఎత్తు. తిరునేత్రాలు ఒక ఎత్తు.

(1) కనులు కమలదళాల వలె విశాలములు. సరోజ సుమ సుందరములు - సరసిజ పత్ర సుకుమారాలు.

(2) ఆ కనులు అందరితో రాయబారము నడుపుతాయి. రాయబారములో వశులైన వారిని దగ్గరకు రమ్మని ఆహ్వానిస్తాయి. దగ్గరకు చేరినవారిని కరుణతో కటాక్షిస్తాయి. ఆశ్రితులందరికి ధన్యతను, ఆప్యాయతను కలిగిస్తాయి.

(3) "పశ్యన్మానస పశ్యతో హర రుచిం" అన్నట్లు తమను సేవించేవారి మనస్సులను చూస్తుండగానే దొంగిలించి వారిని చిత్ర ప్రతిమలవలె నిశ్చలులను కావిస్తాయి ఆ కనుల కాంతులు.

(4) "కప్యాసం పుండరీకమేవమక్షిణీ" అని వేదాలు భగవంతుని గురించి తెలుపుతూ "అప్పుడప్పుడే వికసిస్తున్న తెల్ల తామరల వంటి కనులు గల స్వామి" అని వర్ణిస్తాయి. అలాగే రామ లక్ష్మణుల నేత్రాలు కూడ పరత్వ ప్రకాశకములు.

(5) "సంరక్త నయనా ఘోరాః" రక్తము వంటి ఎరుపుదనముతో నిండిన మీ (ఖర)నేత్రాల వంటివి కావు. మధ్యమధ్యలో ఎరుపురేఖలతో, మిగిలిన భాగంలో తెల్లదనముతో నిండినవి రామలక్ష్మణుల సుందర నయనాలు.

(6) రక్షకత్వ సూచక వైశాల్యము, ప్రభుత్వ సూచక ఆరుణ్యము (ఎరుపుదనము) ఆకర్షక సూచక సౌందర్యాలతో సంపూర్ణములైనవి వారి నేత్రాలు.

(7) తమోగుణ సూచకమైన గాఢ నిద్ర వలన, రజోగుణోద్రేక సూచకములైన అహంకార, ఆగ్రహముల వలన రక్త వర్ణములు కాక, సత్వగుణప్రచురములై, ప్రసన్నములై ప్రసాద పరిపూర్ణములైనవి వారి నేత్రాలు.

(8) పాలకడలివలె ఆవలి తీరము కానరానంత విశాలనేత్రాలు.

(9) ఏవో లౌకిక వస్తువులతో పోల్చి చెప్పాలి కనుక పుండరీక నయనములని చెప్పాను. కాని కమలములవలె వాడి పోయేవా? రాలిపోయేవా? స్వామి నేత్రాలు? గోదాదేవి చిరుగజ్జెలతో, తామరపూవుతో, సూర్యచంద్రులతో పోల్చి, ఏవి సరిపోనందున "అంకణ్" సుందర నేత్రాలు అని స్వభావోక్తిగా తెలిపింది.

(10) సముద్రములో పడినవారు అందులోనే మునుగుతూ తేలుతూ, ఊపిరాడనట్లే, స్వామి నేత్ర సౌందర్యమగ్నుల పరిస్థితి కూడ అంతే.

(11) ప్రాణాలను నిలబెట్ట గలిగిన, "తందామరైక్కణ్ణన్" అన్నట్లున్న స్వామి తిరు నేత్రాలు శీతల కమలములవలె, బద్ధ, ముక్త, నిత్యజనులందరిని ఏక విధంగా కటాక్షింప గలుగుతాయి.

**మహాబలౌ పుండరీక విశాలాక్షౌ**

(1) తమ బలంతో శత్రువులను కూడ వివశులను కావించి, దాసులమని వారితో ఓటమిపత్రము వ్రాయించి తీసికోదగిన సురుచిర నయనములు.

(2) తమకు స్వాధీనులైన వారిని చేయి వదలక, "అవలోకన దానేన భూయో మాం పాలయ" అన్నట్లు వారికి అభయమిచ్చి వారిని పాలించే కనులు.

(3) "పుండరీకాక్ష రక్షమాం" అన్నట్లు ఆశ్రితుల ఆపదలను పోగొట్టి కాపాడే కనులు. కాపాడుమని ఆశ్రితులందరు మళ్లీ మళ్లీ ఆశ్రయించే కనులు.

**పుండరీక విశాలాక్షౌ - సుకుమారౌ**

సుందరులు సుకుమారులు అనుట చేత పుష్పములను బాణములుగా కల మన్మథులని కూడ అర్థము.

**చీరకృష్ణాజినాంబరౌ**

రామలక్ష్మణులు సహజ సుందరులు. అందువలన వారి సౌందర్యానికి పీతాంబరములు అవసరము లేదు. సుకుమారులు కనుక పట్టుపుట్టాలు అక్కరలేదు.

నారచీరలు కూడ వారికి అందంగానే ఉన్నాయి. జింక చర్మాలు కూడ సుందరంగానే ఉన్నాయి. కట్టుకొన్న వాటితో, పెట్టుకొన్నవాటితో వచ్చే అందము వారికి అవసరము లేదు. వారి అందమే వాటికి ప్రకాశాన్ని కల్గిస్తుంది. వారి నారచీరలు ఋషుల మనస్సులనే కలవరపెట్టుతాయి. సాధారణంగా పురుష వస్త్రాలు స్త్రీలను ఆకర్షిస్తాయి కదా.

ఈ శ్లోకము ద్వారా శూర్పణఖ ఒకవైపు ఖరుని యుద్ధోన్ముఖుని చేస్తున్నది. మరొకవైపు అతనిని హెచ్చరిస్తున్నది. ఆ రెండు విధాల భావాలను పరిశీలిద్దామా!

ముందు ఖరుని ప్రోత్సహించే భావాలను గమనిద్దాము:

1. తరుణౌ:- యుద్ధరంగములో ఆరితేరుటకు తగిన ముదురు వయస్సు ఇంకా వారికి రానేలేదు. వారి తండ్రే "బాలోహ్యకృత విద్యశ్చ" మా రాముడు ఇంకా చదువు కూడ పూర్తిగాని పిల్లవాడు" అన్నాడు కదా.

2. "తరుణౌ" అంటే పిల్లలు కాదు. యువకులని కదా అర్థము అంటే కావచ్చు అయితే "యౌవనే విషయేషిణాం" అన్నట్లు యౌవనము విషయ సుఖాలనాశించే వయస్సు కదా! యుద్ధాలను కోరుకొనే వయస్సు కాదు కదా.

రూపసంపన్నౌ: స్త్రీలు అభిలషించే రూపసంపద కలవారు. "రూపేణ వనితాజనం" "కన్యావరయతే రూపం" స్త్రీలను ఆకర్షించే రూపసంపద కలవారే కాని యుద్ధ విశారదులు కారు.

**సుకుమారౌ**

(1) శ్రీమంతుల పిల్లలు కనుక గారాబంగా పెరిగినవారు.

(2) ఒక్కసారి నీ ఎఱ్ఱని కళ్లతో కోపంగా చూస్తే భయపడుతారు. నీ భయంకర ఆయుధాలను ఎదుర్కోగలరా?

మహాబలౌ: మహా+అబలౌ = గొప్పబలం లేనివారు. "శరీరాన్ని బట్టి సుకుమారంగా ఉన్నా అవసరము వచ్చినప్పుడు గట్టిగా నిలబడలేరా? అంటే

(1) వారు కేవలము శారీరకంగా బలహీనులే కాదు. సమస్యల నెదుర్కొనే మానసిక ధైర్యం కూడ లేనివారు. ఒక్క ఆడదాని మాటకు కట్టుబడి వారసత్వపు హక్కుగా సంక్రమించిన రాజ్యసంపాదనను కోల్పోయిన అవ్యవస్థిత చిత్తులు.

(2) వారు బలశాలులే అనుకున్నా - వారిద్దరికి వేరే బలమే లేని వారు.

(3) వేరే సహాయము లేకపోవడమే కాదు. వారిద్దరిని స్వేచ్ఛగా యుద్ధము చేయనీయ కుండా అడ్డుగా ఒక ఆడది కూడ ఉంది."తయోర్మధ్యే సుమధ్యమా".

పుండరీక విశాలాక్షౌ:- తమకు, సీతకు కూడ ఏమి ఆపద వాటిల్లుతుందో అనే భయంతో పాలిపోయిన (రక్తహీనములైన) పెద్ద కళ్లు కలవారు.

చీరకృష్ణాజినాంబరౌ: అశక్తులైతేనేమి శ్రీమంతులు కదా. అంటే కట్టుకోవడానికి మంచి బట్టలు కూడ లేనివాళ్లు. నారచీరలు, జింక చర్మము ధరించినవారు. ఆ రెండు రకాల ధరించిన వాటిలో స్థిరములైన చెట్లు ఇచ్చేవి నారచీరలు. జంగమాలైన జింకల వలన లభించేది జింకతోలు. అందువలన రామలక్ష్మణులను జయించడము నీకొక లెక్క కాదు. అందువలన యుద్ధానికి సిద్ధపడుమని ఖరుని ప్రోత్సహించింది.

ఇక ఖరునికి చేసిన హెచ్చరికను గమనిద్దామా:

(1) తరుణౌ : "దశరథా! నీవు వేల ఏండ్ల ముదుసలివి. రాముడు అడవిలో యుద్ధము చేయదగిన వయస్సు, పరాక్రమములు కలవాడు. (సత్యపరాక్రముడు)" – విశ్వామిత్రుడు.

(2) యౌవనేవిషయేషిణాం : యౌవనంలో విషయేచ్ఛ ఉంటుంది కదా! అంటే విషయమంటే రాజ్యమని కూడ అర్థము కదా! "భవద్విషయవాసినః" మీ రాజ్యములోని వారము.

(3) తరుణౌ: అటువంటి యువకుడు ఒకడు ఉంటే చాలు. అటువంటి వాళ్లు ఇద్దరు నీవెలా పోరాడగలవు?

(2) రూపసంపన్నౌ: "సింహోరస్కం మహా బాహుం" అన్నట్లు విశాలవక్షము, దీర్ఘ బాహువులుగల పురుష సింహులు వారు. ఆయుధాల అవసరం లేకుండానే శత్రువులను మట్టి కరిపించగలిగిన దేహబలులు.

"గత్వాసౌమిత్రి సహితో నావిజిత్య నివర్తతే" లక్ష్మణునితో కలసి యుద్ధానికి వెళ్లితే అపజయమే లేనివారు.

సుకుమారౌ: (1) ఎంత యుద్ధ పరిశ్రమ కావించినా చెమట పట్టని కౌమారం కలవారు.

(2) దేవ, గంధర్వ, మనుష్య, పన్నగాలతో కూడిన జగచ్ఛైలమును త్రిప్పగలవారు.

"జగచ్ఛైలం పరివర్తయామ్యహం"

(3) "సాగరమేఖలాం మహీం దహతి కోపేన" తన కోపంతో సాగర పరివృతమైన భూమి నంతటిని దహింపజేయగల్గుతాడు.

ఇన్ని విధాల వారు పరాక్రమించడానికి మూలమేది?

**మహాబలౌ:**

(1) సహజంగా "మహాభుజులు" గొప్ప భుజబలం కలవారు.

(2) భుజబలముతో పాటు (మహా) మనోబలం కలవారు.

(3) మీ చతురంగ బలాలను కూడ లెక్కచేయని మహావీరులు వారు.

(4) ఎంతకాలం యుద్ధం చేసినా అలసట కలుగకుండా "బల", "అతిబల" విద్యలను నేర్చినవారు.

అయితేవారి బలము తగ్గదనుటకు గుర్తేమిటి?

**"పుండరీక విశాలాక్షౌ"**

(1) అలసట కలుగదనుటకు గుర్తు వాడిపోని వారి కనులకాంతే.

(2) ఎదుటివారెంత వారైనా తగ్గటము, పెరుగడం లేని కాంతి గల కనులు.

(3) ప్రీతి విస్ఫారితములైన కన్నులు అన్నట్లు రోజు రోజుకు ప్రేమతో పెరిగే కన్నులు.

**చీరకృష్ణాజినాంబరౌ**

(1) మనస్సులో ధైర్యము కలిగి నిరంతరము సన్నద్ధంగా ఉంటారు.

(2) అడవిలో సంచరిస్తూ మృగాలను, మృగముల వంటి రాక్షసులను వేటాడేవారు కనుక నారచీరలు జింకతోలును ఎప్పుడు ధరించే ఉంటారు.

ఈ విధంగా తన మనస్సులో ముద్రించుకొన్న రామలక్ష్మణుల మనోహర రూపాలను ఆవిష్కరించడమే కాక, రామలక్ష్మణుల పరాక్రమమును తెలుపుతూ ఖరుని హెచ్చరించడము, రామలక్ష్మణులను సులభంగా జయించవచ్చునని ఖరునికి ఆశ కల్పించడము – ఇన్ని భావాలను కూడ ఒకే శ్లోకంలో పొందుపరచడం వాల్మీకి కవితా సౌందర్యానికి ఒక మచ్చుతునక.

ఈ శ్లోకాన్ని శ్రీరాముని ఎదురుగా నిలబడి సౌందర్య ప్రశంస కావిస్తూ స్తోత్రము చేయడానికి చదవాలి.

ఇతిశం

# రాముడొక్కడు - ధర్మాత్ముడు

ఖరుడొక భయంకర రాక్షసుడు. మహా బలగర్వితుడు. దూషణ త్రిశిరులనే క్రూర రాక్షసులిద్దరు ఈయన సహోదరులు.

"శేషధర్మాల"లో ఖరుని గురించి భీష్మయుధిష్ఠిర సంవాదంలో ప్రస్తావింపబడింది. యాజ్ఞవల్క్య మహర్షి పుత్రుడైన చంద్రకాంత ఋషిగా ఖరుని పూర్వజన్మ వివరింపబడింది.

చంద్రకాంతునికి రహస్యంగా అమృతపానం చేయాలని ఆశ ఉండేది. అందువలన ఆయన ఒక క్రూర రూపాన్ని ధరించి అమృతాన్ని అపహరించాడు. ఆయన పాపకృత్యము పరమశివుని దృష్టికి వచ్చింది. చంద్రకాంతునికి అమృత పానము అయితే లభింప లేదు. కాని శివ శాపము వలన ఖరునిగా రాక్షస రూపము లభించింది.

శూర్పణఖ రక్తము కారుతున్న ముక్కు చెవులతో ఖరుని ముందు వాలింది. ఖరుడంటే తీవ్రమైన ఇంద్రియ ప్రవృత్తి గలవాడు. **"ఖ"** అంటే ఇంద్రియము - **"ర"** అంటే అగ్ని. ఖరుడంటే అగ్నిలాగే ప్రకోపించే ఇంద్రియములు కలవాడు.

శూర్పణఖ పరాభవానికి ప్రతీకారంగా తన దగ్గర ఉన్న పదునాలుగు వేల సైన్యానికి నాయకులుగా నున్న పదునాలుగు మంది రాక్షస వీరులను రామలక్ష్మణులను నిగ్రహించ డానికి శూర్పణఖ వెంట పంపాడు.

శూర్పణఖ ప్రతీకార కాంక్షతో ఖరబలాలతో రామాశ్రమాన్ని సమీపించింది. శ్రీరామచంద్రుడు సీతాదేవిని రక్షించడానికి లక్ష్మణుని నియమించాడు. కనక విభూషితమైన కోదండాన్ని తానొక్కడే గ్రహించి ముందుకొచ్చాడు.

ఖరసేనతో తన గురించి రామభద్రుడు ఈ విధంగా తెలిపాడు. "మేము దశరథ చక్రవర్తి తనయులము. సీతాదేవితో కూడ దండకంలో ప్రవేశించాము. అహింసా పరాయణులు, తపోవృత్తి నిష్ఠులైన తాపసోత్తములను మీరు అకారణంగా క్రూరంగా హింసించినందు వలన మహర్షులు మా రక్షణను కోరారు. వారికి మేము అభయమిచ్చాము.

శూర్పణఖ స్వేచ్ఛా కామవృత్తి కలది. గృహస్థాశ్రమ విధులను పాటించే దీక్ష గల మేము ఆమె కామాన్ని అంగీకరించలేదు. అడ్డుగా ఉందని సీతాదేవిని కబళించాలని శూర్పణఖ ముందుకు వచ్చింది. అందువలననే ఆమెకు పరాభవం కల్గింది.

ఇప్పుడు మీరు శూర్పణఖకు అండగా వచ్చారు. అయితే మీకు ప్రాణాలపై ఆశ ఉంటే పారిపోండి. లేదా మీరెవ్వరు సురక్షితంగా తిరిగిపోజాలరు".

ఖరుని పదునాలుగు మంది సేనానాయకులు శ్రీరామ వాక్యాలను విని క్రోధావిష్టులయ్యారు. ఒంటరివాడు, ధర్మాత్ముడైన శ్రీరాముని చుట్టుముట్టి పరిఘలతో, పట్టసాలతో, శూలాలతో బాధించారు. శ్రీరాముడు నిశిత నారాచాలతో వారందరిని వధించాడు.

చతుర్దశ రాక్షస బలాలను క్షణంలో రాముడు సంహరించగానే భయభీత అయిన శూర్పణఖ వృక్షము నుండి తెగిపడిన తీగవలె తిరిగి ఖరుని చేరి అక్కడి వృత్తాంతాన్ని అంతటిని నివేదించింది.

"అంతేకాదు ఒకవేళ నీకు నాపైన, మృతులైన రాక్షసులపైన దయ ఉంటే, రాముని ఎదిరించే శక్తి, తేజస్సు ఉంటే, దండకను నిష్కంటకం చేయి. ఒకవేళ నీవు ఈ రోజే రాముని వధించకుంటే నీముందే ప్రాణాలు వదులుతాను. నిజంగా నీవు రాముని ముందు నిలువ జాలవు. ప్రగల్భాలు మాత్రము పలుకుతుంటావు" అని ఖరుని రెచ్చగొట్టుతూ శూర్పణఖ శోకావిష్ట అయింది.

శూర్పణఖ కఠినోక్తులను ఖరుడు సహింపజాలలేదు. "సోదరీ నీ అవమానాగ్ని నన్ను దహించివేస్తున్నది. నాలో క్రోధము సముద్రము వలె పొంగిపోతున్నది. రాముడు ఒక మానవ మాత్రుడు. క్షణంలో ఆయనను వధిస్తాను. ఆయన రక్తాన్ని నీవు తృప్తిగా త్రాగగలవు" అని ఆమెను సంతుష్టురాలిని చేశాడు.

తనదగ్గర ఉన్న పదునాలుగు వేల మంది రాక్షసులను, నల్ల మబ్బు వంటి రంగు గల వారిని, శార్దూల దర్పులను, భయంకర యుద్ధకర్ములను సిద్ధం కావించాడు. ఉత్తమాశ్వ సంయుక్తమై సూర్యప్రభాసంకాశమైన మహారథాన్ని అధిరోహించాడు. వివిధాయుధోపేతులైన వేలాది రాక్షసులు దూషణ త్రిశిర పురస్సరంగా ఖరుని అనుసరించారు.

ఖరునికి, అతనికి రాక్షస బలాలకు అనేక అపశకునాలు అగుపించాయి. మేఘాలు రక్తమును వర్షించాయి. రథాశ్వాలు పడిపోయాయి. గద్దలు ఖరుని ధ్వజముపై వ్రాలాయి. మృగపక్షులు భైరవంగా అరిచాయి. అంతట అంధకారము ఆవరించింది. నక్కలు వికృతంగా కూశాయి. రాత్రి రాకుండానే ఆకాశం నుండి నక్షత్రాలు రాలసాగాయి. ఖరునికి శిరోవేదన మొదలైంది. ఎడమ భుజము అదిరింది. ఆయన కన్నులు కన్నీటితో నిండాయి.

అయినా ఖరుడు చలింపలేదు. సైన్యానికి ధైర్యాన్ని నూరి పోశాడు. "వీరులారా! దుర్బలులవలె ఈ అపశకునాలకు మనము బెదిరిపోకూడదు. నేను నా తీక్ష్ణ బాణాలతో ఆకాశం నుండి చుక్కలను రాలేట్లు చేస్తాను. యముని మృత్యుముఖుని కావిస్తాను. రామ లక్ష్మణులిద్దరిని యుద్ధరంగంలో సంహరింపక వెనుదిరగను. నిజం చెపుతున్నాను. ఇంతవరకు నాకు యుద్ధంలో పరాజయమే కలుగలేదు. ఐరావతంపై అధిరోహించి వచ్చిన అమరేంద్రునైనా హతమారుస్తాను. నాకు మానవులొక లెక్కా?"

ఖరుని శూరవాక్యాలు విన్న రాక్షస సైన్యము మళ్లీ విజృంభించింది. రామాశ్రమము వైపు పరుగులెత్తింది.

ఆశ్రమాన్ని సమీపిస్తున్న రాక్షస సైన్యాన్ని రామలక్ష్మణులు అవలోకించారు. వారికి అనేక శుభ శకునాలు అగుపించాయి. పక్షుల కూజితాలు శుభసంకేతాలను అందించాయి. వారి బాహుస్ఫురణ శుభోదయమైంది. అయితే ఒక భయంకర సంగ్రామము జరుగబోతుందని వారికి స్పష్టమైంది.

శ్రీరాముడు లక్ష్మణునితో "సోదరా! నీవు మహా వీరుడవు. యుద్ధమంటే నీకు ఒక ఆట. అయినా నీవు సీతను తీసికొని ఒక కొండ గుహను చేరి ధనుర్ధారివై ఆమెను రక్షించు. నేనొక్కడినే ఈ రాక్షస సైన్యం సమస్తాన్ని సంహరిస్తాను. ఇది నా ఆజ్ఞ" అని ఆదేశించాడు. రామాజ్ఞను లక్ష్మణుడు పాలించాడు.

ఆ భయంకర సంగ్రామాన్ని స్వయంగా వీక్షించడానికి దేవగంధర్వ, సిద్ధచారణ, ఋషులు, మహర్షులు బ్రహ్మర్షులు వినువీధిలో సమాయత్తమయ్యారు. "చక్రహస్తుడు రాక్షస సైన్యాన్ని వధించినట్లుగా రామభద్రుడు ఈ రజనీ చరులందరిని జయించు గాక. గో, బ్రాహ్మణులకు శుభమగుగాక, లోకాలన్ని సుఖించుగాక" అని స్వస్తి వచనాలు పలికారు.

అయినావారి మనస్సులలో ప్రశాంతత కలుగ లేదు. భయంకరులైన్న పదునాల్గువేల రాక్షసులెక్కడ? ఒంటరివాడు ధర్మాత్ముడైన రాముడెక్కడ? ఈ యుద్ధమెలా జరుగుతుందో అని వారిలో ఆందోళన పెరుగసాగింది.

**"చతుర్దశ సహస్రాణి రక్షసాం భీమకర్మణాం**
**ఏకశ్చ రామో ధర్మాత్మా కథం యుద్ధం కరిష్యతి"**

అయితే శ్రీరామునిలో విజయతేజస్సు ప్రకాశించింది. ధనుర్ధారి అయిన రుద్రుని రౌద్రము ఆయన రూపంలో గోచరించింది. సర్వ రాక్షస సంహారము కొరకు తీవ్రమైన క్రోధము ఆయనలో ఆవేశించింది.

ఖరుడు తన రథాన్ని రామునివైపు మళ్లించాడు. రాక్షసులందరు సింహనాదాలు చేశారు. ఖరుడు వారి మధ్యలో చుక్కల మధ్య అంగారకుని వలె అగుపించాడు. ఆయన శరసహస్రాన్ని రామునిపై ప్రయోగించాడు. రాక్షసులందరు వివిధాయుధాలతో రాముని చుట్టుముట్టారు.

శ్రీరాముడు ఖర శర సహస్రాన్ని, రాక్షసుల వివిధాయుధాలను సముద్రుడు నదీ ప్రవాహాల నెదుర్కొన్నట్లుగా ఎదుర్కొన్నాడు. రక్తసిక్త శరీరంతో ఆయన సంధ్యా మేఘాలు ఆవరించిన ఆదిత్యుని వలె అగుపించాడు.

అప్పుడు రామభద్రుడు అగ్రహోదగ్రుడై ధనుస్సును మండలాకారముగా త్రిప్పుతూ వందల, వేల బాణాలను వర్షించాడు. అవి రాక్షసుల దేహాలను ఛేదించి కాలపాశముల వలె వారి ప్రాణాలను తీశాయి.

వారి ధనుస్సులు, ధ్వజాలు, కవచాలు, శిరస్సులు, తెగి పడిపోయాయి. హయాలు, గజాలు, సారథులు సంహరింపబడ్డారు.

శేషసైన్యాన్ని దూషణుడు సమీకరించాడు. శూల, ముద్గర, ద్రుమ, శిలలతో రాక్షసులు రాముని మళ్లీ చుట్టుముట్టారు.

శ్రీరామచంద్రుడు భయంకర నాదం కావించి, గాంధర్వాస్త్రాన్ని ప్రయోగించాడు. రాముడెప్పుడు శరసంధానాన్ని చేస్తున్నాడో ఎప్పుడు వదులుతున్నాడో, రాక్షసులు గమనింప జాలలేదు. రాక్షస శవాలు గుట్టలు గుట్టలుగా పడిపోయాయి.

దూషణుడు భయంకర సర్పం వంటి పరిఘను తీసికొని రామునెదుర్కొన్నాడు. శ్రీరాముడు రెండు క్రూర బాణాలతో దూషణుని భుజాలను ఖండించాడు. ఆయన పరిఘ ఖండింపబడింది. ఇంద్రచాపమువలె ఆయన శరీరము రణరంగములో తెగి పడిపోయింది. ఖరుడు మహాకపాల, స్థూలాక్ష ప్రమాథులనే ముగ్గురు సేనానులను పన్నెండు మంది మంత్రులను ఆజ్ఞాపించాడు. వారే కాక వీరులందరు రామునెదుర్కొన్నారు. చతుర్దశ సహస్ర రాక్షస బలాలు ఆయన బాణాగ్నిలో మాడిపోయాయి.

త్రిశిరుడనే రాక్షస ప్రముఖుడు ఖరుని ఆజ్ఞతో శ్రీరాముని ఎదుర్కొన్నాడు. రామ త్రిశిర యుద్ధము మహా సంకులమైంది. అది సింహకుంజర సంగ్రామము వలె భీకరమైంది. త్రిశిరుడు రామ లలాటంపై మూడు బాణాలను ప్రయోగించాడు. త్రిశిరుని ప్రతాపాన్ని రాముడు ప్రశంసించాడు. అయితే ఆశీ విష సర్పాల వంటి బాణాలతో త్రిశిరుని హృదయాన్ని భేదించాడు.

దూషణ త్రిశిరుల వధ, సేనానుల మరణము పదునాల్గు వేల రాక్షస బలసంహారము స్వయంగా చూచిన ఖరుడు కొంతసేపు భయవిహ్వాలుడయ్యాడు. వెంటనే నముచి వాసవుని ఎదుర్కొన్నట్లు ఖరుడు రామునిపై విరుచుకుపడ్డాడు.

ఖర రామ బాణములతో ఆకాశము నిండిపోయింది. సూర్యుడు బాణసంఛన్నుడై ప్రకాశాన్ని కోల్పోయాడు. పగ్గాలతో ఏనుగును బాధించినట్లు ఖరుడు రాముని శరములతో బాధించాడు. ఆయన పాశహస్తుడైన యమునివలె అగుపించాడు. ఖరుని బాణాలకు రాముని కవచము తెగిపోయింది. శరసహస్రముతో రాముని బాధించి ఖరుడు సింహనాదం చేశాడు. రాముడుపొగలేని నిప్పువలె ప్రకాశిస్తూ, గంభీర నాదం చేస్తూ అగస్త్యప్రదత్తమైన వైష్ణవ ధనుస్సును గ్రహించి ఖరునికి అభిముఖుడయ్యాడు. ఖరుని రథ ధ్వజము విరిగిపోయింది. అయితే ఖరుడు రాముని నాలుగు బాణాలతో బాధించాడు.

శ్రీరాముడు ఖరుని శిరస్సును ఒక బాణంతో, బాహువులను రెండు బాణాలతో, మూడు అర్థచంద్రాకార బాణాలతో వక్షస్సును కొట్టాడు. ఆ తరువాత సూర్య తేజ సమానములైన పదమూడు బాణాలను ప్రయోగించాడు.

వాటిలో రథదండాన్ని ఒక బాణంతో, నాలుగు గుఱ్ఱాలను నాలుగుబాణాలతో, రథసారథి శిరమును ఆరవ బాణంతో త్రివేణు రథాన్ని మూడు బాణాలతో, రథాక్షాన్ని రెండు బాణాలతో, పన్నెండవ బాణముతో శరము సంధించిన ఖరధనస్సును, ఇంద్ర సమమైన పదమూడవ బాణంతో స్వయంగా ఖరునే కొట్టాడు. రాముని ఈ అద్భుత కృత్యాన్ని సురులు, ఋషులు ప్రశంసించారు.

ధనుస్సు విరిగి, రథము విరిగి, గుఱ్ఱములు, సారథి చచ్చిన ఖరుడు గదాపాణియై రామునెదిరించాడు. శ్రీరాముడు చిరునవ్వుతో ఖరునితో ఈ విధంగా అన్నాడు. "ఖరా! చతురంగ బలములున్నప్పుడు అసహ్యములైన లోకవిరుద్ధమైన పనులు చేశావు. దుష్ట సర్పమువలె జనులను చంపావు. లోభము వలన, కామము వలన తాను చేసే నీచపు పనులను తెలుసుకొననివాడు, **"కరకకాయను తిన్న బ్రాహ్మణి"** వలె నశిస్తాడు. విషాన్నము తిన్నవాడు వెంటనే మరణించినట్లు ఘోరపాపి, పాప ఫలాన్ని వెంటనే అనుభవిస్తాడు. నా బాణాలు నిన్ను నేడు పడగొట్టుతాయి. దండకారణ్యములో నీచే భక్షింపబడిన ధర్మ చారులను, పరలోకంలో నీవు నీ సైన్యంతో అనుసరిస్తావు. నీవు భయంకరంగా పోరాడు! వీలైనంత ప్రయత్నించు! తాళఫలము శిరస్సును భేదించినట్లు నిన్ను హతమారుస్తాను.

రాముని మాటలు విన్న ఖరుడు కోపంతో "సామాన్యులైన రాక్షసులను చంపి, నిన్ను నీవే ప్రశంసించుకొంటున్నావే? పరాక్రమోపేతులు గర్వంతో ఆత్మ ప్రశంస చేసి కోరు. నీ ప్రాణాలను తీయడానికి నా గదాయుధము చాలు. నీ చేత చచ్చిన పదునాలుగు వేల

రాక్షసుల కన్నీటిని తుడవడానికి ఈ గదను ప్రయోగిస్తున్నా"నని ఖరుడు గదా ప్రయోగం చేశాడు. మృత్యుపాశ సమము, జ్వలితమైన ఆగదను రాముడు మధ్యలోనే ఖండించాడు.

శ్రీరాముడు చిరునవ్వు నవ్వుతూ "రాక్షసాధమా! నీ బలాన్ని అంతా ప్రదర్శించావు కదా! నీవు శక్తిహీనుడవు. అయినా వృథాగా ప్రగల్భాలు పలుకుతావు. గరుత్మంతుడు అమృతాన్ని హరించినట్లు నీ ప్రాణాలను అపహరిస్తాను. నీవు మరణించగానే దండకారణ్యములో జనులు నిర్భయంగా సంచరిస్తారు" అని ఖరుని అధిక్షేపించాడు.

ఖరుడు నొసలు చిట్లించి, పళ్లు కొరుకుతూ దగ్గరలో ఉన్న సాలవృక్షాన్ని పెకిలించి రామునిపై "చచ్చావు" అని అరుస్తూ ప్రయోగించాడు. శ్రీరాముడు దానిని మధ్యలోనే ఖండించాడు. రక్త నయనములతో రామభద్రుడు బాణ సహస్రమును ఖరునిపై ప్రయోగించాడు. ఖరుడు రక్తము కక్కుతూనే, రామునిపై పరుగెత్తాడు. అగ్నివలె ప్రకాశించే, బ్రహ్మ దండమువంటి ఇంద్రదత్తమైన శరమును రాముడు ఖరునిపై ప్రయోగించాడు. పిడుగువంటి ఆ బాణము పడగానే "శ్వేతారణ్యములో రుద్రుని వలన దగ్ధమైన యమునివలె" "వజ్రము వలన వృత్తుని వలె," "నురుగువలన నముచివలె," "పిడుగు వలన బలుని వలె" ఖరుడు హతమయ్యాడు.

అప్పుడు రాజర్షులు పరమర్షులందరు చేరి శ్రీరామునితో "ఆనాడు దేవేంద్రుడు శరభంగాశ్రమమునకు వచ్చింది ఈ పని కొరకే. మహర్షులు మిమ్మల్ని ఉపాయంతో రప్పించింది ఇందుకే. ఇక దండకారణ్యము రాక్షస నిర్ముక్తమైంది. ఋషులు యధేచ్ఛగా సంచరిస్తారు. మూడు గడియలలోనే ఖరుడు, ససైన్యంగా చతుర్దశ సహస్ర రాక్షస బలాలతో నశించాడు. ఎంత ఆశ్చర్యము!" అని ఋషులు బహువిధాల ప్రశంసించి యథా స్థానాలకు వెళ్లి పోయారు.

**"తందృష్ట్వా శత్రుహంతారం, మహర్షీణాం సుఖావహం ।**
**బభూవ హృష్టావైదేహీ । భర్తారం పరిషస్వజే"**

లక్ష్మణుడు సీతతో కలిసి గిరిగుహ నుండి ఆశ్రమంలోకి వచ్చాడు. శ్రీరామునికే ప్రమాదము జరుగనందుకు సీతాదేవి చాల సంతోషించింది. రాక్షస సంహారుని, మునిజన సేవితుని మాటిమాటికి అన్ని వైపుల నుండి కౌగిలించుకొని చంద్రముఖి అయిన సీతాదేవి మిగుల ఆనందించింది. అప్పుడామెకు అరణ్య ప్రస్థానానికి ముందు రాముని గురించి తాను అన్న మాటలు ఆమె మనస్సులో మెదిలి ఉండవచ్చు. అప్పుడామె అధిక్షేపాన్ని మౌనంగా సహించి దానికి సమాధానంగా ఇప్పుడు తన అసహాయ శూరత్వాన్ని సకల సురముని జనసమక్షములో ప్రదర్శించిన స్వామి వీర స్వరూపము ఆమెకు నయనానందకరముగా ప్రకాశించింది. ఆ వీర రూపాన్ని ఆమె కనులు వదల లేదు, అలాగే ఆమె

చూస్తూ ఉండిపోయింది. స్వామి దివ్యమంగళ విగ్రహాన్ని తనివి తీర స్పర్శించింది. బిగ్గరగా కౌగిలించింది. ఒక్కసారితో వదలలేదు. స్వామిని తన బాహువులలో బంధించి అలాగే ఉండిపోయింది.

× × ×

జనస్థానము అనగా మనము జన్మించు స్థానమైన ప్రకృతి మండలము. ఇందులో పదునాల్గు వేల రాక్షసులున్నారు. వారందరు క్రూరులు. క్రూరములైన దశేంద్రియాలు, మనస్సు, చిత్తము, బుద్ధి, అహంకారము, అను పదునాలుగు తత్వములే పదునాల్గు వేల రాక్షసులకు ప్రతీకలు.

ఖరుడు పదునాలుగు వేల రాక్షసులకు నాయకుడు. "ఖ" అంటే ఇంద్రియఘులు "ర" అంటే అగ్ని. అగ్నివలె రగిలే ఇంద్రియ ప్రవృత్తులు గలవాడు. పదునాలుగు తత్వాలకు నాయకుడు.

ఆయనకు దూషణ, త్రిశిరులు ఇద్దరు అనుచరులు. వారు ఇద్దరు రజస్తమోగుణాలకు ప్రతినిధులు.

దుర్మార్గులకు మొదటి లక్షణము దూషణము. దూషణము దోష సముదాయమువలన కలుగును. దూషణము సౌజన్యానికి ప్రథమ శత్రువు. అందువలననే దూషణుడు శ్రీరాముని ముందుగా ఎదుర్కొన్నాడు.

త్రిశిరుడు ఆధిభౌతిక, ఆధ్యాత్మిక, అధి దైవిక తాపములకు ప్రతీక. ఈ మూడు రకముల బాధలు మననెప్పుడు ఏదో విధంగా పీడిస్తునే ఉంటాయి. త్రిశిరుడు మానవ రూపంలో ఉన్న భగవదవతార స్వరూపుడైన శ్రీరాముని కూడ మిక్కిలి బాధించాడు.

అయితే మూడు తాపాలను కూడ పోగొట్టేవాడు పరమాత్మే. అందువలన త్రిశిరుడు శ్రీరామునితో భయంకరముగా పోరాడి చివరకు అతని చేతిలో నిహతుడయ్యాడు.

దూషణ, త్రిశిర రూపములైన దోష సముదాయము, త్రివిధ తాపములు తొలిగినా అగ్నిలాగే రగిలిపోయే ఖరుని దుష్టేంద్రియ సహజ ప్రవృత్తి అంతిమంగా పోరాటానికి దిగింది. ధర్మాధర్మముల సంఘర్షణ చాల భయంకరమైనది. అప్పుడప్పుడు అధర్మమే విజృంభిస్తుంది. అధర్మ విజృంభణము వలన జ్ఞాన సూర్యప్రకాశము ఆవరింప బడుతుంది. అప్పుడప్పుడు ఖర విజృంభణము అలాగే కనబడింది.

అయితే ఖరుడెన్ని ఆయుధాలు ధరించినా, ఎన్ని విధాల ప్రయత్నించినా పరమాత్మ అయిన జ్ఞానస్వరూపమైన శ్రీరాముని చేత ఖర వధ తప్పక జరిగి తీరింది.

ఇతిశం

# తందృష్ట్వా శత్రుహంతారం

**తం దృష్ట్వా శత్రుహంతారం । మహర్షీణాం సుఖావహం**
**బభూవ హృష్టా వైదేహీ । భర్తారం పరిషస్వజే**

**తం:**

(1) "స్త్రియం పురుష విగ్రహం" అనవలసినట్లు నిన్ను రాక్షస భూయిష్ఠమైన అరణ్యానికి తీసికపోవడానికి మనస్సు రావడం లేదన్న వానిని,

(2) "స్త్రియం పురుష విగ్రహం" అని పిరాట్టి అనడాన్ని సహింపక అప్పటి నుండి ఆగ్రహము కలిగి పదునాల్గువేల రాక్షసుల తలలు మొండాలు వేరగునట్లు నరికి వాటిని రక్తపు మడుగులో ముంచి సీతాదేవి చేతిని పట్టుకొని వెళ్లి చూపిన వానిని,

(3) పడుకగదిలో పూవు విచ్చుకొన్నట్లు శరీర మెరుపెక్కునట్లు సౌకుమార్యాతిశయము గలవానిని,

(4) అభిమానముతో సమీపించి సందర్శిస్తే ఆనందకరమైన తేజస్సుకు స్థానమైన తిరుమేని గలవానిని,

(5) ఋషులకిచ్చిన అభయ ప్రతిజ్ఞను సముద్రఘోష వలె వ్యర్థము కాకుండా నెరవేర్చిన పూర్ణుని,

(6) రత్నములు పొదిగిన బంగారు నగవలె శత్రు శరసమూహముల చేత వ్రణములు కలిగిన దివ్యమంగళ విగ్రహుని

**దృష్ట్వా**

(1) నల్ల కలువ పూలమాలను పన్నీరులో ముంచి ధరించిన వారివలె యుద్ధాయాసముతో అలసిన అతని శరీరాన్ని తన వాలు చూపనే పన్నీరులో ముంచి సంపూర్ణముగా కటాక్షించి

(2) ఎండ దెబ్బ తగిలిన వానికి చల్లని చెరువు వలె రాక్షస బాణాఘాతములకు గురి అయిన అతని శరీరాన్ని తన క్రీగంటి చూపనే పూర్ణతటాకములో ముంచి ఎత్తి.

**శత్రుహంతారం**

ప్రతిపక్ష వినాశమువలన కాంతి గలవానిని : "సమోzహం సర్వభూతేషు" అని పలికిన భగవంతునికి శత్రువులు ఉంటారా? అంటే ఆయన "జ్ఞానీత్వాత్మైవ" అని తనకు ఆత్మలని చెప్పుకొన్న జ్ఞానులకు శత్రువులే తన శత్రువులు.

శ్రీ కృష్ణావతారములో పాండవులను "మమప్రాణాహి" అని తన ప్రాణములే అని వారి శత్రువులైన (మీరే) కౌరవులే తన శత్రువులని ప్రకటించాడు కదా.

**మహర్షీణాం సుఖావహం**

(1) యుద్ధారంభం నుండి ఏమవుతుందో ఏమో అని కడుపులు పిసుక్కొని దుఃఖితులయ్యే మహర్షుల భయము పోవునట్లు శత్రువులను సమూలంగా సంహరించి, ఆ ఋషులకు ఆనందము కలిగించిన వానిని.

(2) తాము పోషించవలసిన (పోష్య) ఋషుల కుటుంబానికి సుఖము కలిగించి తన ఉనికిని నిలపెట్టుకొన్న వానిని.

**బభూవ:** మాలవలె, పరిమళము వలె అత్యంత సుకుమార దేహుడైన పెరుమాళ్ళు కఠిన దేహ స్వభావులైన క్రూరరాక్షసులతో యుద్ధ మారంభించినప్పటి నుండి సత్తను కోల్పోయిన పిరాట్టి - స్వామి తిరుమేనులో ఒక్క అనర్థము లేకుండా ఉండుటను చూచి తిరిగి సత్తను పొందింది.

**హృష్టా:** ధర్మి ఉంటే ధర్మము తిరిగి వస్తుంది కదా ; రామ సౌందర్యమును సంపూర్ణంగా సందర్శించగానే ఆమె మనస్సు స్వాధీనములోనికి వచ్చినది.

**వైదేహీ**

(1) తండ్రిగారి బిడ్డగా పుట్టకుంటే ఈ పేరు వచ్చేది కాదు కదా.

(2) ఈ వంశంలో జన్మించకపోతే నన్ను పెరుమాళ్లు పాణిగ్రహణం చేసేవారు కాదు కదా.

(3) ఇక్కడ పుట్టకపోతే శివ ధనుస్సుతో సంబంధముండేదే కాదు. శివధనుస్సుతో సంబంధము లేకపోతే వీర్యశుల్కగా తాను ఉండేది కాదు.

(4) ధనుర్భంగము మాత్రాననే నన్ను, తమ వంశాన్ని పెరుమాళ్లకు దాసభూతము లుగా చేసిన మా తండ్రి ఈ వీర స్వరూపాన్ని చూస్తే ఏమనుకొంటారో?

(5) "పుంసాంధృష్టి చిత్తాపహారిణం" అన్నట్లు సర్వలోక సమ్మోహనకరమైన స్వామి ఈ స్వరూపాన్ని నాన్నగారు లేకుండా నేనొక్కదానినే చూస్తున్నాను గదా అని తండ్రిగారిని జ్ఞాపకం చేసికొంటున్నది.

**భర్తారం:** పాణిగ్రహణ సమయమునుండి "భర్త" అనే భావము పొంది ఉంది. అయితే ఇప్పుడే తనను భరించడము (రక్షించడము) అనే ధాత్వర్థము జీవించింది.

**పరిషస్వజే**

(1) పరిపూర్ణంగా కౌగిలించుకొంది.

(2) తగినంతగా ఆలింగనం చేసికొంది. గాయాలు తగ్గే వరకు కౌగిలించుకొంది.

(3) బాణాఘాతముల వలన కలిగిన గాయాలు తగ్గేవరకు తన స్తనములతో కాపడం (వేడి) పెట్టింది. తాను గ్రహించిన మందే కదా ఇది.

(4) బాణపు గాయానికి ఇది (ఆలింగనం) మందైనప్పుడు అయిదుసార్లైతేమి? అయిదు వందల సార్లు అయితేమి?

(5) మనస్సుకు కలిగిన గాయాలకే ఆలింగనం మందైనప్పుడు శరీరానికి తాకిన దెబ్బల గూర్చి చెప్పాలా?

(6) ఒక తీగకు ఆధారంగా ఒక కొమ్మ ఉండాలి కదా. అలాగా తన కాధారమైన భర్త అనే నిత్యాధారమైన కొమ్మను అంతా వ్యాపించి ఆ ఆధారాన్నే అల్లుకోవడము తప్ప తనకు వేరే స్వరూపమే లేదు కదా.

"తం" అతనిని అన్నప్పుడు పెరుమాళ్ల సర్వస్వరూపములను తెలుపుతున్నది.

"దృష్ట్వా" అనే పదం చేత పెరుమాళ్ల సర్వ రూపాలను చూడగలిగిన కన్నులుగల పిరాట్టిని తెలుపుతున్నది.

"శత్రుహంతారం - మహర్షీణాం సుఖావహం"

అనే పదాలవలన తనతో పాటు గర్భ సంబంధము గల చేతనులకు ఇష్టప్రాప్తి. అనిష్టనివృత్తి కలిగించినప్పుడు మాత్రమే ఇతనిని చూచుటకు కన్నులు గలది.

"బభూవ" అతనికి అతిశయాన్ని కల్గించడానికి సత్తను పొందినది.

"హృష్టా" ధర్మి ఉన్నప్పుడు ధర్మము తప్పక ఉంటుంది కదా.

"వైదేహీ" ఉపకార స్మృతిని కలిగి ఉంది.

"భర్తారం" తన కార్యమును నెత్తిపై వేసికొన్నారనుకొంది. తన కార్యమును నెత్తిపైనే వేసికొనుట అనగా "పితుశ్శత గుణం మాతా" అన్నట్లు పుత్రరక్ష తన కార్యము కదా!

"పరిషస్వజే" ఆశ్రిత రక్షణ వలన కలిగే సంతృప్తిని బయలు పరచుటకే ఆలింగనం కావించింది. పెరుమాళ్లకు సీతాపరిష్వంగమే ప్రయోజనము కదా!

ఇతిశం

# అకంపనుడు

జనస్థానంలో అకంపనుడు రావణ నియమితుడైన చార రాక్షసుడు. ఆయన ఖరాది రాక్షసానీక సంహారము తరువాత లంకకేగి రావణాసురునికా వార్త నెరిగించాడు.

ఆ వార్తను విన్న రావణుడు ఆగ్రహోదగ్రుడయ్యాడు. "అకంపనా! నాకు అప్రియము గావించిన అమరేంద్రుడు, కుబేరుడు, యముడు, విష్ణువు ఎవ్వరైనా సుఖంగా ఉండలేరు. నేను కాలునికి కాలుడను. అగ్నినైనా దహిస్తాను. మృత్యువుకే మరణాన్ని కలిగిస్తాను. నా తేజస్సుతో సూర్య, చంద్రాగ్నులను దహిస్తాను. గాలి యొక్క వేగాన్ని నిరోధిస్తాను" అని భీకరంగా పలికాడు.

భయంతో అకంపనుడు రావణుని నుండి అభయాన్ని పొందాడు. "దశరథ పుత్రుడైన రాముడు అమిత పరాక్రమంతో ఖర సహితంగా జనస్థానాన్ని నిర్జనం చేశాడ"ని తెలిపాడు. నాగసర్పమువలె నిట్టూర్చి రావణుడడిగాడు. "ఆ రామునికి అమరులందరితో కూడిన వాసవుడు సహాయంగా వచ్చాడా?"

"రాక్షసేశ్వరా! సోదర లక్ష్మణ సహితుడైన వాడు శ్రీరాముడు" ఆయన వేసిన బాణాలు అయిదు తలల నాగుబాములై సర్వ రాక్షసులను సంహరించాయి. రాక్షసులెక్కడెక్కడికి భయంతో పారిపోయారో, అక్కడ ధనుర్ధరుడైన శ్రీరాముడు వారందరిని సంహరించాడు" అని అకంపనుడు నివేదించినాడు.

వెంటనే రావణుడు జనస్థానానికి వెళ్లి లక్ష్మణ సహితుడైన రాముని వధిస్తానని తన నిర్ణయాన్ని తెలిపాడు. అది అసాధ్యమని తెలిపి, అకంపనుడు సీతను అపహరించుమని, ఆమె విరహంతో రాముడు జీవితాన్ని వదలగలడని తన అభిప్రాయాన్ని నివేదించాడు.

రావణునికి ఆ అభిప్రాయము ఆమోదయోగ్యమనిపించి సహాయార్థము మారీచుని సమీపించాడు.

మారీచుడు రావణాసురునికి ఆసనోదకాలను, భక్ష్య భోజ్యాదులను సమర్పించి ఆయన కుశలాన్ని అడిగాడు. "రామబాణాలకు జనస్థానము నిర్జనమైందని, తాను ఆయన ప్రాణపత్నిని అపహరించదలచానని" తెలిపాడు రావణుడు. మారీచుడు రావణుని నివారించి, ఆ విధంగా అతనికి సలహానిచ్చిన వాడు మిత్రరూప శత్రువని తెలిపాడు. "ఆశీ విషసర్పము యొక్క కోరలను పెకిలించవద్దని, నిద్రించిన నిశిత దంష్ట్రలుగల

రాక్షస మృగ సంహారుడైన నృసింహుని నిద్రలేపవద్దని" ప్రబోధించి లంకకు అతనిని తిరిగి పంపాడు.

అకంపనుడు అనగా "అ" కారార్థమైన భగవంతుని బలానికి కంపితుడు (భయపడే వాడు). భగవద్భయము ఉండడము తప్పుకాదు. తన పాపరాశిని తలచుకొని భగవంతుడెట్టి శిక్షను విధిస్తాడో అని భయపడడం దోషం కాదు. అది కూడ ఒకరకమైన సాత్విక లక్షణమే.

అయితే అకంపనుడు అట్టి సాత్వికుడు కాదు. ఆయన కేవల తామస స్వభావి. భగవంతుడైన శ్రీరాముడు అతనికి శత్రువు. భయంకరుడైన శత్రువు. రాముని ఏకైక వీరత్వాన్ని స్వయంగా కనులారా చూచాడు. తాము అందరు రాక్షసులు కలిసి కూడ రాముని ఎదుర్కోజాలమని ఆయనకు తెలుసు. అందువలన రాముని నిగ్రహిస్తానన్న రావణుని నివారించాడు.

ప్రకృతి పరమాత్మ వశంలో ఉన్నంతవరకు అహంకారము ఏమి చేయలేదు. ఆ రెండింటిని వేరు చేయగలిగినప్పుడే అహంకారము బలవంతమవుతుంది. పరమాత్మ నుండి ప్రకృతిని దూరము చేయడం వలన ప్రకృతిని అహంకారము ఆక్రమింపగల్గుతుంది. పరమాత్మ బలహీనమైనట్లు కనపడుతాడు.

ప్రకృతి (సీత) పరమాత్మ (రాముడు) కలసి ఉన్నప్పుడు రాముని బలాన్ని స్వయంగా వీక్షించిన అకంపనుడు సహజ బలస్వరూపుడైన (పరమాత్మను) శ్రీరాముని, అహంకార స్వరూపుడైన రావణుడు ఎదుర్కోజాలడని, ప్రకృతి స్వరూపిణి అయిన సీతాదేవిని అతని నుండి అపహరించడము ద్వారానే రాముని బలహీనుడిని చేయవచ్చునని రావణునికి సూచించాడు.

అకంపనుడు అంటే "అ" అర్థమైన భగవంతుని నుండి కంపనుడు అంటే కదిలించే వాడు లేక వేరు చేసేవాడు అని అర్థము. శ్రీరాముని నుండి సీతాదేవిని కదిలించి వేసేవాడు అకంపనుడు. అందువలనే ప్రకృతి స్వరూపురాలైన సీతాదేవిని పరమాత్మ స్వరూపుడైన శ్రీరాముని నుండి అపహరించుమని అహంకార స్వరూపుడైన రావణునికి ప్రబోధించాడు.

ఇతిశం

# శూర్పణఖ ప్రబోధము

ఖరదూషణ త్రిశిర సమేతమైన చతుర్దశ సహస్ర రాక్షస బలము ఒక్క రాముని చేతిలో హతము కావడాన్ని చూచిన శూర్పణఖ భయంతో మేఘనాదము కావించింది. ఆమె వెంటనే లంకకు పరుగు తీసింది.

లంకలో మరుత్తులతో కూడిన ఇంద్రునివలె సింహాసనాసీనుడైన రావణుని చూచింది.

రావణుడు దేవాసుర సంగ్రామంలో వజ్రపాతాన్ని ఎదుర్కొన్నాడు. ఐరావత దంష్ట్రల తాకిడిని సహించాడు. విష్ణుచక్ర బాధలను భరించాడు. సముద్రాలను క్షోభింప జేశాడు. పర్వతాలను పెకిలించాడు. దేవతలను, అనేక పరదారలను ఆక్రమించాడు. వాసుకిని పరాజితుని కావించాడు. తక్షకుని ఓడించి అతని ప్రియ భార్యను అపహరించాడు. కైలాస పర్వతాన్ని సమీపించి కుబేరుని విజితుని గావించి పుష్పకవిమానాన్ని హరించాడు. పదివేల సంవత్సరాలు తపమాచరించి, తన తలలను బ్రహ్మదేవునికి ఆహుతిచ్చాడు.

శత్రుహంత అయిన రావణుని సమీపించి ఈ విధంగా ఆమె పరుషంగా మాట్లాడింది:

"రావణా! కామభోగమోహితుడివై, ప్రమత్తుడివై నీకు కలిగిన భయంకర ప్రమాదాన్ని గుర్తించడం లేదు. ఇంద్రియ సుఖ వివశుడైన మహారాజును శ్మశానాగ్నివలె ప్రజలు నిరాదరిస్తారు. ఏ రాజు సకాలంలో కార్యాలను ఆచరింపడో ఆయన ఆ పనుల వలన రాజ్యంతో సహ నశిస్తాడు. ఎవ్వరు రాజ్యాన్ని, ప్రజలను రక్షింపరో వారు సాగర గత గిరులవలె ప్రకాశింపరు.

ఎవ్వరి చారులు, కోశాగారము, నీతి స్వవశంలో ఉండవో అట్టి రాజులు ప్రాకృత జనులతో సమానులే. నీవు అయుక్త చారుడవు, మంత్రులతో వృథా మంతనాలను కొనసాగించే నీవు జనస్థానములో జరిగిన మహోపద్రవాన్ని గుర్తించడం లేదు. ఒక్కడే రాముడు ఖరదూషణ త్రిశిరులతో కూడిన పదునాలుగు వేల సైన్యాన్ని భస్మం చేశాడు.

కనులతో నిద్రిస్తున్నా చారచక్షువులతో జాగ్రత్తగా నున్నవాడు, అవసరమైనప్పుడు క్రోధ ప్రసాదాలను ప్రయోగించేవాడు చిరకాలము అధికారములో ఉండి ఆరాధింప బడుతాడు. నీలో ఈ గుణాలు లేశము కూడ లేవు. విషయ సుఖవ్యామోహితుడవు, దేశకాల పాత్రలను గుర్తించలేని వాడివి. గుణ దోష గ్రహణము లేనివాడివి త్వరలో నశిస్తావు".

శూర్పణఖ మాటలు విన్న రావణుడు ఆగ్రహావిష్టుడై ఆమెనీవిధంగా ప్రశ్నించాడు:- "ఎవ్వడా రాముడు? ఆయన పరాక్రమమెట్టిది? ఆయన రూపమెటువంటిది? శత్రుభయం కరమైన దండకారణ్యము లోనికి ఎందుకు ప్రవేశించాడు? ఆయన ఏ ఆయుధాలతో ఖర, దూషణాదుల హత్య కావించాడు?

శూర్పణఖ రాముని యదార్థ స్వరూపాన్ని వివరించింది. "శ్రీరాముడు దశరథ తనయుడు. నారచీరలను, జింక చర్మాన్ని ధరించాడు. ఇంద్రధనుస్సు వంటి కనక భూషితమైన కోదండాన్ని గ్రహించి మహా విషసర్పాల వంటి బాణాలను ప్రయోగించాడు. ఆయన బాణాలనెప్పుడు సంధిస్తాడో, ఎప్పుడు ప్రయోగిస్తాడో ఎవ్వరు గ్రహింపజాలరు. మూడు గడియలలోపు సమయంలో ఖరదూషణ సహితమైన పదునాలుగు వేల రాక్షస సైన్యము సమరంలో పదాతి అయిన ఒక్క రాముని చేతిలో నిహతమైనది. స్త్రీ వధ శ్రేయస్కరము కాదని నన్నొక్క దానిని వదిలిపెట్టాడు. ఆయన సోదరుడు తేజోగుణాలలో సమానుడు. అన్నగారికి విధేయుడు, ప్రియుడు, రామునికి బహిఃప్రాణము, కుడిచేయి.

శ్రీరామపత్ని సంపూర్ణ చంద్రవదన. సౌందర్య విభాసిత. భర్తృప్రియ. అపరశ్రీ. ఎవ్వరి భార్య సీతో, ఎవ్వరిని ఆమె ఆలింగనం చేసికొంటుందో - ఆయన సర్వలోకాలలో దేవేంద్రుని కంటె శ్రేష్ఠుడు. అంతటి సుందరిని నీ స్వంతం చేయాలని నేను ప్రయత్నించి విఫలురాలనై, విరూపితనైనాను.

ఆమెను నీవు చూస్తే మన్మథ బాణపీడితుడవు తప్పక అవుతావు. ఖర దూషణ వధను గుర్తుంచుకొని రామలక్ష్మణులను వధించి సీతను స్వాధీనము చేసికొని అమరసుఖాలను అనుభవించు.

శూర్పణఖ వాక్యాలను విని బలాబలాలను విమర్శించుకొని, కార్యాకార్యములను నిశ్చయించుకొని - కాంచనరథముపై బయలుదేరాడు. నదీనదపతిని చేరుకొన్నాడు. సముద్ర తీరప్రాంతాన్ని సందర్శించాడు. అక్కడ మేఘ సదృశమైన మఱ్ఱిచెట్టును చూచాడు. దాని శాఖలు వందల యోజనాల దాకా వ్యాపించాయి. వాటిలో ఒక శాఖపై పూర్వం మహాబలుడైన గరుడుడు మహా గజకచ్ఛపాలను భక్షించాడు. మరొక శాఖనుండి అనేక మహా మునులను విముక్తులను కావించాడు.

గజకచ్ఛప భక్షకుడైన గరుడుడు మహా బలసమేతుడై అమృతాన్ని తీసిక రావడానికై బయలుదేరాడు. ఇంద్రుని భవనంలో ప్రవేశించి, ఇనుపచువ్వలను విరిచి, అమృతాన్ని హరించాడు.

అట్టి "సుభద్ర" నామాంకితమై, మహర్షి గణ సమేతమైన మఱ్ఱి చెట్టును రావణాసురుడు దర్శించాడు. సముద్రము యొక్క అంతిమ తీర భాగంలో ఏకాంత వన ప్రాంతంలో, నారచీరలను ధరించి, నియతాహారుడైన మారీచుని ఆశ్రమాన్ని దర్శించాడు.

మారీచుడు రాక్షసేశ్వరునికి ఉచితాసన భోజన పానీయాలను కల్పించి, ఆయనను ఈ విధంగా ప్రశ్నించాడు:- "మహారాజా! మీకు కుశలమే కదా! ఇంతకు ముందే ఇక్కడికి వచ్చి వెళ్లారు. ఇంతలోనే మీరు మళ్లీ రావడంలో విశేషమేమిటి?

శూర్పణఖ స్వసౌందర్య స్వాభిమాన. శ్రీరామ సౌందర్య కామపీడిత. రామసౌందర్యము ఆమె స్వాంతంలో ముద్రితమైనది. లక్ష్మణ రూప సంపద కూడ ఆమెను స్వాధీన పరచు కొంది. అంతేకాని ఆమె ఎప్పుడు సీతాదేవిని రావణుని కొరకు ప్రయత్నించ దలచలేదు. అయితే ఆమె కోరిక ఫలించలేదు. ఖరదూషణాది చతుర్దశ సహస్ర రాక్షస బలము ఆమెకు సహాయపడలేదు. రాముని చేతిలో మొత్తము సైన్యము నశించి పోయింది.

ఇక శూర్పణఖకు రావణుడే దిక్కయ్యాడు. అతనికి అప్రియమైన రాక్షస సైన్య వినాశ వార్తను తెలిపింది. రావణునికి ఆగ్రహము కలిగింది. అయితే "ఖరదూషణాది రాక్షసులు రామునిపైకి కదనానికి కాలు ఎందుకు దువ్వారు?" అని ప్రశ్నిస్తే తన గతేమి కావాలి? తన కామమే దీనికంతటికి కారణమని తెలిపితే రావణుడు ఊరుకొంటాడా? తననే శిక్షింపడా?

శూర్పణఖ తన ఎత్తును మార్చింది. తాను రామునిపై కామంతో వెళ్లినట్లు కాక, సీతాదేవిని రావణాసురుని కొరకు ప్రయత్నించడానికి వెళ్లానని తెలిపింది. ఆ ప్రయత్నంలోనే రాక్షస సైన్యమంతా నశించిందని తెలిపింది.

శూర్పణఖ వలె, రావణుడు కూడ కామపిపాసి. ప్రతి సుందర స్త్రీ తన స్వంతం కావాలని కోరుకొంటాడు. శూర్పణఖ వివరణను బట్టి సీతా సౌందర్యము రావణుని మనస్సు నిండా వ్యాపించింది. ఎలాగైనా ఆమెను దక్కించుకోవాలనుకొన్నాడు. తన సైన్య వినాశనము ఆయనను క్రోధపరవశుని కావించింది. అందువలన రామపరాజయము సీతాపహరణములను సాధించాలని కామక్రోధ వశుడై పట్టుదలతో మారీచ సహాయము ఆపేక్షించాడు. మఱ్ఱిచెట్టును రావణాసురుడు దర్శించాడు. సముద్రము యొక్క అంతిమ తీరభాగంలో, ఏకాంత వనప్రాంతంలో, నారచీరలను ధరించి నియతాహారుడైన మారీచుని ఆశ్రమాన్ని దర్శించాడు. మారీచుడు రాక్షసేశ్వరునికి ఆసనభోజనాదకాలను సమర్పించి ఈ విధంగా ప్రశ్నించాడు. "మహారాజా! మీకు కుశలమా? ఇంతకుముందే ఇక్కడికి వచ్చివెళ్లారు మీరు. ఇంతలోనే మళ్లీ వచ్చారు విశేషమేమిటి?

ఇతిశం

# మారీచ రావణ సంవాదము

ఆర్తుడైన రావణాసురుడు మారీచునితో, "మిత్రమా! ఆపదలోనున్న నాకు నీవే గతివి. జనస్థాన సంరక్షణ కొరకు నియమితులైన ఖరదూషణ, త్రిశిర మహావీరులు, వారితో పాటు పదునాల్గువేల మహాసైన్యము అకారణంగా రామునిచే హత్య కావింపబడింది. అబల అయిన మా చెల్లెలు అన్యాయంగా అవమానింపబడింది.

రాముడు ఒక పదాతి. ఒక మానవమాత్రుడు. క్షణజీవి. కోపిష్టి అయిన తండ్రి వలన దేశ బహిష్కృతుడై భార్య, సోదర సమేతంగా అడవులపాలయ్యాడు.

నా కొరకు సీతాదేవిని తీసుక రావాలని ప్రయత్నించిన నా సోదరి, శూర్పణఖ అవమానిత అయింది. అందుకు ప్రతీకారంగా అప్సరసవంటి సీతాదేవిని అపహరిస్తాను.

రామలక్ష్మణులు అమరుల సహాయంతో అడ్డగించిన వారిని లక్ష్య పెట్టను. అయితే నా ఈ కార్యంలో నీ సహాయాన్ని అర్థిస్తున్నాను.

నీవు సమర్థుడవు, వీరుడవు, ఉపాయజ్ఞుడవు, సర్వమాయా విశారదుడవు. నీవు వెండి బిందువులతో కూడిన బంగారు లేడివై రాముని ఆశ్రమము ముందు, సీత ముందు విహరించు. నిన్ను నిజంగానే బంగారు లేడివని భ్రమించి సీత – శ్రీరామలక్ష్మణులను నిన్ను తీసికొని రావడానికి పంపుతుంది. అప్పుడు నేను ఆమెను నిరపాయంగా రాహువు చంద్రప్రభను అపహరించినట్లుగా హరిస్తాను".

మారీచుడు శ్రీరామ వృత్తాంతాన్ని విని భయగ్రస్తుడయ్యాడు. ఆయన నోరెండి పోయింది. పెదవులను నాలుకతో తడుపుకొంటూ, రెప్పపాటు లేకుండా గుడ్లు అప్పగించి రావణుని చూచాడు. చేతులుజోడించి రావణునికి హితోపదేశం చేయసాగాడు.

"మహారాజా! లోకంలో ప్రియవాదులు అనేకులు ఉంటారు. కాని హితవాదులు తక్కువ. అందులోను ఆ హితము అప్రియమైతే దానిని చెప్పేవారు, దానిని వినేవారు (శ్రోత) దొరుకరు.

శ్రీరాముడు మహావీరుడు. మహేంద్ర, వరుణ సదృశుడు. ఆయన ఆగ్రహిస్తే లోకమే అరాక్షసమవుతుంది. నీవు మరణించినా నీకు సీత లభించదు. నాకు అనవసరంగా అపాయాన్ని కల్గించకు. నీ మూలంగా లంకా నగరము సమూలంగా నశిస్తుంది. నీవంటి నిరంకుశుడు, కామవృత్తుడైన రాజు తనను, తన జనాన్ని, తన దేశాన్ని నశింపజేసి కొంటాడు.

నీవు అన్నట్లుగా రాముడు మర్యాదలేనివాడు కాదు. పాపాత్ముడు కాదు. ఆయన తండ్రి చేత దేశబహిష్కృతుడు కాలేదు. కైకేయిచే వంచింపబడిన తన తండ్రిని "సత్యవాక్య పాలకుని" చేయదలచి తాను స్వయంగా రాజభోగాలను విడచి అడవులకు బయలు దేరాడు.

రాముడు ధర్మస్వరూపుడు. సత్యపరాక్రముడు. దేవేంద్రునివలె సర్వలోకపాలకుడు. సూర్యుని నుండి ప్రకాశాన్ని వేరు చేయగల్గుతావా? అలాగే శ్రీరామ సంరక్షిత అయిన సీతాదేవిని అపహరింప గల్గుతావా?

రాముని బాణాలు అగ్నిజ్వాలలు. ఆయన చాప ఖడ్గాలు ఇంధనాలు. శ్రీరాముడే మండుతుండే అగ్నిహోత్రుడు. ఆయనను నీవెలా సహించగల్గుతావు? జనకాత్మజ అయిన సీత రాముని అప్రమేయమైన తేజస్సు. రామచాపాశ్రయ అయిన సీతను అపహరించ జాలవు. సింహవక్షుడు అయిన శ్రీరామునికి సీతాదేవి ప్రాణప్రియ. అతనినే ఎల్లప్పుడు అనుసరిస్తుంటుంది. నీ ఈ ప్రయత్నాన్ని విరమించుకో. అప్పుడే నీవు భార్యా పిల్లలతో అనుజులతో, అమాత్యులతో, ప్రజలతో సుఖంగా ఉండగల్గుతావు. విభీషణ ప్రముఖులైన సర్వసచివులతో నీ బలాన్ని, రామబలాన్ని కూడ నిశ్చయించుకొని ఒక నిర్ణయాన్ని తీసికో.

నాకు తెలిసిన రామబలాన్ని నీకు తెలుపుతాను. నేను నల్లని మబ్బు వంటి రంగుతో, ఎఱ్ఱని కుండలాలతో, వేయి ఏనుగుల బలాన్ని కలిగి, ఋషులను చంపుతూ వారి మాంసాన్ని తినేవాడిని.

ఆ కాలంలో విశ్వామిత్ర మహర్షి తన యాగసంరక్షణ కొరకు దశరథుని దగ్గరకు వెళ్లాడు. శ్రీరాముని యజ్ఞ రక్షణకైపంపుమన్నాడు. అప్పుడు దశరథుడు "మహర్షీ! మా రాముడు పన్నెండేండ్ల బాలుడు. ఇప్పటికి అస్త్ర విద్యా సంపన్నుడు కాలేదు. అందువలన ఆయనకు బదులు నేనే చతురంగ బలాలతో కూడ వచ్చి రాక్షస సంహారము కావిస్తాను" అని పలికాడు.

అప్పుడు మహర్షి "మహారాజా! రాముడు తప్ప సర్వదేవతా సమేతుడివైనా నీవు ఆ రాక్షసులను హతమార్చలేవు. నేను రాముని తీసికొని వెళ్లుతాను. నీకు క్షేమమగు గాక!" అని పలికి రామునితో ఆశ్రమానికి వెళ్లాడు. అప్పటికి రామునికి పురుష లక్షణాలైన గడ్డము, మీసము మొలవలేదు. తామరరేకుల వంటి కనులతో, ఏకవస్త్రంతో, శిఖతో, ధనుర్ధారియై కనకమాలను ధరించాడు. ఆయన తన తేజస్సుతో దండకారణ్యాన్ని ప్రకాశింప జేస్తూ బాలచంద్రుని వలె ఉన్నాడు.

"నేను గర్వంతో, దేహబల, వరబలాలతో ఆశ్రమాన్ని సమీపించాను. బాలుడని ఆయనను ఉపేక్షించి వేదిపైకి ఉరికాను. శత్రు సంహారకుడైన శ్రీరాముడు నన్ను

శతయోజన దూరంలో, సముద్రపు రెండో వైపున తన దివ్యాస్త్రంతో పడగొట్టాడు. కొంతసేపటికి నాకు తెలివి రాగా నేను లంకకు చేరుకొన్నాను. నాకు సహాయంగా వచ్చిన సుబాహువు, తదితర రాక్షసులు సంహరింపబడ్డారు. సమస్తాస్త్ర విద్యాసంపద లేని, ద్వాదశ వర్ష ప్రాయరాముని పరాక్రమమంతటిది. ఇక ఇప్పుడు ఆయన మహా పరాక్రముడు. పూర్ణయౌవనుడు. సర్వశస్త్రాస్త్ర విద్యావిశారదుడు.

పాపాత్ముని సన్నిధిలో నున్న సత్పురుషులు కూడ, పాముల సరస్సులోని చేపలవలె నశించిపోతారు. నీకు అనేక భార్యలు ఉన్నారు. పరభార్యాహరణము మహాపాపము. ఒకవేళ నన్ను నిర్బంధించి నా సహాయంతో అవనిజాతను అపహరింపగల్గినా రామశరా ఘాతములతో సబాంధవంగా యమపురికి చేరుకొంటావు.

అంతేకాదు. ఆ తరువాత కూడ మరొకసారి ఇద్దరు రాక్షసానుచరులతో కలసి దండకారణ్యానికి వెళ్లాను. పెద్ద శరీరముతో, నిశిత దంష్ట్రలతో మాంసభక్షణ కావిస్తూ ఋషులను హింసిస్తూ, వారి రక్తాన్ని త్రాగుతూ క్రూరంగా మత్తుడనై విహరించాను. అప్పుడు సీతారామలక్ష్మణులు దండకారణ్యంలోనికి వచ్చారు. శ్రీరాముని చూచి, పూర్వ వైరాన్ని స్మరించుకొని, తాపస వేషంలో ఉన్నాడు కదా అనుకొని నిశిత శృంగాలతో మృగరూపధారినై ఆయనను సంహరించాలనుకొని పైకి ఉరికాను. నా రాక్షసానుచరు లిద్దరు కూడ ఆయన పై బడ్డారు. అప్పుడు ఆయన బాణ ప్రయోగంతో ఆ రాక్షసులిద్దరిని హతమార్చాడు. నేను ఏదో విధంగా చావకుండా మిగిలాను. అప్పటినుండి సన్యాసినై అహింసా పరాయణుడనై జీవితం గడుపుకొంటున్నాను. నాకు అడవిలో ప్రతి చెట్టులో పాశహస్తుడైన యముని వలె ధనుర్ధారి అయిన రాముడు కనబడుతున్నాడు. భయం కలిగిస్తూ వేల రాములు కనబడుతున్నారు. కలలో రాముడు కనిపిస్తే మూర్ఛిల్లు తున్నాను. 'ర' కారంతో మొదలయ్యే 'రత్నము', 'రథము' వంటి పేర్లను విన్నా భయం కల్గుతున్నది.

నాకు రాముని బలము పూర్తిగా తెలుసు. నీవు రణంలో రాముని ముందు నిలువ లేవు. బలి, నముచి మొదలైన మహా బలవంతులైన రాక్షసులను కూడ రాముడు చంపగల్గుతాడు. ఇన్ని చెప్పిన తరువాత కూడ నీవు రామునితో రణానికి సిద్ధమైతే నీ ఇష్టము. నీ వలన నేను కూడ మరణించక తప్పదు. అయినా శూర్పణఖ మూలంగా ఖరాదులు హతమైతే రాముడు చేసిన తప్పేమిటో తెలుపు".

మారీచుని హితవాక్యాలను రావణాసురుడు పట్టించుకోలేదు. "మారీచా! నీ పలుకులు చవిటినేలలో నాటిన విత్తనాల వలె నిష్ఫలాలు. నీ వాక్యాలు నన్ను భయపెట్టజాలవు. కేవలము ఒక అబల మాటను బట్టి అడవుల పాలైన రాముడు గొప్పవాడా! చతుర్దశ

సహస్ర రాక్షస బలాలను ఖర దూషణాదులతో సహా సంహరించిన రాముని ప్రాణాలు తీయడం నాకు చాల ఇష్టము. అందువలన నేను సీతాపహరణము చేయడం తప్పదు. సురాసురులు ఒక్కటైనా నన్ను మార్చలేరు. మంచి కాని చెడుకాని, నేను అడిగాను కనుక నీవు సహకరించవలసిందే. రాజులతో మాట్లాడేప్పుడు వారికి ఇష్టమైన వాటినే, చేతులుజోడించి సగౌరవంగా నివేదించాలి. రాజహితాన్నైనా వారికి అయిష్టమైతే చాల మృదువుగా ఉపచార వాక్యాలతో మనస్సు నొవ్వకుండా విజ్ఞాపనము చేయాలి.

రాజులు అగ్నివేడిని, ఇంద్రుని విక్రమాన్ని, సోముని సౌమ్యాన్ని, వరుణుని ప్రియత్వాన్ని, యముని దండాన్ని ధరించి ఉంటారు. అందువలన రాజులు ఎప్పుడు కూడ పూజ్యులే.

దుర్మార్గుడవైన నీవు రాజధర్మాన్ని మరచి, అభ్యాగతుడైన రాజు పట్ల అమర్యాదతో కఠినంగా మాట్లాడావు. అయినా నేను కార్యార్థిని కనుక నిన్ను క్షమించాను."

మళ్లీ చెప్పుతున్నాను "హిరణ్య మృగమువై సీతా దేవిని ఆకర్షించు. సీత కోరికపై రాముడు నిన్ను అనుసరిస్తాడు. ఆయనను దూరంగా తీసికవెళ్లి "హా సీతా!" "హా లక్ష్మణా!" అని రాముని స్వరంతో బిగ్గరగా అరువు. రామునికి ప్రమాదమేదో కలిగిందని శంకించి లక్ష్మణుని కూడ సీత పంపుతుంది. అప్పుడు ఇంద్రుడు లేనప్పుడు శచీదేవిని గ్రహించినట్లుగా నేను సీతాదేవిని అపహరిస్తాను. ఈ పనిని చేసి నీవు నీ ఇష్టము వచ్చిన చోటుకు వెళ్లు. ఈ సహాయం చేసినందుకు నీకు అర్ధ రాజ్యాన్ని ఇస్తాను. అందువలన వెంటనే దండకకు బయలుదేరు. నేను నీ వెంటే బంగారు రథముపై వచ్చి సీతాదేవిని వంచించి, యుద్ధము చేయకుండానే అపహరించి లంకకు చేరుకొంటాను.

ఒకవేళ నీవు నా ఆజ్ఞను పాటించకుంటే నిన్ను ఇప్పుడే హతమారుస్తాను. అందువలన నా ఆజ్ఞను పాలించడం నీకు తప్పదు. రాజు నెదిరించిన వాడికి సుఖము మిగులదు. నన్ను ఎదిరించి చస్తావో, నా మాట విని, నాకు సహాయము చేస్తావో నీ ఇష్టము".

రావణాసురుడు అంత కఠినంగా ఆజ్ఞాపించినా మారీచుడు తన ఉపదేశాన్ని మానలేదు. "రాక్షసేశ్వరా! నీ పుత్ర, మిత్రామాత్య రాష్ట్ర వినాశాన్ని ఏ పాపాత్ముడు నీకు ఉపదేశించాడు? నీవు దుర్మార్గులైన నీ మంత్రులను శిక్షించుట లేదు. అందువలననే వారు నిన్ను దుర్మార్గము నుండి మరల్చుట లేదు.

ధర్మము, విజయము రాజ పాలనలో స్థిరంగా ఉండాలి. లోకంలో చాలమంది సహజంగా ధర్మాత్ములే. అయితే దుర్జన సహవాసము వలన సపరివారంగా నశించి పోతారు. తోడేలు వలన మేకలు నశించినట్లే కఠినుడైన రాజు వలన ప్రజలు నశిస్తారు.

అనుకోకుండా నీ మూలంగా నాకు శ్రీరాముని నుండి ఆపద సంభవించవచ్చు. అయితే అంతటితో ఆగక రామాగ్రహము ససైన్యంగా నిన్ను హతమారుస్తుంది.

**రామాదపిచ మర్తవ్యం । మర్తవ్యం రావణాదపి**
**ఉభయోరపి మర్తవ్యే । వరం రామాన్న రావణాత్**

నీచేత ఇక్కడ వధింపబడుటకంటె (హరిరూపుడైన) అరి వలన హతం కావడం వలన ధన్యుడనవుతాను. నేను రాముని కంటబడగానే హతమయినట్లే భావించు. ఒకవేళ నీవనుకొన్నట్లు నీవు సీతను అపహరిస్తే నీకు సమూల వినాశనము తప్పదు. నా హితోపదేశం వినకపోతే నీకు యమపురి నివాసము తప్పదు".

× × ×

మారీచుడు మరీచిక వంటివాడు. మరీచిక అంటే ఎండమావి. వేసవికాలంలో సూర్యకిరణాలు ఇసుక కణాలపై పడినప్పుడు అవి నీటి బిందువుల వలె ప్రకాశిస్తాయి. మెరిసే ఇసుక కణాలను చూచి మృగాలు నీరు అని భ్రమించి అటువైపు పరుగెడుతాయి. కాని అక్కడ నీరు లభింపదు.

మారీచుడు కూడ స్వయంగా మరీచికల వెంట పరుగెత్తినవాడే. రాముని చూచి బాలుడనుకొని ఆయనపై బడబోయి, చివరకు రామబాణాఘాతములతో ఎలాగో చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు అదృష్టం కారణంగా బ్రతికి బయట పడినవాడు. అందువలన మారీచుని మనస్సులో రాముని భయంకరపరాక్రమము ముద్ర వేసికొన్నది.

రావణాసురుడు శ్రీరాముని కేవల మానవమాత్రునిగా, ఒక సామాన్యపదాతిగా, అల్పాయుష్కునిగా భావించి అతని వలన తనకే ప్రమాదము జరుగదని తాను సీతను అపహరిస్తానని వాదించినప్పుడు, రావణుడు మరీచిక కొరకు పరుగెడుతున్నాడని, అది ప్రాప్య లాభానికి కాక, ఆత్మ వినాశానికి కారణమవుతుందని నిర్భయంగా చాటి చెప్పిన ధీశాలి.

ఇతిశమ్

# సీతాదేవి మృగతృష్ణ

రావణాసురునికి చేయవలసినంత హితోపదేశాన్ని చేసి, అది "చవిటి నేలలో వేసిన విత్తనము" వలె వ్యర్థము కాగా ఆయన మొండితనానికి విసిగి వేసారి, తనకు రాముని వలన రాబోయే మరణాన్ని తలచుకొని దీనుడై మారీచుడు రావణుని వెంట బయలుదేరాడు.

"రావణా! శరచాప ఖడ్గదారి అయిన రాముని కంటబడగానే నాకు మరణము తప్పదు. యముని దండమునకు గురి అయిన వాడెవ్వడు జీవించి ఉండజాలనట్లే రామునెదిరించిన వాడు బ్రతుకజాలడు.

అయినా నిన్ను నేను దుర్మార్గము నుండి మరల్చ జాలకున్నాను. సరే వస్తున్నాను. రావణా! నీకు శుభమగు గాక!" అని మారీచుడు పలికి దశకంఠుని అనుసరించాడు. మహా మాయావి అయిన మారీచుడు తనను అనుసరించడానికి సిద్ధము కాగానే రావణాసురుడు హర్ష పరవశుడయ్యాడు. అప్పుడానందంతో ఆయనను కౌగిలించుకొని అన్నాడు "మారీచా! ఇప్పుడు నీవు నా మనస్సు ననుసరించి మాట్లాడావు. ఇప్పుడు నీవు పూర్వ మారీచుడవు. ఇంతవరకు నీవు మరెవ్వరివో. ఈ రత్నమయ రథాన్ని వెంటనే అధిరోహించు. నీవు సీతను ప్రలోభపరచి, నీ ఇష్టము వచ్చిన చోటకు వెళ్లు. రామలక్ష్మణ విహీనమైన ఆశ్రమము నుండి సీతను తత్క్షణమే అపహరిస్తాను".

వారిద్దరు రథముపై ఆకాశమార్గంగా పయనిస్తూ నగరాలను, వనాలను, గిరులను నదులను దాటి దండకారణ్యములో శ్రీరామాశ్రమాన్ని సమీపించారు.

రావణుని కోరిక మేరకు మారీచుడు మాయా మృగ రూపాన్ని ధరించాడు. ఇంద్రనీల మణి వంటి కొమ్ములతో, ఎఱ్ఱని కమలము వంటి ముఖముతో, నల్ల కలువల వంటి చెవులతో, కొంచెము ఎత్తైన కంఠముతో, నల్ల కలువ వంటి పెదవులతో, మల్లెపూవు వంటి వజ్రము వంటి ఉదరముతో, గుడ పుష్పమువంటి ప్రక్కలతో, పద్మకింజల్కము వంటి పృష్టముతో, వైడూర్యము వంటి డెక్కలతో, ఇంద్రచాపము వంటి తోకతో, మనోహరమైన నునుపుగల రంగుతో, శరీరముపై నానావిధ రత్నములతో ఆ మాయా మృగము ఆశ్చర్యకరంగా ఉంది. ఆ లేడితో ఆ వనమంతా సౌందర్యమయంగా ఉన్నది.

సీతాదేవిని ప్రలోభపరచడానికి మారీచ మృగము ఆమెకు దగ్గరలోని గడ్డి భూములలో విహరిస్తూ ఉంది. చిగుళ్లను మేస్తూ మెల్లమెల్లగా సంచరిస్తూ సీతాదేవి కనులలో పడుటకు ప్రయత్నించసాగింది. ఒకసారి ముందుకు మరొకసారి వెనుకకు అడుగులు వేయసాగింది.

అదే సమయంలో సీతాదేవి పూలు కోయడానికి ఆశ్రమానికి వెలుపలికి వచ్చింది. ఆశ్చర్యకరములైన కళ్లతో చాల ప్రేమతో ఆ లేడిని చూచింది. బంగారు రంగు గల సీతాదేవి బంగారులేడిని చూచి బ్రహ్మానందభరితురాలయింది.

ఆమె రామలక్ష్మణులను ఆ విస్మయాన్ని తిలకించుటకు ఆహ్వానించింది. లక్ష్మణుడు మారీచుని గుర్తించాడు. "అన్నా! అనేకులైన రాజులు మారీచుని (లేడి) మాయలో పడి హతులయ్యారు. లోకంలో ఇటువంటి రత్న విచిత్రమైన లేడి ఉండుటకు అవకాశము లేదు. అందువలన ఇది మాయే కాని నిజమైన లేడి కాదు" అని పలికాడు.

లక్ష్మణుని వారిస్తూ సీతాదేవి చిరునవ్వుతో శ్రీరాముని చూచి, "ఆర్య పుత్రా! ఈ మృగము నా మనస్సును దొంగిలిస్తూ ఉన్నది. ఇది మన ఆట కొరకు చాల బాగా ఉంటుంది. అందువలన దీనిని నాకు తెచ్చి ఇవ్వండి ఈ వనములో అనేక మృగాలు సంచరిస్తాయి. చమరీ మృగాలు సృమరాలు, లేళ్లు, ఎలుగుదొడ్లు, వానర, కిన్నరులు ఎందరు ఉన్నా, ఎన్ని ఉన్నా, ఇంత అందమైన మృగాన్ని నేనింతవరకు చూడలేదు. ఏమి రూపము! ఏమి స్వరము! దీనిని బ్రతికి ఉండగానే పట్టుకోగలిగితే, మన అరణ్య వాసానంతరము, మన అంతఃపురము మొత్తానికి ఈ హరిణము ఒక గొప్ప అలంకారము కాగలదు. ఒకవేళ పట్టుబడే ముందు ఈ మృగము మరణిస్తే, మీకు అందమైన జింక చర్మము కాగలదు. మీరు ఈ బంగారు జింక చర్మము గద్దెపై కూచోగా చూడాలని కోరికగా ఉంది. స్త్రీల కోరికలు భయంకరంగా ఉంటాయని తెలిసినా నాకు ఈ లేడిపైన ఆశ పెరిగిపోతుంది" అని తన కోరికను వెల్లడించింది.

శ్రీరాముడు కూడ ఆ మృగాన్ని చూచి ముచ్చట పడ్డాడు. లక్ష్మణుని చూచి, "సోదరా! ఈ లేడి కావాలని సీతాదేవి ముచ్చట పడుతున్నది. ఇంద్రుని నందనవనంలోకాని కుబేరుని చైత్రరథవనములో కాని ఇటువంటి లేడి కనుపించదు. ఇక భూలోకంలో ఇటువంటిది మరొకటి దుర్లభమని వేరే చెప్పాలా? దీని చర్మముపై సీతాదేవి నాతో కలసి కూచొనగలదు. అరటిఆకు, చమరీపుచ్ఛము, కంబళి ఏది కూడ ఇంత మృదు స్పర్శ నివ్వజాలదు. ఆకాశంలోని నక్షత్రాకార మృగము ఇంత రమణీయమైనది కావచ్చు. ఒకవేళ ఇది నీవు చెప్పినట్లు మారీచ మృగమే అయితే దీనిని నేను తప్పక వధించాల్సిందే. ఇంతకు పూర్వము అనేక రాజులు వేటలో దీనివలన చచ్చారు. చాలమంది వేటకాళ్లు చచ్చారు. పూర్వము వాతాపి రాక్షసుని వలన వనవాసులనేకులు మరణించినట్లు అనేకులు మారీచ హతులయ్యారు. అగస్త్యునివలన వాతాపి మృతుడైనట్లు నా చేత మారీచుడు నిహతుడు కాగలడు. అప్పుడు దీని చర్మము సీతకు ఆమె కోరినట్లు లభించగలదు. నేను దీనిని తెచ్చే వరకు నీవు సీతాదేవిని జాగ్రత్తగా కాపాడు. సమర్థుడగు జటాయువు సీతా సంరక్షణలో నీకు జతకాగలడు".

మారీచమృగము – మృగ మరీచిక వంటిది. మృగానికి మరీచికలో జలము ఉన్నట్లు ఎలా భ్రమ కలుగుతుందో అలాగే మనకు ఈ ప్రపంచములో అనేక మిథ్యాకర్షణలు, అనేక భ్రమలు కలుగుతాయి. మనము వాటివెంట ఎండమావుల వెంట బడినట్లు పరుగెడుతాము. అవి మనకు అందవు. ఒకవేళ అందినా, అవి మనము అనుకొన్నంత తృప్తిని ఇవ్వజాలవు. అంతేకాదు వాటి వెంట పరుగెత్తడంలో మనకు అనేక ప్రమాదాలు అనుకోకుండా కలుగవచ్చు.

మారీచ మృగము కూడ సీతాదేవికి మృగమరీచిక వలె ప్రలోభాన్ని కల్గించింది. దానితో అడవిలో, అంతఃపురములో కూడ ఆనందంగా విహరించవచ్చునని ఆమెకు ఆశ కలిగింది. ఒకవేళ దానిని తీసిక వచ్చే ప్రయత్నంలో అది మరణించినా దాని చర్మము కూడ రాముడు కూచోవడానికి ఒక అందమైన ఆసనమవుతుందని ఆమె ఆశపడింది. ఒకవైపు లక్ష్మణుడు హెచ్చరిస్తునే ఉన్నాడు. సువర్ణ హరిణము అత్యంత దుర్లభమని తెలిపాడు. ఇంతవరకు తమకు ఎదురైన మారీచ రాక్షసుడే మాయతో మృగరూపాన్ని ధరించాడని వివరించాడు. రాక్షసుల వలన రాగల ప్రమాదాన్ని కూడ సూచించాడు.

అయినా సీతాదేవి తన పట్టుదలను సడలించలేదు. ఆ మృగ సౌందర్యము ఆమె మనస్సులో వెఱ్ఱి వ్యామోహాన్ని కల్గించింది. దానిని ఎలాగైనా సజీవంగానైనా, నిర్జీవంగానైనా లభించి తీరవలసిందే అనే ప్రబల వాంఛ ఆమె మనస్సులో పాతుకొని పోయింది.

ఆశ్చర్యము! శ్రీరామచంద్రుని ముగ్ధమనోహర రూపాన్ని తన మనస్సులో నింపుకొని, అనుదినము అనురాగముతో, ఆరాధనతో తన స్వామిని సేవించడమే తన జీవితాశయంగా భావించిన సీతాదేవి, ఒక దుర్ముహూర్తములో తన జీవితాశయానికి తిలోదకాలనిచ్చి, ఒక క్షణికమైన నీచమైన మృగ సౌందర్యానికి ముగ్ధురాలై, అదే శాశ్వతమనుకొని, అదే ఒక మహోన్నతమైన పురుషార్థమనుకొని, అల్పము, అస్థిరమైన ఆ ఆనందం కొరకు తన స్వామినే నియోగించి, అతనికి దూరమై అత్యంత నరకానుభవం కొరకు సిద్ధపడింది. సీతాదేవి వంటి మహాసాధ్వీమణియే మృగమరీచికల వెంట పరుగెడితే, అల్పులము, అజ్ఞులమైన మనవంటి సాధారణ మనుష్యుల గురించి వేరే ఏమి చెప్పాలి?

ఇతిశం

# మారీచ వధ

తాను మారీచ మృగం వెనుక తప్పక వెళ్లవలసిందేనని బలపరిచి శ్రీరాముడు బంగారు పిడిగల ఖడ్గాన్ని ధరించి తనకు అలంకారమైన కోదండాన్ని గైకొని తూణీరాలను భుజములకు కట్టుకొన్నాడు. శ్రీరాముడు తనవెంట వస్తున్నాడని గమనించి భయంతో అక్కడ మాయమై, మరొక చోట మారీచ మృగము అగుపించింది. ఒక చోట పైకి ఎగురుతూ, ఒక చోట క్రిందికి దుముకుతూ, ఒక చోట నిలుచొని ఒక చోట పరుగెత్తుతూ, ఒక చోట మాయమవుతూ, మరొక చోట తేలుతూ, అతనికి అందినట్లు అందనట్లు ఉండి శ్రీరామచంద్రుని చాల దూరం త్రిప్పింది.

రాఘవునికి అది సాధారణ మృగం కాదని, అది తనకు అందదని తనను వంచిస్తున్నదని తెలిసింది. అప్పుడు ఆగ్రహంతో బ్రహ్మనిర్మితాస్త్రాన్ని దానిపై ప్రయోగించాడు. అది ఆ లేడి శరీరానికి తాకి దాని హృదయాన్ని పిడుగువలె పగులగొట్టింది. తాను మరణించపోతున్నానని తలచిన మారీచుడు రామ స్వరాన్ని అనుసరించి "హా సీతా!", "హా లక్ష్మణా" అని బిగ్గరగా అరచాడు. మారీచుని అరుపులు శ్రీరామునికి ఆందోళన కలిగించాయి. సీతా లక్ష్మణులు అవి తన అరుపులే అనుకొంటారేమో, వాటిని విని వారు ఏమవుతారో అని శ్రీరాముడు విచారగ్రస్తుడయ్యాడు. అతడు మారీచుని సంహరించి, అన్యమాంసాన్ని సంపాదించి తన ఆశ్రమమువైపు ఆందోళనతో వడివడిగా అడుగులు వేయసాగాడు.

ఇక ఆశ్రమంలో సీతాలక్ష్మణులు మారీచుని అరుపులు విన్నారు. సీతాదేవి అవి రామస్వరంతో వినవచ్చినందు వలన రాముని అరుపులే అనుకొంది. తక్షణమే లక్ష్మణుని తరుమ సాగింది. "లక్ష్మణా! ఆ అరుపులు విన్నావా? మీ అన్నకు ఏదో ప్రమాదం కలిగింది. ఆయన నీ సహాయం కొరకు అలా అరిచారు. నా మనస్సు మనస్సులో లేదు. నా జీవితం నిలిచేట్లు లేదు. సింహముల మధ్య వృషభమువలె మీ అన్న ఆపదలో చిక్కుకొన్నారు. వెంటనే ఆయనను రక్షించడానికి బయలుదేరు".

రాముని పరాక్రమమెరిగిన లక్ష్మణుడు సీతాదేవి త్వరపరచినా బయలు దేరలేదు. అప్పుడామె ఆగ్రహంతో "లక్ష్మణా! నీవు మిత్రరూపంలో ఉన్న శత్రువు. నీవు మీ అన్న మరణాన్నే కోరుకొంటున్నావు. మీ అన్న విషయంలో నీకు ప్రేమ ఏమాత్రం లేదు. నీ రక్షణ బాధ్యతను మరిచావు. మీ అన్నకు ప్రమాదం కలిగితే నీవు నన్ను నీ ఆధీనం చేసికోవాలని చూస్తున్నావు" అంది.

భయముతో ఆడలేడివలె బెదిరిపోతూ, కన్నీరు నిండిన కనులతో అతిదీనంగా పలుకుతున్న ఆమె పలుకులను విని, ఆమెకు ధైర్యాన్ని కల్పించాలనుకొని, “వదినా! మా అన్న అజేయుడు. మూడులోకాలలో సర్వప్రాణులలో మా అన్నకు ఎదురు నిలిచేవాడు లేడు. బలవంతులందరిలో ఆయనే అత్యధిక బలవంతుడు. ఆయనకు అరుల వలన అపాయము కలిగే అవకాశము లేదు. త్వరలోనే ఆయన క్షేమంగా తిరిగివస్తాడు.

నీవు విన్న అరుపుల స్వరం మా అన్నది కాదు. అది మహా మాయావి అయిన మారీచ రాక్షసునిది.

నిన్ను కాపాడుతూ ఇక్కడే ఉండుమని నాకు మా అన్న ఆజ్ఞనొసగాడు. అందువలననే ఆయన లేకుండా ఒంటరిగా నిన్ను వదలి వెళ్లజాలను.

ఖరవధ తరువాత రాక్షసులందరు మనతో వైరాన్ని ఏర్పరుచు కొన్నారు. అందువలన మనము జాగ్రత్తగా ఉండాలి. మా అన్న విషయములో నీవే అనుమానాన్ని పెట్టుకోకు” మని లక్ష్మణుడు బదులిచ్చాడు.

అప్పుడు సీతాదేవి మరింత ఆగ్రహపరవశురాలై “కులపాంసనా! నా రాముడికి కష్టాలు కలుగాలనే నీవు కోరుకొంటున్నావు. పాలివాండ్లకు, ముఖ్యంగా నీలాంటి పాపాత్ములకు సోదర ద్రోహ చింత కలుగడం ఆశ్చర్యకరము కాదు. నీవు నాపైన కామవాంఛతో మీ అన్నను ఒంటరిగా అనుసరించావు. లేక భరతుడైనా ఆ పని కొరకు నిన్ను వినియోగించి ఉండవచ్చు. నీ కోరిక, భరతుని కోరిక ఎన్నటికి నెరవేరదు. ఇందీవరశ్యాముడు, అరవిందాక్షుడైన నా భర్తను కాక నేను మరొక పురుషుని కన్నెత్తి కూడ చూడను. రాముడు లేకుండా నేను ఒక్క క్షణం కూడ బ్రతుక జాలను. నీ ముందే ఇప్పుడే నా ప్రాణాలను వదులుతాను” అని నిష్ఠూరంగా పలికింది.

అప్పుడు జితేంద్రియుడైన సౌమిత్రి సీతాదేవికి చేతులు జోడించి, “తల్లీ! నీకు ప్రత్యుత్తరము ఇవ్వజాలను, మైథిలీ! స్త్రీలకు నీవంటి దుష్ట స్వభావము సాధారణమే. ధర్మదూరులై, చపలులై, కఠినులై అన్నదమ్ములను, అయిన వాళ్లను వేరు చేసే వారే ఆడవాళ్లు. నీ పరుష వాక్యాలను నేను వినజాలను. నా రెండు చెవులకు అవి కాల్చిన బాణాల వలె బాధను కల్గిస్తున్నాయి. వనచరులైన సర్వసాక్షులు వింటున్నారు. ఎంత అన్యాయంగా మాట్లాడావు?

నన్ను ఇంతగా అవమానిస్తున్నావు. నీ దుష్టస్త్రీ స్వభావం వలన అన్నగారి ఆజ్ఞను కూడ కాదని, ఆయన దగ్గరకు వెళ్లిపోతున్నాను. నీకు క్షేమమగుగాక! సమగ్ర వనదేవతలు నిన్ను సంరక్షించుదురు గాక! నాకు అనేక చెడు శకునాలు కనబడుతున్నాయి. మేము ఆశ్రమంలో నిన్ను మళ్లీ చూస్తామో? లేదో?”

లక్ష్మణుని కరుకు వాక్యములను విని సీత ఏడుస్తూ "నేను గోదావరీ జలాల్లో పడి చనిపోతాను. ఉరివేసుకొంటాను. విషము త్రాగుతాను. అగ్నిలో దుముకుతాను. అంతేకాని నా రాముని తప్ప అన్యపురుషుని నా పాదంతో కూడ తాకను" అని తన చేతులతో దుఃఖముతో కడుపుపై కొట్టుకోసాగింది. సౌమిత్రి ఆమెను ఓదార్చ ప్రయత్నించాడు. ఆమె ఆయన మాటలను వినలేదు. అప్పుడామెకు అంజలి ఘటించి, ఆమెవైపే దీనంగా మాటిమాటికి తిరిగి చూస్తూ రాముని దగ్గరకు లక్ష్మణుడు బయలుదేరాడు.

× × ×

ఇందులో సీతాదేవి సాధారణ స్త్రీ స్వభావాన్ని ప్రదర్శించింది. చూపులతో మృగమరీచిక వలె మారీచ మృగము ఆమెను రాముని నుండి దూరము చేసింది. ఇప్పుడా మారీచుని అరుపులు ఆమెను లక్ష్మణుని రక్షణ నుండి దూరము చేశాయి. ఇంతకు సీతాదేవి అంత సామాన్యురాలా? "ప్రేక్షితజ్ఞాస్తు కోసలాః" చూపులను బట్టి ఎదుటి వ్యక్తిని గుర్తించ గలవారు కోసలులు. అటువంటి కోసలేశ్వరుని అర్ధాంగి సీతాదేవి.

"ఇంగితజ్ఞాస్తు మైథిలాః" ఎదుటి వ్యక్తి యొక్క మనస్సులో దాగిన మర్మాన్ని సైతము పసిగట్ట గల్గిన వారు మైథిలులు. అట్టి మిథిలేశ్వరుని పెంపకంలో ఆరితేరిన అతివ సీతాదేవి.

అంతేకాదు. శ్రీరాముని చేతినందుకొన్న నాటి నుండి లక్ష్మణుని సీతాదేవి గమనిస్తున్నది. ఏనాడైనా తమతో అమర్యాదగా ప్రవర్తించాడా? లేదే.

శ్రీరాముడు అరణ్యానికి తప్పనిసరి అయి బయలుదేరాడు. తాను ఆయన అర్ధాంగి కనుక తాను ఆయనను ఒప్పించి ఆయనను అనుసరించింది. మరి లక్ష్మణుడు ఎందుకు బయలుదేరాడు? ఆయనకు అలాంటి అవసరమేది లేదే? అయినా అన్నగారి అరణ్య ప్రస్థానము ఆయనను ఎంతగా కృంగ దీసింది? వృద్ధులైన తన తల్లిదండ్రుల గురించి ఆయన తలచలేదు. అనురాగవతి అయిన తన అర్ధాంగిని గూర్చి ఆలోచించనే లేదు. పైపెచ్చు తనను అన్నగారు వెంట రావడానికి అనుమతించకపోతే నీరు లేని చేపలా అరక్షణమైనా జీవింపజాలనన్నాడు (ముహూర్త మపి జీవావః"). చేతిలో పార, నెత్తిపై బుట్టతన సర్వస్వమనుకొన్నాడు. అడవిలో తనను, తన భర్తనుసర్వసుఖాలను అనుభవింపజేశాడు. కంటికి రెప్పవలె, కన్నతండ్రివలె తమకు అన్ని సౌకర్యాలను కల్పిస్తూ కాపాడాడు.

అంతటి త్యాగశీలునికి, జితేంద్రియునికి నిస్వార్థ సేవాపరునికి, పవిత్రశీలునికి సీతాదేవి ఇచ్చే బహుమానము ఆయనను అలా అనుమానించడమా? అంతగా

అవమానించడమా? తనను కన్నతల్లిలా నిత్యం భావించిన తన తనయుడి వంటి సౌమిత్రి తనపై నిజంగా కామవాంఛతో బయలుదేరాడా?

నిజంగా స్త్రీల స్వభావము ఎంత ఘోరమైనది? ఎంత చంచలమైంది? తనకు ఇష్టమైనప్పుడు, అవసరమైనప్పుడు అతనిని కన్నకొడుకు కంటె మిన్నగా భావించింది. ఇప్పుడు అతనిని ప్రబల శత్రువు వలె పరాభవించింది. అది ఎంత దోషము? ఎంత పాపము? ఎంత స్వార్థము?

శ్రీరాముడు భగవంతుడు. ఆయనను అడవికి బయలుదేరే ముందు "ఆడదానివా?" "స్త్రియం పురుష విగ్రహమ్" అని సీత అవమానించింది. అది ఆమె చేసిన భగవదపరాధము.

భగవంతుని అనుసరించినవారు భాగవతులు. లక్ష్మణుడు పరమభాగవతోత్తముడు. ఆయన శీలాన్ని అనుమానించడం భాగవతాపరాధము. భగవదపరాధం కంటె భాగవతాపరాధము చాల భయంకరమైనది.

సీతాదేవి తన దోషాలను లంకలో గుర్తించింది. హనుమతో "మమైవ దుష్కృతం కించిత్ మహదస్తి న సంశయః" అంటుంది. తన కొద్దోగొప్పో పాపమే తనను లంకలోనికి తీసికి వచ్చింది అని గుర్తించింది.

వ్యాఖ్యాతలు సీతాదేవి తప్పిదాలను రెండువిధాలుగా విశ్లేషించారు. (1) కొద్ది తప్పు (2) పెద్ద తప్పు. తాను భగవంతుడైన శ్రీరామచంద్రుని పరాభవించడము భగవదపరాధము. అది కొద్దితప్పు. సచ్ఛీలుడైన సౌమిత్రి శీలాన్ని అనుమానించడము భాగవతాపరాధము అనే పెద్ద తప్పు.

అయితే "రాఘవత్వేఽభవత్సీతా" అన్నట్లు శ్రీదేవి అపరావతారమైన సీతాదేవి ఇంతటి ఘోర పాపాలను ఎందుకు చేసింది? సమాధానమేమిటంటే ఆమె సాక్షాత్తు శ్రీదేవి అవతారమైనా ఇప్పుడు ఆమె ప్రవర్తించాల్సింది సాధారణ స్త్రీగానే కనుక. ఆపదలు సంభవించినప్పుడు సాధారణ స్త్రీలందరు అలాగే ప్రవర్తిస్తారు కనుక. తన పాప ఫలాన్ని కూడ ఆ తల్లి సాధారణ స్త్రీ వలెనే అనుభవించింది కూడ.

ఇతిశం

# సీతాపహరణము

లక్ష్మణుడు ఆశ్రమం నుండి బయలుదేరగానే, ఆ అవకాశము కొరకే ఎదురు చూస్తున్న రావణాసురుడు సన్యాసి రూపాన్నిధరించాడు. కాషాయవస్త్రంతో, శిఖా యజ్ఞోపవీతాలతో, ఛత్ర పాదుకలతో, చంకలో దండకమండలాలతో సూర్యచంద్ర విహీనమైన సంధ్యవలె, రామలక్ష్మణ రహితయైన సీతాదేవిని సమీపించాడు. చంద్రుడు దగ్గరలోలేని రోహిణీ నక్షత్రాన్ని అంగారకుడు ఆక్రమింప వచ్చినట్లున్న రక్తనేత్రుడైన రావణాసురుని చూచి తరువులు కదలలేదు. గాలి వీచలేదు. వేగవతి అయిన గోదావరి నది రావణం భయంతో మందగామిని అయింది.

పాపాత్ముడైన రావణుడు గడ్డితో కప్పబడిన బావివలె, కామపీడిత మనస్సుతో వేదనాదం చేస్తూ సీతాదేవిని చేరుకున్నాడు. ఆమెతో సంభాషణను సాగించాడు, "ఎవ్వరివి నీవు? నీవు భూదేవివా? శ్రీదేవివా? అప్సరవా? రతీదేవివా? నీ సౌందర్యము సర్వాంగీనమైంది. నీ రూపవయోవిలాసాలు నా మనస్సుకు పిచ్చి కల్గిస్తున్నాయి. నీ వస్త్ర, మాలాభరణాదులు నీవు గొప్పదానివని, నీ భర్త గొప్పవాడని సూచిస్తున్నాయి. నీవు ఇంతటి కీకారణ్యములో ఏకాంతంగా ఎందుకు ఉన్నావు?" ఈ విధంగా తన గూర్చి ప్రశ్నిస్తున్న రావణుని బ్రాహ్మణ సన్యాసిగా భావించి సర్వాతిథి సత్కారాలతో సీత సమ్మానించింది. "ద్విజోత్తమా! ఇదిగో పీట వేస్తున్నాను. కూచోండి. ఇదిగో సిద్ధముగా నున్న ఉత్తమ వనజాతము భుజించండి" అని వినయంగా పలికింది. దుర్మార్గుడైన రావణుడు ఆమె ఒంటరితనాన్ని గమనించి, ఆమెను అపహరించ నిశ్చయించాడు. ఆయన పాపచింతను పసిగట్టని లోకపావని ఆయనకు తన గురించి తెలుపసాగింది:-

"నేను మిథిలేశుడైన జనకుని కూతురును. సీతను. శ్రీరామపత్నిని. మా మామగారి ఇంట్లో పన్నెండు సంవత్సరాలు, మా వివాహానంతరము వసించి సర్వమానుష భోగాలను నా భర్తతో కలసి ఆనందంతో అనుభవించాను.

పదమూడవ సంవత్సరము నా భర్త అయిన శ్రీరామునికి పట్టాభిషేకం చేయాలని మా మామగారైన దశరథ సార్వభౌములు సంకల్పించారు. రాజపత్ని అయిన కైకేయి అంతకు ముందే రాజదత్తములైన రెండు వరాలతో (1) రామారణ్యవాసాన్ని (2) భరత పట్టాభిషేకాన్ని కోరుకొంది. ఒకవేళ ఆ వరాలను ఇవ్వకపోతే తాను ప్రాణత్యాగం చేసికొంటానని బెదిరించినది. మహారాజు ఆమెను మాటిమాటికి అనునయించాడు. ఆమె తన మనస్సును మార్చుకోలేదు. అందుకే మేమీ అరణ్యంలో ప్రవేశించాము.

నా భర్త ఇరువై అయిదేండ్ల యువకుడు. నా వయస్సు నా జన్మ నుండి ఇప్పటికి పద్దెనిమిది ఏండ్లు.

నా భర్త సర్వభూత హితరతుడు. కైకేయికి ఇచ్చిన వరాలను సత్యం చేయడం ద్వారా తండ్రిని సత్యపాలకుని గావించాడు. అన్యులకు అడిగినది దానం చేయడమే తప్ప తాను అన్యమేదీ ఆశించేవాడు కాదు. ఆయన మరో తల్లికొడుకైన సౌమిత్రి అన్ని భోగభాగ్యాలను వదలుకొని అన్ననే అనుసరించాడు. ఒక క్షణము మీరు ఆగండి. నా భర్త త్వరలోనే వన్యాహారాన్ని తీసికొని వస్తాడు".

సీతాదేవి సమాధానము విన్న రావణుడు తన గురించి ఉన్నదున్నట్లు తెలిపాడు. "సీతా! మూడు లోకాలు ఎవ్వరిని చూచి భయంతో వణికిపోతాయో అటువంటి భయంకరుడైన రావణాసురుడను నేను. నిన్ను చూచిన తరువాత వందలాది నా సుందరపత్నుల పట్ల నా మనస్సు రుచించడం లేదు. వారేకాక అనేకాన్య రమణీ మణులను అపహరించాను. నాకు పత్నివైతే వారందరికి యజమానురాలివి అవుతావు. అయిదు వేల మంది పరిచారికలు నిత్యం నిన్ను కొలుస్తు ఉంటారు!

రావణుని నీచోక్తులు సీతాదేవిని ఆగ్రహపరవశను కావించాయి. "రావణా! నా భర్త మహాపర్వతమువలె అప్రకంప్యుడు. మహా సముద్రమువలె అక్షోభ్యుడు. మహేంద్రునివలె వైభవోన్నతుడు. ఆ పురుష సింహుని ఆశ్రయించిన ఆడసింహాన్ని నన్ను నీచమైన నక్క వంటి నీవు ఆశిస్తున్నావా? సూర్యుని మండుటెండ వంటి నన్ను నీవు ముట్టుకోజాలవు. మరణమాసన్నమైన నీవు బంగారు వృక్షాలను చూస్తున్నావు. ఆకలితో నున్న సింహము కోరలను, భయంకరమైన ఆశీ విషపన్నగము యొక్క దంష్ట్రలను పెకిలించాలను కొంటున్నావు. పర్వతశ్రేష్ఠమైన మందరాన్ని చేతితో పడగొట్టాలను కొంటున్నావు. నీ కన్నును సూదితో పొడుచుకోవాలనుకొంటున్నావు. నిశితమైన కత్తిని నాలుకతో నాకాలను కొంటున్నావు. గుదిబండను మెడలో కట్టుకొని సముద్రాన్ని ఈదాలను కొంటున్నావు. అగ్నిని బట్టలో మూటగట్టుకోవాలను కొంటున్నావు. రాముడు ద్రాక్షారసము, నీవు విప్ప కల్లువు. అతడు బంగారము, నీవు సీసము. ఆయన గరుత్మంతుడు. నీవు నీచమైన కాకివి. ఆయన రాజహంస. నీవు నీచమైన గద్దవు. ఆయనను నీవు ఎదిరించి నిలువ జాలవు. ఒకవేళ నన్ను అపహరించినా, నన్ను అనుభవింపజాలవు. చిన్న వజ్రపు ముక్కనైనా ఈగ జీర్ణించుకోజాలదు." అని ధైర్యమును కూడగట్టుకొని ప్రత్యుత్తర మిచ్చినా సీతాదేవి రావణుని మృత్యుభయంకర స్వరూపాన్ని చూచి గాలికి అల్లల్లాడే అరటిచెట్టు వలె కంపింపసాగింది.

ఈ విధంగా సీత పలుకుతుంటే బొమ్మలు ముడిపెట్టి రావణుడు క్రూరంగా తన గురించి తెలిపాడు. "నేను కుబేరుడికి సవతి తమ్ముడను. ఒకసారి ఆయనతో ద్వంద్వ యుద్ధము జరుగగా అందులో నా భయంకర పరాక్రమానికి ఆయన దాసోహమన్నాడు. ఆయన తన నివాసాన్ని నా భయంతో వదలి హిమాలయాల్లో తలదాచుకొన్నాడు. ఆయన పుష్పకవిమానము నాకు వీర్యశుల్కంగా లభించింది.

నేనున్న చోట గాలిమెల్లగా వీస్తుంది. సూర్యుడు నునువెచ్చని కిరణాలతో ప్రకాశిస్తాడు. దేవతలు ఇంద్రునితో సహా నా విక్రమభీతులై పారిపోతారు.

సముద్రము యొక్క అవతలి తీరంలో లంకానరగము దేవేంద్ర వైభవముతో అలరారు తుంది. బంగారు వీధులతో, వైదూర్య తోరణాలతో, ప్రాకార పరీవృతమై ప్రకాశిస్తోంది. రథగజతురగపదాతి దళాలతో, మంగళ తూర్యనాదాలతో ప్రతిదినము శోభావహమై ఉంటుంది.

అంతటి వైభవోల్లాసవిలాసమైన లంకానగరంలో నీవు నాతో దినదినము దివ్యభోగాలను అనుభవింపగలవు. సమస్త రాక్షస సార్వభౌముడను, కామబాణ పీడితుడనైన నన్ను నిరాకరింపకు. పాదతాడన పరాభూతుడైన పురూరవునే తిరిగి ఆశ్రయించిన ఊర్వశివలె నీవు నన్ను నిరాకరించి విచారిస్తావు. రాముడు నా వేలుతో కూడ సమానుడు కాడు" అని విరమించాడు.

సీతాదేవి రావణునితో "దశగ్రీవా! నీవు కుబేరుని తమ్ముడవని చెప్పుకొంటున్నావే? అంతటి సకలలోక పూజ్యుని పేరు చెప్పుకొని ఇంతటి అమంగళాన్ని ఆచరించాలను కొంటున్నావే? దేవేంద్రుని నుండి శచీదేవిని వేరు చేసి బ్రతికి పోవచ్చును. కాని నన్ను రాముని నుండి వేరుచేసి, అమృతము త్రాగినా బ్రతికి ఉండజాలవు" అని ధైర్యంగా పలికింది.

సీతాదేవి నిర్భయ వాక్యమును విని, కోపముతో చేతిలో చేతిని కొట్టుకొని తన శరీరాన్ని పెంచాడు. తిరిగి సీతాదేవిని చూచి "నీవు పిచ్చిదానవు కాదు కదా! ఈ భూమండలాన్ని నాచేతితో పైకి ఎత్తగలను. సముద్రాన్ని త్రాగగలను. మృత్యువునే హతమార్చగలను. నన్నొక్కసారి కళ్ళు తెరచి చూడు"మని హుంకరించాడు. ఆయన స్వరూపము ఆ క్షణంలోనే భయంకరంగా మారింది. పది తలలతో, ధనుర్బాణాలతో, రక్తనేత్రాలతో క్షణక్షణానికి భీకరంగా మారిపోయాడు.

బుధుడు రోహిణిని ఆక్రమించినట్లు ఆమె తల వెంద్రుకలను ఎడమచేతితో పట్టుకొన్నాడు. కుడి చేతితో ఆమె ఊరువులను గ్రహించాడు. ఆయన మృత్యు సమాన

తీవ్ర రూపాన్ని చూచి వన దేవతలందరు పారిపోయారు. అంతలోనే కాంచనభూషితమైన రావణ రథము ఆయన ముందు నిలిచింది. ఆమె తొడలనెత్తి ఆమెను రథముపైకి అధిరోహింప జేశాడు. ఆమె దుఃఖంతో దీనంగా విలపించసాగింది. భయంతో వణికి పోతున్న ఆమెను బలంగా పట్టుకొని రథంతో ఆకాశానికి రావణుడు ఎగిరాడు. "హా లక్ష్మణా! రావణునిచే అపహరింపబడుతున్న నా గురించి తెలిసికోవడం లేదా? రాఘవా! అవినీతిని నీవు అరికట్టే వాడివే? ఇంతటి పాపాత్ముడైన రావణుని అడ్డుకోవడం లేదే? సస్యములు పండినట్లు కర్మఫలము కూడ పరిపక్వము కావాలేమో? రావణా! ఈ ఘోర పాపఫలాన్ని శ్రీరాముని చేతిలో తప్పక అనుభవింపగలవు. కైకేయీ! నీ కోరిక ఇప్పుడు పూర్తిగా సఫలమైంది కదా!

జనస్థానములోని ఓ కర్ణికార వృక్షములారా! సీతను రావణుడు హరించాడని రామునికి తెలుపండి. ఓ మాల్యవంత పర్వతమా! నీకు నమస్కారము చేస్తున్నాను. ఈ వార్తను రామునికి తెలుపు. హంసకారండవాది పక్షులుగల గోదావరీ నదీ! నీకు దండము పెడుతున్నాను. ఈ వార్తను మా రామునికి తెలియజేయుము. ఓ వనదేవతలారా! మీకు ఇదే నా నమస్కారము. ఈ వార్తను వెంటనే మారామునికి తెలుపండి. ఈ వనంలోని మృగపక్షులారా! సర్వప్రాణులారా! తన ప్రాణ ప్రియను రావణుడు హరించాడని మా రామునికి తక్షణమే తెలియజేయండి. మహాబలుడైన మా రాముడు యముడు అపహరించినా నన్ను తిరిగి తప్పక తెచ్చుకోగలడు" అని విలపించింది. అప్పుడామెకు చెట్టుపై పడుకొన్న జటాయువు కనుపించాడు. "ఓ జటాయు పక్షి రాజా! అనాథను వలె నన్ను రావణుడు అపహరిస్తున్నాడు చూడు! మహాబలుడు సాయుధుడు, సంగర విజేత అయిన ఈ రావణుని ఎదిరించడం నీకు సాధ్యము కాదు. అయితే మా రామునికి, లక్ష్మణునికి నా ఈ రావణ హరణవార్తను యథాతథంగా తెలియజేయుము" అని సీతాదేవి ఆక్రోశించింది.

ఇతిశం

"అమృతం కంటె అద్భుతమైనది శ్రీరామనామము"

# జటాయు వధ

సీతయొక్క అరుపులు, పిలుపులు జటాయువు నిద్రను దూరం చేశాయి. అతడు కనులు తెరచి రావణుని, సీతమ్మ తల్లిని అవలోకించాడు.

జటాయువు పర్వత శిఖరమంత శరీరము కలవాడు. పదునైన ముక్కు గలవాడు. అతడు రావణునికి తన గురించి, రాముని గురించి, ధర్మాధర్మముల గురించి వివరించాడు:–

“రావణా! నేను జటాయువనే గృధ్రరాజును, మహాబలుడను. అరవై వేల సంవత్సరములు పితృదత్తమైన రాజ్యమును పాలించాను. నేను దశరథుని మిత్రుడను.

శ్రీరాముడు దశరథ రాజ తనయుడు. సర్వలోక ప్రభువైన మహేంద్రునితో సముడు. సర్వభూత హితరతుడు. నీవు ఆయన భార్యను అపహరిస్తున్నావు.

రాజు అన్యుల భార్యలను కాపాడాలి. అన్యరాజుల పత్నులను విశేషించి గౌరవించాలి. రాజులు శత్రువుల భార్యలను ఆక్రమించుకోవచ్చు. అది కూడ ఆ శత్రువులతో పోరాడి వారి భార్యలను స్వాధీనము చేసికోవచ్చు.

నీకు రాముడే అపకారము చేయలేదు. శూర్పణఖా విరూపణం, ఖర దూషణాది వధలంటావా? అవి శూర్పణఖ స్వయంకృతాపరాధ ఫలాలు. శూర్పణఖ రామలక్ష్మణులను కామించింది. వారు నిరాకరిస్తే, అడ్డుగా ఉందని సీతాదేవిని కబళించ ప్రయత్నించింది. అందువలననే విరూపిత అయింది. ఖరదూషణాది పదునాలుగువేల రాక్షసులు ధర్మాధర్మ విచక్షణ లేక, అధర్మచారిణి అయిన శూర్పణఖను బలపరచి, రణములో అరక్షణములో రాముని శరాగ్నికి సమిధలయ్యారు. ఇందులో రాముని దోషమేముంది?

పరదారను అపహరించేముందు స్వదార అన్యులచే అపహరింపబడితే రాగల దుఃఖాన్ని ఆలోచించుకోవాలి. నీవు పులస్త్య మహర్షికి వారసుడవు. స్వయంగా రాజువు. శాస్త్ర నిషిద్ధ పాపములను ఆచరింపకూడదు కదా!

నీవు ఆశీవిష సర్పాన్ని మూటగట్టుకొని వెళ్తున్నావు. ఇంద్రుని వజ్రాయుధము వృత్రాసురుని సంహరించినట్లుగా, లోకనాథుడైన రాముడు తన నేత్రాగ్నిచే నిన్ను దహిస్తాడు. కాలపాశాన్ని మెడలో వేసికోకు. మోయరాని బరువును మోయుటకు యత్నించేవాడు నేలగూలక మానడు.

నీ అధర్మకార్యాన్ని, కనులార చూస్తూ నేను నిన్ను వదలను. నేను వృద్ధుడను, నీవు యువకుడవు. నేను నిరాయుధడను. నీవు రథ, కవచ ధనుర్ధారివి. అయినా నీవు నన్ను దాటిపోలేవు. నీకు నేను యుద్ధాతిథ్యమిచ్చి, తొడిమె నుండి ఫలాన్ని విరిచినట్లు నిన్ను రథము నుండి అధఃపతితుణ్ని కావిస్తాను" అని రావణుడిని అతడు హెచ్చరించాడు.

జటాయువు యొక్క అసహ్య సంభాషణతో రావణుడు ఆగ్రహ పరవశుడయ్యాడు. అతని ఇరువై కన్నులు అగ్నివిస్ఫులింగాలను రాల్చాయి. అతడు జటాయువు పైకి ఉరికాడు.

గాలికి చెదిరిన రెండు మేఘాలు పరస్పరము ఢీకొన్నట్లు, రెండు మాల్యవంత పర్వతాలు ఒకదానితో ఒకటి కొట్టుకొన్నట్లు రాక్షస గృధ్ర రాజుల మధ్య పోరు భయంకరమైనది.

రావణుడు భయంకరమైన బాణ పరంపరను జటాయువుపై ప్రయోగించాడు. కన్నీటి తో దుఃఖపరవశ అయిన జానకిని జటాయువు దర్శించాడు. ఆయనకు ఆవేశము ఆగలేదు. రావణుని బాణములను ఆయన లెక్క చేయలేదు. రాక్షసుని ధనుస్సును ఆయన తన కాళ్లతో విరిచి వేశాడు. లంకేశ్వరుడు మరొక ధనుస్సును గ్రహించి, అసంఖ్యాక మహోగ్ర బాణాలను ప్రయోగించాడు. రెక్కలతో గృధ్రరాజు వాటిని దూరము చేసి రావణుని కవచాన్ని, కాంచన రథాన్ని సారథిని రథ ఖరాలను భగ్నం చేశాడు. రథహీనుడైన రావణుడు సీతాదేవితో సహా భూమిపై పడిపోయాడు. సకల లోకవాసులు జటాయు విక్రమానికి జయజయధ్వానాలు చేశారు. రావణునికి అయోమయం కల్గింది. అయితే అంతటి దీర్ఘయుద్ధానంతరము వృద్ధాప్యము వలన జటాయువు అలసిపోయాడు. అయినా తన పదనుగోళ్లతో రావణ దేహాన్ని బాధితం చేశాడు. ఆయన చేతులను కొరికి తెగకొట్టాడు. అసురుని చేతులు మళ్లీ మొలిచాయి.

జటాయువు అలసటను గమనించిన అమరారాతి ఆగ్రహపరవశుడై ఆ పక్షిరాజును తన పిడిగ్రుద్దులతో వివశుని కావించాడు. మృత్యుభయంకరమైన తన నిశిత ఖడ్గంతో అతని రెక్కలను తెగ నరికాడు.

× × ×

జటాయువు ఒక ముదుసలి గ్రద్ద. ఇంతకు ముందు తనకు దశరథునితో ఉన్న మైత్రిని పురస్కరించుకొని సీతాదేవి రామలక్ష్మణ విహీన అయినప్పుడు ఆమెను రక్షిస్తానని రామచంద్రస్వామికి అత్యుత్సాహంతో మాటిచ్చాడు. మాట అయితే అప్పుడు ఇచ్చాడు. కాని ఇప్పుడు సీతాదేవిని సంరక్షణ కావించాలంటే తాను ఎదుర్కోవలసింది లోక విద్రావణుడైన రావణాసురుని. దశకంఠుడు మహాబలవంతుడు, వజ్రసదృశకవచోపేతుడు,

ఖడ్గ చాపధరుడు. కాంచనరథ సంపన్నుడు, యౌవన విశిష్టుడు, తపోబల సంపన్నుడు, వరగర్విష్టుడు!. జటాయువు వృద్ధుడు, నిరాయుధుడు, పక్షిమాత్రుడు. అయినా తాను రామునికి ఇచ్చిన మాట నుండి వెనుకకు తగ్గలేదు. తన రెక్కలతో, నఖాలతో రావణుని రథము నుండి క్రింద పడగొట్టాడు. రామపత్నిని రక్షించే ప్రయత్నంలో తాను ప్రాణాలను అర్పించాడు.

ఒక్కొక్కసారి మనము ఇతరులకు సహాయము చేయాలనుకొంటాము. అందుకు అవకాశము రావాలని అభిలషిస్తాము. అయితే మనకు ఆ అవకాశము కలుగాలంటే వారికి ఏ ఆపదో, ఏ అవసరమో కలుగాలి కదా! జటాయువు అమాయకంగా ఆ అవకాశాన్నే ఆశించాడు,

**"సీతాంచ తాత రక్షిష్యే**
**త్వయ్యాతే సహలక్ష్మణే"**

అని రామునితో అన్నాడు. జటాయువు కోరికను తీర్చాలంటే తాను లక్ష్మణుడు కూడ సీతను అనాధగా వదలిపెట్టాలి కదా! అదే జరిగింది. సీతకు మహాపద సంభవించింది. అయ్యో! మన వలన పరమాత్మకు ఎన్ని కష్టాలో!

పోనీ తాను మాట ఇచ్చినట్లు జటాయువు సీతను రక్షింప గల్గాడా! లేదు. కాని శక్తి మేరకు ప్రయత్నం చేశాడు. ఆ ప్రయత్నంలో తాను ప్రాణాలనే సమర్పించాడు.

పరమాత్మ మన శక్తిని గమనించడు. మన హృదయాన్ని పరిశీలిస్తాడు. మనము ఆయనకు సేవ చేయగల్గుతామా? లేదా అని కాదు. సేవ చేయాలనే చిత్తము ఉంటే చాలు. చూచి సంతోషిస్తాడు.

ఇతిశమ్

**"జీవనాన్ని ఉజ్జీవనాన్ని కల్గించేది శ్రీరామ నామమే"**

# సీతా విలాపము

రెక్కలు తెగి, నేల కూలిన జటాయువును సీతాదేవి చూచి అమితంగా విచారించింది. తన మామగారితో జటాయువు కున్న మైత్రిని బట్టి ఆ పక్షిరాజు ఎంత సాహసం చేశాడు? చివరకు ఆయన ప్రాణాలను కూడ తన రక్షా ప్రయత్నంలో ధారపోశాడే!

సీతాదేవికి ఆ పక్షిని చూడగానే దుఃఖమాగలేదు. రావణుని బలమైన బాహుబంధం నుండి తనను విడిపించుకొని, రెక్కలు తెగి ప్రాణావశిష్టుడైన ఆ పక్షి దగ్గరకు పరుగెత్తింది. ఆ మాంసం ముద్దను ఆలింగనం చేసికొంది. తన ప్రియబంధువెవ్వరికో ప్రాణాపాయం సంభవించినట్లు బాధపడింది. ఆ పక్షిని విడిచి పోలేక అత్యంత దుఃఖావశిష్ట అయింది.

× × ×

భేష్ జటాయు మహారాజా! నీవు ధన్యుడవయ్యావు. నీ జన్మ ధన్యమైంది. సీతాదేవిని రక్షించడంలో శాయశక్తులా ప్రయత్నించావు. సీతాదేవి చల్లని స్పర్శకు నోచుకున్నావు. ఆమె అభిమానానికి పాత్రుడవయ్యావు. అంతకంటే ఏ జీవికైనా కావలసిందేమిటి?

× × ×

ఆమె ఘోరంగా విలపించసాగింది. "ఆర్యపుత్రా! శకునాలు సుఖదుఃఖాలను సూచిస్తాయి కదా! నా ఈ ఆపదను మృగములు, పక్షులు నీకు సూచిస్తాయి.

నా దురదృష్టమేమని చెప్పాలి? నన్ను రక్షింపవచ్చిన జటాయువు కూడ విగత జీవుడయ్యాడు. "రామా! నన్ను రక్షించు. లక్ష్మణా! నా ఈ అనాథ లక్షణాన్ని గమనించు" మని ఆమె ఆర్తనాదం చేయసాగింది. శరీర లక్షణ గ్రాహులు నాలో అన్ని శుభ లక్షణాలే ఉన్నాయన్నారే? ఇప్పుడిలా ఎందుకయింది? రావణునికందకుండా పరుగెత్తుతూ త్రోవలో ద్రుమాలను గట్టిగా పట్టుకొంటున్నది. "రామ! రామ! అంటూ ఆక్రందిస్తున్నది. రామా! నీ అరణ్యవాసంతో నీవారు ఎవ్వరు సుఖించారు? అయోధ్యలో నీ తండ్రి దశరథుడా? భరతుడా? అడవిలో జటాయువా? ఈయన, నీ తండ్రి నీకై మరణించారయ్యా" అని సీత తీవ్రంగా విలపించసాగింది. అయినా ఆ క్రూరుడు, దుర్మార్గుడు, కామాంధుడైన రావణుడు ఆమెను వదలలేదు. అసహాయురాలైన ఆమె తలవెంట్రుకలను యమునిలా గట్టిగా పట్టుకొన్నాడు. చరాచరమంతా భయంతో కంపించింది. ఈ అమర్యాదకు జగత్సర్వము అంధకార బంధురమైంది. పంచభూతములు ప్రకాశహీనములయ్యాయి.

అయితే ఆ దృశ్యాన్ని బ్రహ్మదేవుడు తన దివ్యనేత్రాలతో దర్శించాడు. "ఓహో మన పని నెరవేరింది" అనుకొన్నాడు.

**"నఃకార్యం కృతమితి వ్యాజహార పితామహః"**

పరమకారుణికులైన మహర్షులు ఆ సంఘటనను గమనించి దండకారణ్యములో ఒకవైపు బాధను మరొక వైపు హర్షాన్ని అనుభవించారు. "ప్రహృష్టా, వ్యధితాశ్చాసన్"

× × ×

ఆశ్చర్యంగా లేదా పితామహుని ప్రవర్తన? ఆశ్చర్యంగాలేవా మహర్షుల మనోభావనలు? అంటే సీతాదేవిని రావణుడు అపహరించాలని చతుర్ముఖుడు, సంయమీంద్రులు, అమరులు ముందుగానే అభిలషించారా? ఎంత స్వార్థపరులు దేవతలు? సురులే కాదు ఋషులు కూడ అదే జరుగాలని అభిలషించారా? రాముని వనవాసం, సీతాపహరణం అన్నీ వారందరి కుట్ర ఫలితాలేనా?

వారి కుట్రలోని భాగమేనా కైకేయి వరాలను కోరింది? చాటుకున్న సురులు, మునులు బయటపడలేదు. కాని అమాయకురాలైన కైకేయి క్షణికావేశంలో కోరిన కోరికల వలన రామ వనవాసానికి ఆమె ప్రధాన కారణంగా చరిత్రలో నిలిచిపోయిందా? రామాయణేతి హాసం ఆమెను బలిపశువుగా చూపిందా? విచిత్రమైంది విధివిలాసము!

ఇతిశం

"కల్యాణ గుణ రాశి – కౌసల్యా నందనుడు"

# సీతాదేవి రోషము

ఆకాశంలోకి రావణుడు సీతాదేవితో కూడ ఎగిరాడు. దుఃఖముతో సీతాదేవి రాక్షసుని దూషింప సాగింది. "రావణా! నీవు చేసిన పనికి నీకు సిగ్గువేయడం లేదా? మాయతో లేడిని పంపింది, నా భర్తను దూరంగా పంపింది నన్ను అపహరించడానికేనా? మా మామగారి మిత్రుడు, వృద్ధుడైన జటాయువును కూడ కనికరం లేకుండా చంపివేశావే?

ఎంత గొప్పగా నీ పేరు చెప్పుకున్నావు? నీ నీచపు పనిని గురించి శూరులు ఏమని చెప్పుకొంటారు?

ఒక క్షణము అగు! పరుగెత్తకు! రామలక్ష్మణుల కన్నులలో పడిచూడు. నీ సైన్యమంతటితో కలసి పోరాడినా ఒక క్షణము కూడ నీవు జీవింప లేవు. నీవు ఏ ఆశతో నన్ను అపహరిస్తున్నావో? ఆ ఆశ తీరకుండానే నా భర్త చేతిలో వినాశం చెందుతావు. చావు కాలము రాగానే విపరీతాలు తోస్తాయి. మంచి మనస్సుకు రుచింపదు.

నీవు బంగారు చెట్లను చూడబోతున్నావు. వైతరణిలోని చీము, రక్త ప్రవాహాన్ని కాంచబోతున్నావు. భయంకరమైన కత్తుల ఆకుల వనాన్ని దర్శించబోతున్నావు. కాల్చిన బంగారు పూవులతో, ఇనుప ముండ్లతో భయంకరమైన యాతనలను కలిగించే శాల్మలీ వృక్షాన్ని కౌగిలించుకోబోతున్నావు.

ఇంతటి పాపమొనర్చి రాముని ఎదుట ఎలా నిలువగలవు? విషమును త్రాగి, కాలపాశ బద్ధుడవై ఉన్నావు. పదునాల్గు వేల రాక్షసులను ఒంటరిగా యమ సదనానికి పంపిన మహావీరుడైన రాముడు తన భార్యా చోరుడవైన నిన్నెలా బ్రతుకనిస్తాడు?"

ఇంతటి పరుష వచనాలు పలుకుతూ హెచ్చరిస్తూ అతనికి హితాన్ని బోధించాలను కొన్న ఆ తల్లి పలుకులను పాపాత్ముడైన రావణుడు పట్టించుకోలేదు.

ఇతిశమ్

# ఋష్యమూకము - లంకా గమనము

రావణుడు రోదిస్తున్న రామపత్నిని బిగ్గరగా పట్టుకొని వెళ్తున్నాడు. ఆమెకంతా అయోమయంగా ఉంది. అయితే ఆకస్మాత్తుగా ఆమె దృష్టి అవనీ తలంపై పడింది. అక్కడ కనపడింది ఋష్యమూక గిరి శృంగము. దానిమీద అయిదుగురు వానరులు ఉన్నారు. తళుక్కుమని వారిని చూడగానే ఆమె కొక ఆలోచన స్ఫురించింది. అంతే! వెంటనే తన పట్టుచీర కొంగును చింపి అందులో తన కొన్ని ఆభరణాలను మూటగట్టి క్రింద పడవేసింది.

సీతాదేవి ఆర్తనాదాలను విని వారు గిరిశిఖరము నుండి ఆకాశమువైపు అవలోకించారు. సీతాదేవి క్రిందపడవేసిన బంగారు ఆభరణాల చీర మూటను వారు గమనించి దానిని సంగ్రహించారు. ఆ దృశ్యాన్ని చివరి వరకు అవలోకించిన అవనిజాత ఆ విషయాన్ని తన భర్తకెలాగైనా వారు తెలియజేస్తారనుకొంది.

సీతను పట్టు విడువకుండా పట్టుకొని లంకకు చేరువవుతున్న లంకాధిపతి సీతాదేవి చీర మూటను క్రింద పడవేయడాన్ని గమనించలేదు.

వనాలను, నదులను, పర్వతాలను దాటి రావణుడు సముద్రము పైనుండి వెళ్లసాగాడు. సముద్రము రావణ భయంతో సంచలన రహితమైంది. అంతరిక్ష గతులైన చారణులు రావణునికి అంతిమకాలము సమీపించిందని చెప్పుకొన్నారు.

రావణుడు తన లంకా రాజధానికి చేరాడు. అంతఃపురంలోకి ప్రవేశించాడు. ఒక అందమైన హర్మ్యంలో అవనిజాతను ఉంచి, తన ఆజ్ఞలేకుండా అన్యులనెవ్వరిని లోనికి రానీయవద్దని పరిచారికలను ఆజ్ఞాపించాడు. సీతాదేవి తన ప్రాణముల కంటె ఎక్కువగా ప్రియమైనదని, ఆమె అభిలషించినదేదైనా తక్షణమే సమకూర్చాలని ఆదేశించాడు. ఆమెకు అప్రియమైనదేది ఆచరింపకూడదని ఆజ్ఞ నొసగాడు.

అంతఃపురంలో సీతను ఉంచిన తరువాత రాక్షసేశ్వరుడు కొంత ఊరట చెందాడు. కొంత తడవైన తరువాత అంతఃపురం నుండి అతడు బయటకేతెంచి అక్కడ మాంసాహారులు, మహాభయంకరులు, మహావీరులైన అష్ట రాక్షసులను పిలిచి, వారికి జనస్థానంలో ఖరాది రాక్షస వధ వార్త నెరిగించి, తక్షణమే వారిని జనస్థానానికి వెళ్లుమని నియోగించాడు. అక్కడ రామాశ్రమ సమీప ప్రాంతంలో ఉండి, జనస్థానాన్ని సంరక్షిస్తూ, రామలక్ష్మణుల కదలికలను గమనించి జాగ్రత్తగా తనకు వాటిని ఎప్పటికప్పుడు తెలియ జేయాలని ఆదేశించాడు. ఆ అష్టరాక్షసులు రాక్షసేశ్వరునికి ప్రణమిల్లి జనస్థానానికి ప్రస్థానమయ్యారు.

# రావణ ప్రలోభము

రావణుడు అష్టరాక్షసులను జనస్థానానికి పంపి తన కార్యము నెరవేరిందని సంతోషించాడు. మనస్సులో కొంత అలజడి తగ్గగానే మన్మథ బాణ పీడితుడయి సీతను చూడాలని వెళ్లాడు. ఆమె ఆకృతి దాల్చిన శోకమా అన్నట్లు, శోకదేవతవలె ఉంది. కనుల నిండానీరు తిరుగుతున్నది. గాలిచే కొట్టబడిన సముద్రనావవలె దుఃఖపీడిత అయి ఉంది. వేటకుక్కలచే చుట్టబడిన ఆడలేడివలె భయంతో వణుకుతున్నది.

ఆమెను తీసికొని ఆ సువర్ణ సౌధమంతా తిరిగాడు. స్త్రీ సహస్ర సేవితమై, నానా పక్షి గణజుష్టమై, తప్త కాంచనతోరణములు గలిగి, గజదంతములతో, స్ఫటికములతో రజత, రత్న వైడూర్యములతో నిర్మితములైన స్థంభములతో, కాంచన సోపానములతో ఆ సౌధరాజము చిత్ర విచిత్రముగా వుంది. శ్రీరామ చింతా పరిపీడిత స్వాంత అయిన సీతాదేవి ఆ హర్మ్య వైభవము పట్ల మనస్సును లగ్నం చేయలేదు.

ఆమె ముందు రావణుడు తన వైభవాన్ని మరింతగా వర్ణించుకోసాగాడు. "సీతా! ముప్పది రెండు కోట్ల మంది రాక్షసులు నాకు దాసులుగా ఉన్నారు. నా ఇంట్లోనే వేయిమంది రాక్షసులు ప్రత్యేకంగా ఉన్నారు. అనేక వేలమంది స్త్రీలను పరిగ్రహించాను. నీవు నా ప్రాణప్రియవు. నా భార్యవై వీరందరికి యజమానురాలువి కాగలవు.

శతయోజన విస్తీర్ణమైన సముద్రమునకు ఆవల ఉన్న నా లంకానగరము సురాసుర దుర్భేద్యమైనది.

ఇక రాముడంటావా? రాజ్యభ్రష్టుడు, దీనుడు, తాపసవేషధారి, అల్పమానవుడు ఆయనకిక్కడికి వచ్చే శక్తి లేదు. వాయువును పాశములు బంధింప జాలవు. అగ్నిశిఖను చేతిలో ఎవ్వరు పట్టుకోజాలరు. నా బాహుబల పరిరక్షితమైన ఈ లంకలోనికి ఎవ్వరు ప్రవేశింపజాలరు.

అందువలన నీ మనస్సును రాముని నుండి మరల్చి నా భార్యవు అగుటకు అంగీకరించు. యౌవనము అశాశ్వతమైనది. నీ దురదృష్టము నిన్ను రాముని భార్యగా అడవుల పాలు జేసింది. ఇప్పుడు అదృష్టము నిన్ను వరించి నా దగ్గరకు పంపింది. నాతో పట్టాభిషిక్తవై ఈ రాక్షస రాజ్యానికి రాణివికా. నన్ను వరించుట అధర్మమనుకోకు. ఇది దైవనిర్ణయము. ఇక నీ విచారమును చాలించి నన్ను చేపట్టు. ఇంతవరకు ఈ రావణుడు ఎవ్వరిని ఏది యాచింప లేదు. కాని నిన్ను నీ పాదములకు ప్రణమిల్లి అర్థిస్తున్నాను. నాపై దయజూపు. నన్ను సుఖపెట్టు".

# తృణమంతరతఃకృత్వా

రావణ ప్రలోభానికి ఏ మాత్రము లొంగని సీతాదేవి తనకు రావణునికి మధ్య గడ్డిపోచ నుంచి నిర్భయంగా ప్రత్యుత్తరమిచ్చింది. సీతాదేవి తనకు రావణునికి మధ్య గడ్డి పోచను అడ్డువేసింది (తృణమంతరతఃకృత్వా). దీనికి వ్యాఖ్యాతలు అనేకార్థాలను సూచించారు. (1) పరస్త్రీ పురుషుల మధ్య కనీసం "గడ్డిపోచ" అంత దూరమైనా ఉండాలని. (2) సీత దృష్టిలో రావణుడు గడ్డిపరక వంటివాడని (3) స్థంభంలోంచి బయట కొచ్చిన నృసింహునివలె ఆ గడ్డిపోచ నుండి కూడ శ్రీరామ సింహము బయటకు రావచ్చునని. (4) పచ్చగడ్డి పరక పైనే రాముడు బ్రహ్మాస్త్రాన్ని మంత్రించి కాకాసురునిపై ప్రయోగించాడని, అలాగే రావణునిపై కూడ ప్రయోగించగల్గుతాడని (5) ఈ గడ్డిపోచను భస్మము చేసినట్లే నేనే నా తేజస్సుతో నిన్ను భస్మం చేయగల్గుతానని".

ఇలా ఎన్నో అర్థాలు! వీటిని ఇంకా ఎక్కువగా సుందరకాండలో గమనిద్దాము!

"స్థిరమైన ధర్మసేతువు వంటి దశరథ మహారాజు యొక్క పుత్రుడు శ్రీరాముడు, అతడు మూడులోకాలలో కూడ విఖ్యాతుడైన ధర్మాత్ముడు. ఆయన మహా పరాక్రమ సంపన్నుడు. ఆయనే నా భర్త, నా దైవము కూడ.

ఆయన తమ్ముడు లక్ష్మణుడు బలపరాక్రమాలలో అన్నతో సమానమైనవాడు. వారిద్దరు నీ ప్రాణాలను అపహరించక మానరు.

ఇక నీ రాక్షస బలమంటావా? వారెంత? వారి బలమెంత? గరుత్మంతుని ముందు పాముల వంటివారు వారు. యూపమునకు కట్టుబడిన పశువువలె ససైన్యంగా నీవు రాముని చేతిలో మరణింపక తప్పదు. అంతవరకు కూడ అవసరము లేదు. రాముడొక్కసారి ఆగ్రహంతో చూస్తే చాలు, నీవు భస్మమై పోతావు.

ఆయన చంద్రుని ఆకాశాన్నుండి భూమిపై పడగొట్టగలడు. సముద్రాన్ని ఎండింప జేస్తాడు. నన్ను రక్షింపజాలడా? నీ మూలంగా లంకానగర స్త్రీలందరు విధవలవుతారు. బ్రాహ్మణ మంత్ర పవిత్రమైన యజ్ఞవేది ఇతరులకు ఉపయోగార్హమవుతుందా? రాజహంస కాకిని వరిస్తుందా? అలాగే శ్రీరాముని ధర్మపత్నినైన నేను నిన్ను తాకుటకు కూడ అంగీకరింపను.

ఇక నా శరీరము నీ వశమైనదంటావా? దానిని బంధించు, చంపి తిను" మని వైదేహి ఆగ్రహంతో కఠినోక్తులను పలికింది.

రావణుడు ఆమెను ఇంకా ప్రలోభ పెట్టదలచలేదు. కాని మృత్యుభయాన్ని కలిగించాలనుకొని, "సీతా! నా మాట కూడ విను. నీకు పన్నెండు నెలల గడువిస్తున్నాను. ఆలోపల నన్ను అంగీకరించలేదనుకో. వంటవాళ్లు నిన్ను ముక్కలుముక్కలుగా ఖండించి నా ప్రాతర్భోజనానికి పంపుతారు" అని భయంకరంగా పలికాడు.

అక్కడ ఉండే భయంకర రాక్షస స్త్రీలను పిలిచి "రక్త మాంస భోజనులైన మీరు ఈమె మొండితనాన్ని మాన్పించండి. అంతఃపురం నుండి ఈమెను అశోకవనానికి తీసికొని వెళ్లండి. అక్కడ ఆమెను జాగ్రత్తగా కాపలా కాయండి" అని ఆజ్ఞాపించాడు.

రాజాజ్ఞననుసరించి భయంకరులైన ఆ రాక్షస స్త్రీలు సీతాదేవిని అనేక విధాల హింసింప సాగారు.

సీత అంటే నాగటి చాలులో జనకమహారాజుకు యజ్ఞ భూమిలో లభించిన దేవి. ఆమె ఏ తల్లి గర్భం నుండి పుట్టలేదు.

చావు పుట్టుకలు లేనిది ఆత్మ. అన్ని ఆత్మలు సహజంగా పరమాత్మకు దాసభూతములు. సీతాదేవి రాముని భార్య. అటువంటి ఆత్మను అహంకారము కలిగిన మనస్సు తన ఆధీనంలో ఉంచుకోవాలని ప్రయత్నిస్తుంది. బలవంతంగా స్వాధీనము చేసికోవడానికి ప్రయత్నిస్తుంది. అయితే పరమాత్మకు అధీనమైన ఆత్మ ఆత్మ హితకరములైన ఆలోచనలను కలిగి పరమాత్మకు ప్రియమై, ఉజ్జీవనాన్ని పొందుతుంది.

అహంకారపూరితమైన మనస్సు రావణుని వలె ఆత్మను తన వశంలోకి తెచ్చుకొని దుష్ట సంకల్పములను కలిగి, పరమాత్మనుండి ఆ ఆత్మను వేరు చేయాలనుకొంటుంది. పరమాత్మకు దూరమైన ఆత్మ సీతవలె మృత్యురూపమైన సంసారంలో శాశ్వతంగా చిక్కుకొంటుంది.

లక్ష్మణుని వలె సీతాదేవిని ఆరాధింపక, రావణుడు ఆమెను రాముని నుండి వేరు చేసి ఆమెను బలవంతముగా అనుభవించాలనుకొన్నాడు. రామునికి శత్రువయ్యాడు. సీతాదేవి చేసిన ఆత్మప్రబోధాన్ని అలక్ష్యం చేశాడు. అంతిమంగా సర్వనాశనమయ్యాడు. ఆత్మను లోబరుచుకొని తన ఇష్టము వచ్చినట్లు విశృంఖలంగా ప్రవర్తించే అహంకార పూరితమైన మనస్సు అనుభవించేది రావణుని వలె తన మృత్యువునే.

ఇతిశమ్

# లక్ష్మణ దూషణము

మారీచుని వధించి సీతాదేవిని చూడాలని శ్రీరాముడు ఆశ్రమానికి త్వరగా తిరిగి రాసాగాడు. ఆయనకు దారిలో అపశకునమైన నక్క కూత వినిపించింది. మనస్సు చెదిరింది. ఆయన అనేక విధాలుగా ఆలోచింపసాగాడు. "నన్ను మాయాలేడి చాల దూరం తీసుక వెళ్లింది. చివరకు మరణిస్తూ నా స్వరంను అనుకరించి "హా లక్ష్మణా! చచ్చాను" అని గట్టిగా పలికింది. సీతాదేవిని ఒంటరిగా వదలి లక్ష్మణుడు రావడం లేదు కదా? ఆమెకే ఆపదా రాలేదు కదా? అనేక దుర్నిమిత్తాలు అగుపిస్తున్నాయే? అనుకుంటూ ఆయన వడివడిగా అడుగులు వేశాడు. ఆయన అలా అనుకుంటూ ఉండగానే విషణ్ణ వదనంతో లక్ష్మణుడెదురయ్యాడు.

"లక్ష్మణా! సీతను ఒంటరిగా వదలి ఎందుకు వచ్చావు? ఆమె క్షేమంగా ఉందో లేదో? ఒంటరిదాన్ని అబలను చూచి ఆమెను రాక్షసులు అపహరించారో ఏమో? లేక పూర్తిగా భక్షించారో?

నేను రాజ్యభ్రష్టుడనయి, దీనుడనయి, దండకారణ్యానికి బయలుదేరినప్పుడు నాకు తోడుగా తాను కూడ బయలుదేరింది. ఇప్పుడామె తోడు లభిస్తుందో లేదో? లక్ష్మణా! నా సీత లేకుండా నేను ఒక క్షణమైనా జీవింపను.

నేను చచ్చి, నీవు అయోధ్యకు ఒంటరిగా తిరిగివెళ్తే కైకేయి కామము నెరవేరుతుంది. ఆమె తన పుత్రునితో, రాజ్యంతో సమృద్ధంగా సుఖిస్తుంది. కాని మా తల్లి కౌసల్య పుత్రుని కోల్పోయి కైకేయి ప్రక్క జీవింప జాలదు" అని శ్రీరాముడు సీతాదేవి గురించి దుఃఖిస్తూ, సౌమిత్రిని దూషిస్తూ ఆకలిదప్పులు అధికం అవుతుండగా శూన్యమైన ఆశ్రమంలో ప్రవేశించి, తమ విహార స్థలాలలో కూడ అన్వేషించి ఆమెను ఎక్కడ చూడజాలక దుఃఖావిష్టుడయ్యాడు.

ఆశ్రమం నుండి కొంత సమయానికి బయటకు వచ్చి తమ్ముని చూచి రాముడడిగాడు. "లక్ష్మణా! నిన్ను నమ్మి నీ రక్షణలో సీతాదేవిని ఉంచి మాయామృగాన్ని అనుసరించి వెళ్లాను కదా? నీవామెను ఒంటరిగా వదలి ఎందుకు వచ్చావు? నిన్ను ఒంటరిగా చూడగానే సీతకు ఆపద కలిగిందనే అనుమానము వచ్చింది. నా ఎడమ కన్ను అదిరింది. నా గుండె బరువెక్కింది. అది నిజమైంది కదా?"

తన తప్పు ఎంత ప్రమాదాన్ని తెచ్చిపెట్టిందో గ్రహించిన లక్ష్మణుడు భయంతో తడబడుతూ, "అన్నా! నేను కావాలని వదినను వదిలి రాలేదు. "లక్ష్మణా! నన్ను రక్షించు"

మన్న రాక్షసుని అరుపులు విని ఆమె నన్ను వెంటనే నీ దగ్గరికి తరుమ సాగింది. అయినా ఆమె తొందరపాటును నివారించడానికి అనేక విధాల ఆమెను అనునయించాను. మూడు లోకాల్లో కూడ మా అన్నగారికి ఆపదను కలిగించే మొగాడు ఇంతవరకు పుట్ట లేదు. ఇక ముందు పుట్టబోడు. దేవేంద్రుని నాయకత్వంలో దేవతలందరు కలసి ఎదిరించినా మా అన్నగారికి అపజయాన్ని కలిగింపజాలరు" అని అనేకరకాల ఆమెను నమ్మించ ప్రయత్నించాను.

అయినా ఆమె నా మాటలు నమ్మలేదు. అంతేకాదు "అరణ్యానికి నీవు తోడు వచ్చింది కూడ మీ అన్నకు, నాకు తోడు ఉండడానికి కాదు. మీ అన్నకేదైనా ఆపద కలిగితే నన్ను వశం కావించుకోవచ్చుననే పాప సంకల్పంతో బయలుదేరావు. నిన్ను భరతుడు కూడ అందుకు పురికొలిపి ఉండవచ్చును. అయితే నీ ఆలోచన సఫలం కాదు. నేను ప్రాణాన్నైనా వదలుతాను. కాని నీకు లోబడను" అని అతిదారుణంగా నన్ను అనుమానించి అవమానించింది. ఆ పరిస్థితిలో అంతకంటె ఏమి చేయాలో తోచక విధిలేక ఆమెను వదలి వచ్చాను".

శ్రీరాముడు సౌమిత్రి పరిస్థితిని అర్థం చేసుకొన్నాడు. జాలిపడ్డాడు. అయినా సౌమిత్రిని ఆయన సమర్థించలేదు. "లక్ష్మణా! నీ పని నాకు నచ్చలేదు. ఆమె నాకాపద కలిగిందేమో అనే అనుమానంతో, దుఃఖంతో, కోపంతో ఏమైనా నిన్ను అనవచ్చు కాక! అంత మాత్రాన నీవు తప్పు పట్టుకొన్నావా? ఆమె మాటలకు ఆగ్రహించావా? అలిగి అంతలోనే ఆమెను ఒంటరిగా వదిలి రావడానికి నీ మనస్సెలా అంగీకరించింది? నామాట పట్ల నీకున్న ఆదరము అంతేనా? నీ అవమానము నా ఆజ్ఞాపాలనం కంటె అధికం అనిపించిందా? అప్పటికి ఆ మృగం వెంట కొంత దూరము పరుగెత్తి, అది అందదని అనిపించగానే దానిని హతమార్చి, దాని అరుపులు ఏమి ప్రమాదాన్ని కల్గిస్తాయో అని అనుమానిస్తూ వడివడిగా వచ్చే అంతలోనే అనుకొన్నదంతా అయింది" అని రాముడు ఆక్రోశించాడు.

ఇతిశం

"తేనె కంటె తీయనిది శ్రీరామ నామము"

# సీతాన్వేషణము

శ్రీరాముడు ఆశ్రమములో సీతాదేవి లేకుండుట చూచి చాల విచారించెను. ఆమె జీవించి ఉన్నదో లేదో అని అనుమానించెను. ఆమె సహజంగా తామరల కొరకు లేదా నీళ్ల కొరకు వెళ్లే నదీ సరస్సులకు వెళ్లి చూచెను. ఎక్కడా ఆమె కానరాలేదు. ఆయనకు పిచ్చెక్కినట్లు ఉండెను. ఆయన చూచిన ప్రతివస్తువులో సీతాదేవి లక్షణాలు కనిపించెను. బిల్వఫలములు, తాళఫలములు ఆమె వక్షోజములవలె ఉండెను. అరటిచెట్టు ఆమె తొడలను తలపించెను. తిలక వృక్షము ఆమె ముఖ తిలకమును గుర్తుకు తెచ్చెను. తుమ్మెదల గానము సీతను సందర్శించి పాడినట్లు ఉండెను. జంబూవృక్షము ఆమెమేని నిగనిగలను స్మరింపజేసెను. కదంబ, కర్ణికార పుష్పములు ఆమెకు అత్యంత ప్రియములని అతడికి తెలుసు. అందువలన ఆ వృక్షములను చూచి సీత జాడను తెలుపుమని అడిగెను.

అలాగే దారిలో కనపడిన లేడి ఆమె కళ్లను, ఒక ఏనుగు ఆమె గమనాన్ని గుర్తు జేసెను. శార్దూలమును చూచి నిర్భయంగా సీత జాడను తెలుపుమనెను. మరొకమారు అతనికి ఆమె అంగాంగ సౌందర్యము తలపుకు వచ్చి ఆయనను మోహపరవశుని చేసెను.

"సీతా నీవు లేకుండా నేను జీవింపలేను. నేను చచ్చి స్వర్గానికి వెళ్తే మా తండ్రిగారు నన్ను చూచి పదునాల్గేండ్లు గడువు తీరకుండానే వచ్చావు. నీవు అసత్యవాదివి" అని నన్ను అధిక్షేపిస్తారని ఆక్రోశించెను. ఆమె కొరకు వనములు, పర్వతములు, నదులు అన్ని వెతకి చూచెను. అతని బాధను లక్ష్మణుడు చూచి భరింపలేక పోయెను. అనేక విధాలుగా అన్నగారిని అనునయించెను.

అయితే రాముని మనస్సులో అశాంతి పెరుగసాగెను. "లక్ష్మణా! నీవు అయోధ్యకు వెళ్లు. ఇక నేను తిరిగి రానని భరతునే శాశ్వత పాలకుడుగా ఉండుమని నా మాటగా తెలుపు మన ముగ్గురు తల్లులకు నా ప్రణామాలు అర్పింపుము. అయితే వారికి సీతాపహరణము గురించి మాత్రము తెలుపకు"

శ్రీరాముడు తన దౌర్భాగ్యమును తలచుకొన సాగెను. రాజ్యభ్రష్టత, పితృ మరణము, మాతృశోకము వీటన్నిటితో పాటు, సీతాపహరణము పుండుపై కారము చల్లినట్లని పించెను. తామిద్దరు కూచొన్న శిలాఫలకము, విహరించిన గోదావరి సైకతములను సందర్శించెను. సూర్యుని చూచి "నీవు కర్మసాక్షివే. నీకు తెలియని విషయము లేదు. మా సీత విషయాన్ని వివరించు" మనెను.

వాయువును చూచి, "నీవు సంచరింపని ప్రదేశము ఉండదు కదా! మా సీత జాడను తెలుపు" మనెను.

రాముని ఉన్మాద స్థితి లక్ష్మణునకు సహింపరానిదిగా ఉండెను. అతడు అన్నకు ధైర్యము నందించుచుండెను. రాముడు మరొకమారు గోదావరీ నదికి వెళ్లి వెదకుమని లక్ష్మణుని ఆజ్ఞాపించెను. అలాగే ఆనది యొక్క అన్ని రేవులలో వెతికి శూన్యవదనముతో సౌమిత్రి తిరిగి వచ్చెను.

రాముడు గోదావరీ నదీ మాతను మాటిమాటికి సీతాదేవి జాడను తెలుపుమని వేడుకొనెను. రావణాసురుని భయంకర స్వరూపము గుర్తుకు వచ్చి గోదావరి నిశ్శబ్దముగా నుండెను.

అశ్రుపూరిత నయనాలతో ఆయన తనకు కనబడ్డ లేళ్ల మందను సీత గురించి అడిగెను. అయితే అవి అశ్రునయనాలతో రాముని చూచి దక్షిణము వైపు పరుగెత్తి అక్కడ నిలచి మళ్లీ రామునివైపు చూచుచుండెను. లక్ష్మణుడు ఆ లేళ్ల చర్యలను అర్థము చేసికొనెను. అన్నను తీసికొని ఆయన దక్షిణము వైపు బయలుదేరెను.

దారిలో వారికి సీతాదేవి తలలోని పూల దండతెగి పూలు రాలిన దృశ్యము అగుపడెను. రాముడు వాటిని గుర్తించెను. ఆ పూలను ఎగిరిపోకుండా రూపు చెడకుండా ఉంచినందుకు ఆయన వాయువునకు, సూర్యునికి, భూమికి ప్రణమిల్లెను.

అంతలో ఆయనకు ప్రస్రవణ పర్వతము అగుపించెను. ఈ క్రింది మాటలతో సీతాదేవిని చూచావా అని పర్వతాన్ని ప్రశ్నించెను.

**"కచ్చిత్ క్షితి భృతాంనాథ । దృష్టాసర్వాంగసుందరీ**
**రామా॥ రమ్యే వనోద్దేశ్యే మయావిరహితా త్వయా"**

"భూమిని భరించే పర్వతరాజా! సర్వాంగ సుందరి, నన్ను వీడి ఒంటరిగా ఉన్న వనిత నీకు కనబడిందా?" అని ఆ పర్వతాన్ని అడిగెను.

విచిత్రమేమిటంటే అరణ్యములో, పర్వత ప్రాంతాలలో మనము మాట్లాడిన మాటలే మళ్లీ ప్రతిధ్వనించి మనకు వినబడుతాయి. ఎవ్వరో మనతో మనకు కనబడకుండా మాట్లాడుతున్నట్లు అనిపిస్తుంది. రామునికి తన మాటలే తనకు వినబడ్డాయి. అయితే అందులో ఆయనకు సమాధానమీ క్రింది విధంగా ధ్వని రూపంలో ఉంది.

**"క్షితిభృతాం నాథ"** ఓ రాజోత్తమా!

**"త్వయా విరహితా"** నిన్ను వదలి ఒంటరిదైన

**సర్వాంగ సుందరీ రామా"** సర్వాంగ సుందరి అయిన సీతాదేవి

**"రమ్యే వనోద్దేశే"** సుందర వన ప్రాంతంలో (రావణుడు అపహరిస్తుండగా)

**కచ్చిత్ మయా దృష్టా ఆ** = నా చేత చూడబడింది లే"

ఆపదలో ఉన్న రామునికి ఆ మాటల ధ్వని అర్థము కాలేదు. తనకు సమాధానమివ్వ లేదని ఆ గిరిపై ఆగ్రహించి భస్మము చేయదలచెను.

అంతలో ఆయన చూపు ఆ కొండ క్రింది భాగమునకు వెళ్లెను. అక్కడ రాక్షస పాదముల వంటి పెద్ద పెద్ద అడుగులు కనిపించెను. వాటికి దగ్గరలోనే ఒక విరిగిన ధనుస్సు, చెల్లా చెదరుగా పడిన బాణములు కనబడెను. అంతేకాదు సీతమ్మ చీరలోని బంగారు చెరగులు, ఆభరణ భాగాలు, తలపూలు కనబడెను. అక్కడక్కడ రక్తపు మరకలు అగుపడెను. ఆయనకు ఎవ్వరో ఇద్దరు రాక్షసులు సీత కొరకు పోరాడారని, ఆ ఇద్దరు కూడ సీతను ముక్కలు ముక్కలు చేసికొని తిని ఉంటారని అనిపించెను.

లక్ష్మణునితో ఆయన "సోదరా! ఇదిగో విరిగిన బంగారు ధనువు. ఇదిగో వైడూర్య మణిఖచిత స్వర్ణ కవచము. ఇదిగో విరిగిన శత శలాక ఛత్రము. ఇదిగో విరిగి పడిన యుద్ధరథము. ఇదిగో హతరథ సారథి. ఇదిగో నేలకూలిన చామరధారులు. ఇవన్ని ఏ రాక్షస రాజువో. ఆయన నా కంట పడితే సర్వనాశనము కాక తప్పదు. ఇంతవరకు నాకు వ్యక్తిగతముగా రాక్షసుల వలన ఘోర ప్రమాదము కలుగలేదు. ఇప్పుడు రాక్షస జాతినే నాశనము చేస్తాను. ఈ ప్రమాదాన్ని కనులారా కాంచి ఉపేక్షించిన వన దేవతలను నేను ఉపేక్షింపను. నా సహనాన్ని దేవతలు బలహీనతగా భావిస్తున్నారు. సకల లోకములను సంహరించి, సృష్టింప గల సమర్థుడను. దేవతలను వారికిష్టులైన యక్ష, గంధర్వ, కిన్నర, కింపురుషులను, రాక్షస పిశాచ సమూహములను నా దివ్యాస్త్ర సంతతిచే భస్మమొనరింపగలను. గ్రహముల గతులను నిరోధింపగలను. సూర్యచంద్రులను ప్రభాశూన్యుల కావింపగలను. పర్వతములను తుత్తునియలు చేసెదను. సముద్రములను జలశూన్యము చేయగలను.

నా భార్యను సజీవంగానో, నిర్జీవంగానో నా యెదుట నిలబెట్టకున్నచో సర్వభూతము లను సంహరిస్తానని" పలుకుతూ ప్రళయ కాలాగ్నిరూపుడై రాముడు భయంకరుడై నిలిచి ఉండెను. అంతటి భయంకర స్వరూపముగల రాముని లక్ష్మణుడెన్నడు చూడలేదు.

# లక్ష్మణ సాంత్వనము

లక్ష్మణునికి రాముని రూపము అతిభయావహముగా అగుపడెను. అంజలి ఘటించి ఆయన అన్నగారితో ఈ విధంగా నివేదించుకొనెను.

"ఆర్యా! మీరు సకల కల్యాణ గుణ సంపన్నులు. చంద్రకాంతి, సూర్యప్రభ, వాయుగమనము, భూదేవి సహనము అన్ని మీ యందు నిండుగా ఉన్నాయి. అటువంటి సర్వసద్గుణ సంపన్నులైన మీకు ఇంత ఆవేశము తగదు.

జానకీదేవిని అపహరించిన వాడెవ్వడో ఒక వ్యక్తి కదా! ఒక్క వ్యక్తి చేసిన అపరాధానికి సర్వప్రాణి కోటి సంహారము చేయుట న్యాయమా?

మన వెనుక దివ్యశక్తి సంపన్నులైన సత్పురుషులెందరో ఉన్నారు. తపః ప్రభావ గరిష్ఠులైన వశిష్ఠ మహర్షుల మంగళాశాసనాలు మనకు అండగా ఉన్నాయి. సీతాపహర్త జాడ తెలిసేవరకు సహనంతో వేచి ఉందాము. మంచి మార్గంతో సీత లభింపక పోతే ప్రబల బాణ ప్రయోగమునకు అవకాశము ఎలాగూ ఉండనే ఉంటుంది".

సౌమిత్రి వాక్కులు రాముని శాంతుని కావించలేదు. మోహావేశముతో, దుఃఖ శోకా విష్టుడైన రాముని లక్ష్మణుడు మళ్లీ మళ్లీ మాటలతో అనునయింప సాగాడు.

"అన్నా! నీవు దశరథ చక్రవర్తి తనయుడవు. దివ్య తపోయాగ లబ్ధుడవు. నీవు ఒక సామాన్య జనునివలె ఆగ్రహాగ్నిని వర్షిస్తే ఆర్తులకు ఆశ్రయమెవ్వరు అవుతారు?

సుఖదుఃఖాలు వెలుగు నీడల వంటివి. ఏవి శాశ్వతము కావు. నహుషుడు తన యాగఫలంగా దేవేంద్ర పదవిని అధిరోహించి, అహంకరించి ఒక అజగరమై (కొండ చిలువై) అధఃపతితుడయ్యాడు. ఆయన తనయుడు యయాతి స్వర్గ పదవిని అలంకరించి, ఆత్మస్తుతితో స్వర్గచ్యుతుడయ్యాడు.

మనకులగురువైన వశిష్ఠ మహర్షి, తన శతసుతులు విశ్వామిత్ర శాపాగ్నికి ఆహుతి కావడం చూచి భరించుకోలేదా? క్షమాగుణ సంపన్న అయిన భూదేవి కూడ చలించ డాన్ని మనము చూడడం లేదా?

సకల ప్రపంచాన్ని ప్రకాశమానం కావించే సూర్యచంద్రులు స్వయంగా రాహు కేతువుల బాధలను అనుభవించడం లేదా?

మీరు వివేక పరిష్కులు. కార్యకారణ జ్ఞాన గరిష్ఠులు. పూర్వజన్మ (కృత) కర్మఫలాన్ని అనుభవింపకుండుట ఎవ్వరికైనా సాధ్యమా?

సర్వప్రాణి సంహారము కావించునపుడు భగవదాశ్రితులై లోకపాలకులైన దేవతలను, వేదవిజ్ఞాన విశిష్టులైన విప్రోత్తములను, ఆర్తులను, అజ్ఞానులను, అనాధలను అన్యాయంగా హింసించుట కాదా? అది మీవంటి వివేకవంతులకు తగునా? అపరాధిని అన్వేషించి, పట్టుకొని అంతము చేయుట మన అవశ్య కర్తవ్యము" అని మిత్ర సమ్మితముగా హితమును తెలియజేసెను.

సౌమిత్రి ప్రియసూక్తులు రామచంద్రుని శాంతపరచెను. రామభద్రుడు అనుజునితో "నాయనా! మనము ఏమి చేయాలో ఎక్కడికి వెళ్లాలో? సీతాదేవిని ఎలా అన్వేషించాలో నీవే ఆలోచించి తెలుపుమని" అడిగెను.

ఇతిశం

"శత్రువైన విభీషణుని సైతం చేరదీసిన
సుశీలుడు - శ్రీరాముడు"

# జటాయువు మోక్షము

రామలక్ష్మణులు ఆ వనములోని చెట్లు, పొదలు, గిరులు, గుహలు, లోయలు అన్ని వెదుక సాగారు. శ్రీరాముని త్రోవలో లక్ష్మణుడు అనునయింప సాగాడు. వారికి దారిలో ఒక పర్వత శిఖరము వంటి పక్షి అగుపించింది. ఎవ్వడో రాక్షసాధముడు పక్షి రూపుడై సీతాదేవిని తినివేశాడని రామునికి అనిపించింది. వెంటనే ఆగ్రహంతో ఆ పక్షిని బాణాఘాతముతో చంపుటకు సిద్ధమయ్యాడు.

ఆ పక్షే జటాయువు. అతడు తనను రామలక్ష్మణులు గుర్తించక పోవుటకు కారణము సీతాపహరణ దుఃఖమే అని నిశ్చయించుకొన్నాడు. రక్తము కక్కుకొనుచు మరణావస్థలో ఉన్నప్పటికి జటాయువు రాముని దుఃఖమును చూచి భరింపజాలక ఇట్లన్నాడు.

**"యామోషధీమివాయుష్మన్ । అన్వేషసి మహావనే**
**సాదేవీ మమచప్రాణా । రావణే నోభయంహృతం"**

జటాయువుకు అతిశయ దుఃఖాక్రాంతుడైన రాముడు అగుపడ్డాడు. ఆ దుఃఖంతో రాముడు జీవింపగలడో లేడో అని అతనికి సందేహము కలిగింది. వెంటనే "ఆయుష్మన్" ఆయుష్మంతుడా అని రాముని సంబోధించాడు. అది రామునికి మంగళాశాసనము. నిజానికి జటాయువు రామునికి మంగళాశాసనము చేసే స్థితిలో ఉన్నాడా? మంగళాశాసనమంటే పెద్దవారు చిన్నవారిని క్షేమంగా ఉండుమని ఆశీర్వదించుట కదా! జటాయువు రక్తము నురుగులు క్రక్కుతూ చనిపోవుటకు సిద్ధముగా నున్నాడు. అతడొక మామూలు గ్రద్ద. రాముడో, ఖర దూషణాది చతుర్దశ రాక్షస వీరులను ఒంటరిగా సంహరింపగల్గిన మహావీరుడు. చక్రవర్తి కుమారుడు. అంతేకాదు తనను (జటాయువును) ఆగ్రహంతో సంహరించడానికి శత్రువుగా ఎదురుగా నిలుచున్నాడు. అటువంటి సమయంలో రామునికి ఆ విధంగా మంగళా శాసనము చేయడం జటాయువుకు అతని శక్తికి, ఆ పరిస్థితికి అత్యంత విరుద్ధమైనది కాదా?

మరెందుకు జటాయువు రాముని "ఆయుష్మన్" అని సంబోధించాడు? అలా సంబోధించేప్పుడు జటాయువుకు తన ఎదుట అత్యంత దుఃఖావిష్టుడైన రాముడు కనుపించాడు. అయ్యో! రామునికేమి అవుతుందో? ఆయన అంత దుఃఖాన్ని సహింపగల్గుతాడో లేదో? అని బాధ కలిగింది. ఆ సమయంలో తన ప్రాణాపాయ పరిస్థితి అతనికి ప్రధానమనిపించలేదు. **తన దుఃఖాన్ని కూడ లెక్కపెట్టక ఎదుటివారి దుఃఖమును చూచి బాధపడుట భాగవతోత్తముల లక్షణము.** ఎదుటివారిపై ప్రేమ

ఉన్నప్పుడు, వారి దుఃఖాన్ని చూచి మనము సహింపజాలము. మనము కూడ దుః ఖిస్తాము. దానినే "పరదుఃఖ దుఃఖిత్వము" అంటారు. అప్పుడు వారి దుఃఖము తొలగిపోవాలని వారు క్షేమంగా ఉండాలని మనము కోరుకొంటాము. అదే మంగళాశాసన విశేషము. భాగవతోత్తములకు లోకులందరు బంధువులే. అందరు బాగుండాలనే వారి కోరిక.

జటాయువుకు శ్రీరాముడు భగవానుడని తెలుసు. ఆయన దశరథ మిత్రుడు. "రామావతారము, తాటక వధ, ఖర దూషణ వధ" మొదలైన అతి మానుష చర్యలన్ని విన్నవాడు. అట్టి భగవంతుడు ఇప్పుడు సీతాదేవిని కోల్పోయి, అత్యంత దుఃఖములో నున్నాడు. రాముని అత్యంతము ప్రేమించే జటాయువు పరమ భాగవతోత్తముడు. ఆ ప్రేమ వలననే రాముని ఆయుష్మంతుడా! అని ఆశీర్వాద పూర్వకంగా పిల్చాడు.

"చల్లగా జీవించు రామా! నీవు ఈ మహావనములో ఒక ఓషధిని వెదికినట్లు సీతాదేవిని అన్వేషిస్తున్నావే" అన్నాడు. ఇక్కడ వాల్మీకి మహర్షి సీతాదేవిని ఒక "ఓషధి" వలె అద్భుతంగా పోల్చాడు. అడవిలో ఓషధుల గురించి చక్కగా తెలిసినవారు వాటిని అన్వేషిస్తారు. ఆ ఓషధి వారికి లభిస్తుంది. వారి దుఃఖకారణము (రోగమో, నొప్పో) దానితో తొలగిపోతుంది. అలాగే రాముని దుఃఖము తొలగి పోయేలా సీతాదేవి లభిస్తుందని జటాయువు శుభసూచన చేస్తున్నాడు.

**"సాదేవీ, మమచప్రాణాః రావణే నోభయం హృతం"**

సీతాదేవిని, తన ప్రాణాలను కూడ అపహరించినవాడు రావణాసురుడని తెలిపాడు.

అంతేకాదు మరొక ముఖ్య విషయాన్ని కూడ తెలిపాడు. రావణుడు సీతాదేవిని అపహరించిన ముహూర్తము పేరు **"విందు".** ఆ సమయంలో అపహరింపబడిన వస్తువు దాని యజమానికి తిరిగి లభిస్తుంది.

అందువలన సీతాదేవి శ్రీరామునికి తిరిగి లభిస్తుందని సూచించాడు. "ఆయుష్మన్! అనే సంబోధనము "ఓషధి" ఉపమానం, "విందు" ముహూర్త ప్రభావములు, సీతా లాభాన్ని సూచించాయి.

చూచారా! శ్రీరాముని పట్ల జటాయువుకున్న ప్రేమాతిశయము! రావణుడపహరించాడనే కేవల వార్తను తెలుపడమే కాదు. ఆమె రామునికి తిరిగి లభిస్తుందని, దాని వలన వారిద్దరు సుఖిస్తారని కూడ శుభసూచన చేశాడు. ఇంతకు మించిన మహోపకారమేమి ఉంటుంది?

ఒంటరిదైన సీతాదేవిని రావణాసురుడు అపహరిస్తుండగా తాను చూచానని, ఆయనను ఎదిరించి పోరాడి, ఆయన రథాన్ని, సారథిని, కవచాన్ని, ఛత్రాన్ని కూల్చానని, అవకాశము చూచి రావణుడు వృద్ధుడైన తనను హతమార్చాడని తెలిపాడు. రావణుడు కుబేరుని తమ్ముడు, విశ్రవస తనయుడని తెలిపాడు.

రామునికి నోట మాట రాలేదు. ఒక గ్రద్ద తన తండ్రిగారితో ఉన్న స్నేహాన్ని పురస్కరించుకొని తన పట్ల ఇంత ప్రేమతో రావణాసురుని వంటి మహా బలవంతుని ఎదిరించి ప్రాణత్యాగము చేసిందా?

అప్పుడు రామునికి సీతావియోగము కంటె జటాయువు మరణమే అత్యంత బాధాకర మయింది. ప్రాణప్రియులైన తన బంధువులు మరణిస్తే కలిగే దుఃఖము రామునికి కలిగింది. చిన్నపిల్లవాడిలా అనాథునిలా అతడు ఆక్రోశింప సాగాడు! జటాయువు యొక్క శవాన్ని కౌగిలించుకొన్నాడు. రక్తసిక్తమైన అతని శరీరాన్ని ప్రేమతో తాకి నిమురుతున్నాడు. ఎంత ఆశ్చర్యము! చక్రవర్తి తనయుడైన శ్రీరామభద్రుడెక్కడ? అడవిలోని అతిహీనమైన గ్రద్ద ఎక్కడ? అదుగో అదే రామచంద్రుని "సర్వభూత దయాగుణము", ఆశ్రిత వాత్సల్య గుణము.

చివరకు రావణుడు సీతాదేవిని అపహరించి లంకకు తీసుకవెళ్లాడని అతడు విశ్రవసుని కుమారుడని, కుబేరుని తమ్ముడని తెలుపుతుండగానే జటాయువు యొక్క నోటి నుండి మాంసముతో కూడ రక్తము బయటకు వచ్చింది. అతని శిరము నేల వాలింది. అతని ప్రాణాలు పంచభూతాలలో కలసి పోయాయి.

జటాయువు యొక్క దయాగుణాన్ని త్యాగగుణాన్ని రాముడు లక్ష్మణునికి వివరించాడు. "లక్ష్మణా! ఈ రాముడు ప్రాణాలు తీసే క్రూరుడే కాని, ప్రాణాలనిచ్చే దయామయుడు కాడు".

లక్ష్మణా! ఈ జటాయువెంత గొప్పవాడు! వేలవత్సరాలు ఈ మహారణ్యములో గృధ్ర రాజ్యము నేలిన మహాబలుడు. మన తండ్రిగారికి పరమమిత్రుడు. ఇంత వృద్ధాప్యములో కూడ సీతా రక్షణలో భయంకరుడైన రావణునే ధైర్యంగా ఎదిరించి ప్రాణ త్యాగం చేశాడు.

సత్పురుషులు, త్యాగమయులు అన్ని జాతులలో ఉంటారు. వారి గుణాన్ని బట్టే ప్రాధాన్యము ఉంటుంది. కాని వారి జాతి, కుల, మతాలను బట్టికాదు.

ఈ జటాయువు ఒక పక్షి, అది కూడ ఒక గ్రద్ద. కాని ఇతడి త్యాగము ఎంత లోకోత్తరమైనది! "ఈతని త్యాగానికి తగ్గట్టు ఈయనకు బ్రహ్మవేత్తలకు చేసే దహన

సంస్కారము చేస్తాను. భరతుడు దశరథునికి పుత్రుడుగా సంస్కారము చేస్తే, నేను జటాయువు పుత్రునిగా సంస్కరిస్తాను" అని తన నిశ్చయాన్ని తెలిపాడు.

అరణుల ద్వారా అగ్నిని మధించి, చందన తరుశాఖలను దానితో రగిల్చి పైతృకమంత్రాలతో హోమాహుతులిచ్చాడు. ఆ మంత్రాగ్నితోనే జటాయువుకు బ్రహ్మ మేధ సంస్కారము పూర్వకంగా దహన సంస్కారము కావించాడు. రోహిమాంసంతో మంత్ర యుతంగా శ్రాద్ధాలను పెట్టాడు. దహన, శ్రాద్ధ సంస్కారాలను కావించి నడుము లోతు గోదావరీ జలాల్లో నిలబడి ఉత్తరాభిముఖంగా దర్భలను చేత దాల్చి

**"యాగతిర్యజ్ఞ శీలానాం - ఆహితాగ్నేశ్చయాగతిః**
**అపరావర్తినాం యాచ । యాచభూమి ప్రదాయినాం**
**మయా త్వం సమనుజ్ఞాతో గచ్ఛ లోకాననుత్తమాన్**
**గృధ్ర రాజమహాసత్వ । సంస్కృతశ్చ మయావ్రజ"**

అని సంకల్పించి దర్భలను నీటిలో వదిలాడు.

"ఓ జటాయూ! గృధ్ర రాజా! నీకు నేను మంత్రపూతంగా దహన సంస్కారాలను చేశాను. నీవు అత్యుత్తమ లోకాలకు వెళ్లడానికి అనుమతిస్తున్నాను.

ఫలాపేక్ష లేకుండా భగవదారాధనగా యజ్ఞములను ఆచరించే యజ్ఞశీలులు, ఆరిపోనీయకుండా అగ్నితో నిరంతరము హోమాదులను చేసే "ఆహితాగ్నులు", తిరిగి రాని అక్షయలోకాలకు వెళ్లేవారు, శాశ్వతమైన భూమిని దానం చేసేవారు వెళ్లే లోకాలకు నీవు వెళ్లు" మని దర్భలతో జలతర్పణం వదలగానే జటాయువు దివ్యశరీర ధారియై రాముని స్తుతిస్తూ ఊర్ధ్వలోకాలకు చేరుకొన్నాడు.

× × ×

యజ్ఞాచరణము, ఆహితాగ్ని ఉపాసన, భూదానము వేర్వేరు ఫలాల నిస్తాయి. కాని ఫలాన్ని అపేక్షింపక ఆరాధనగా చేస్తే వాటి వలన పునరావృత్తి రహితమైన మోక్ష సంపదే లభిస్తుంది. అందువలననే శ్రీరాముడు వారందరిని "అపరావర్తినాం" అని పునరావృత్తి లేని వారితో కలిపి తెలిపాడు.

జటాయువుకు అంతటి మోక్ష మహాసంపద లభించడానికి రామభద్రుడు రెండు కారణాలను పేర్కొన్నాడు.

(1) స్వయంగా తానే దహన సంస్కారాలను కావించడం (సంస్కృతశ్చ మయావ్రజ)

(2) అతనికి అట్టి పరమ పురుషార్థము లభించాలని స్వయంగా తానే ఆజ్ఞాపించడం (మయాత్వం సమనుజ్ఞాతో గచ్ఛలోకాన్ అనుత్తమాన్)

వేదము పరమ పురుషుడు ఎలా లభిస్తాడో ఇలా వివరిస్తుంది.

**"నా2యమాత్మా ప్రవచనేన లభ్యః**
**నమేధయా। నబహునా శ్రుతేన।**
**యమేవైష వృణుతే తేన లభ్యః।**
**తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వాం".**

"పరమాత్మ ప్రాప్తికి శ్రవణ, మనన, నిధి ధ్యాసలు, కర్మజ్ఞాన భక్త్యాదులు నేరుగా కారణాలు కావు. ఆయన ఎవ్వరిని అనుగ్రహిస్తాడో వారికే తన సాక్షాత్కార లాభాన్ని కల్గిస్తాడు".

విశ్వామిత్ర ముని శ్రీరామునికి అద్భుతాస్త్ర విద్యనిచ్చినా, అగస్త్య మహాముని వైష్ణవ ధనుస్సును, అప్రమేయ ఖడ్గాన్ని, అక్షయ తూణీరాది మహాయుధ సంపద నిచ్చినా శ్రీరామ భద్రునికి కైంకర్య రూపంగానే వాటిని సమర్పించి రామానుగ్రహ పాత్రులయ్యారు. శరభంగుడు నిష్కామ యాగాచరణ ద్వారా రామప్రియుడయ్యాడు.

"జటాయువు" అంటే "జటలలో ఆయువు" కలవాడు. జటలు అంటే **జడలు కట్టిన వెండ్రుకలు,** రెక్కలు అని పక్షి రూపములో అర్థము.

**"ఘన, జట" అనేవి వేదానుసంధానరీతులు.** అటువంటి జటారూపమైన వేదాను సంధానముతో జీవనమును గడుపుకొనే బ్రహ్మవేత్త అని మరొక అర్థము.

పై రెండు అర్థాలను కలుపుకొంటే జటాయువు అంటే "పక్షిరూపంలో ఉన్న ఒక బ్రహ్మవేత్త" అని అర్థము. అందువలననే అతడు శ్రీరాముని పరమాత్మగా గుర్తించి సీతా సంరక్షణ ప్రయత్న రూపమైన కైంకర్యంలో తన ప్రాణాలను కూడ పరిత్యజించి ప్రపన్నుడై రామప్రియుడయ్యాడు.

మానవుడైన రాముడు జటాయువుకు మోక్షాన్ని ప్రసాదించడానికి కారణం "సత్యేన లోకాన్ జయతి" అన్నట్లు సకలలోక జయసమర్థమైన సత్యగుణమే అని వాల్మీకి వివరించాడు.

ఇతిశం

# అయోముఖి

శ్రీరామ లక్ష్మణులు జనస్థానము నుండి ముందు పశ్చిమ దిశకు అక్కడి నుండి దక్షిణ దిశకు వెళ్ళి, తరువాత నైఋతి దిశవైపు వెళ్ళి, క్రౌంచారణ్యములో ప్రవేశించిరి. అక్కడి నుండి తూర్పువైపు వెళ్తుండగా ఒక దట్టమైన అడవి వచ్చెను. అందులో పాతాళము వంటి లోతైన ఒక గుహ ఉండెను. అక్కడ "అయోముఖి" అని ఒక భయంకర అసురీవనిత ఉండెను. ఆమె లక్ష్మణుని బలవంతంగా పట్టుకొని తనతో రమింపుమని లాగుకొని పోవుచుండెను.

క్రూరులైన రాక్షస స్త్రీలను శిక్షించడంలో లక్ష్మణుడప్పటికే ఆరితేరెను. ముందు తాటకను, తరువాత శూర్పణఖను శిక్షించినట్లే అయోముఖి ముక్కు చెవులను కూడ తన కత్తితో ఖండించెను. ఆమె భయంతో వెంటనే అడవిలోకి పారిపోయెను.

× × ×

'అయోముఖి' అంటే ఇనుము వలె కఠినమైన ముఖము కలది. ఆమె శూర్పణఖ వలె తనను అందమైన దానిగా భావించుకొనెను. బలాత్కారము రాక్షస గుణము కనుక లక్ష్మణుని లాగుకొని పోయెను. తనకు సౌందర్య సాధనములు తన ముక్కు చెవులని భావించుకొనెను. వాటిని ఖండించుట ద్వారా తనకు వికారము ఏర్పడిందనే లజ్జతో, లక్ష్మణుని భీకరత్వమును చూచి భయముతో ఆమె పారిపోయెను.

ఇతిశం

"వానరుడైన హనుమను - 'వానరుడిగా మనకు
అందించిన - మహా మహీపతి శ్రీరాముడు".

# కబంధుడు

అయోముఖి అడవులలోనికి పారిపోయిన తరువాత లక్ష్మణునికి అనేక అపశకునములు అగుపడెను. ఆయన ఎడమ భుజము అదిరెను. అధికమైన ఆపద కలుగుతుందనే అశంక కలిగెను. ఆయన ఆ విషయములో అన్నను హెచ్చరించెను.

అంతలోనే ఆ అరణ్యమంతా బ్రద్దలవుతున్నట్లు భయంకర శబ్దము వారికి వినవచ్చెను. అక్కడ ఒక పొదలో ఒక భయంకర రాక్షసుడు ఉండెను. ఆయన తనువంతా నల్లగా వెంట్రుకలతో నిండి ఉండెను. ముఖము, కాళ్లు కనబడుట లేదు. ఒక పెద్ద పొట్ట–దానిపై వికృతమైన పెద్ద నోరు ఉండెను. దానిపై కొరివివలె మండుతున్నట్లున్న కన్ను ఉండెను. పొట్టకు ఆనుకొనే దీర్ఘములు, బలిష్ఠములైన హస్తములు ఉండెను. వాటితో అతడు దూరములో నున్న అడవి జంతువులను లాగుకొని నోటిలో వేసికొని నమిలి మ్రింగు తుండెను. అతడే కబంధుడు. **"క" అంటే ఆనందమును, "బంధుడు" అనగా బంధించి అనుభవించేవాడు.** ఆనందమును అనుభవించుటలో దోషము లేదు. అయితే ఆ ఆనందము తాను ఆర్జించినది, తనకు సంబంధించినది కావలెను. పరుల ఆనందమును కొల్లగొట్టి తాము బలవంతంగా అనుభవించే వారంతా కబంధులే. వారందరికి ప్రతీకయే ప్రస్తుత కబంధుడు.

అతడు దూరంగా వెళ్లుతున్న రామలక్ష్మణులను తన వైపు బలవంతంగా లాగుకొను చుండెను. అతని బలము ముందు వారు అబలులైరి. దీనుడైన లక్ష్మణుడు అన్నతో తనను ఆ రాక్షసునకు వదలి వెంటనే వెళ్లిపొమ్మని, కాలక్రమంలో సీతాసమేతుడై అయోధ్యకు వెళ్లి తనను తలచుకొమ్మని రాముని బ్రతిమాలెను. అప్పుడు రాముడు అతనికి అభయవాక్యములను పలికెను.

కబంధుడు వారిద్దరిని చూచి తన ఆకలికి తగినట్లు బలిష్ఠములయిన వృషభముల వలె బలమైన ఆహారము లభించిందని ఆనందించెను. వాడి అట్టహాసము రామునిలో ఆ క్షణములో అధైర్యమును కలిగించెను. "లక్ష్మణా! దైవము బలీయమైనది. అది అందరిని కాలపాశముతో కట్టివేస్తుంది. ఇసుకతో కట్టిన ఆనకట్ట నదీ ప్రవాహమును ఆపజాలక కొట్టుక పోతుంది. అలాగే ఈ కష్టము మన జీవితాలను కడతేరుస్తుంది" అని అనుజునితో ఆవేదనతో అతడు పలికెను.

కబంధుడు తన బాహుబంధములో రామలక్ష్మణులను ఇరికించుకొని, ఆకలిని తాళలేక వారిని భక్షింపదలచెను. లక్ష్మణుడు వెంటనే రామునితో అతని భుజములను

కత్తులతో ఖండించవలెనని చెప్పెను. కాళ్లు లేక కదలలేని ఆయనను చంపుట అన్యాయమే. కాని బాహుఖండనము కర్తవ్యమే అని తెలిపెను. వారిద్దరు వెంటనే వాడి బాహువుల ను ఖండించిరి.

కబంధుడు బాహువులు నరకబడగానే, కారుతున్న రక్త ప్రవాహముతో భయంకరంగా బొబ్బలిడి, భయంతో "మీరెవరు?" అని ప్రశ్నించెను. లక్ష్మణుడా రాక్షసునికి తమ వృత్తాంతమును తెలిపి వాడి విషయమును అడిగెను.

వారు రామలక్ష్మణులని తెలియగానే కబంధుడు ఆనందముతో తన పూర్వ వృత్తాంతమును వివరించెను.

"రామభద్రా! నేను దనువు పుత్రుడను. పూర్వము సూర్య, చంద్ర, దేవేంద్రుల వంటి తేజస్సును కలిగి బలిష్ఠమైన దేహము కలవాడను. అయితే ఆ శరీరముతో శుభకార్యము లను చేయక, పరులను హింసిస్తూ ఆనందించాను.

ఒకరోజు అరణ్యములో స్థూల శిరుడనే మహర్షి ఆహారార్థము సంచరిస్తుండగా నేనతనిని క్రూరంగా హింసించాను. అతడు నా పాపకర్మలకు తగినట్లుగా భయంకర రూపము కలుగాలని నన్ను ఘోరముగా శపించెను. నేను శాపాంతము కొరకు ఆ మహర్షిని ప్రార్థించితిని. "రామక్ష్మణులు నీ బాహువులను ఖండించి నీ దేహాన్ని దహించినప్పుడు నీ పూర్వ సుందర రూపము పునః ప్రాప్తి కలుగునని" కరుణించెను.

నేను నా శారీరక శక్తికి తోడు బ్రహ్మ గురించి మహోగ్ర తపస్సును చేసి "దీర్ఘాయువును సంపాదించితిని". ఆ వర గర్వముతో అమరేంద్రుని రణమునకు ఆహ్వానించితిని. అతడు తన వజ్రాయుధముతో నా శిరస్సును, చరణములను నా మొండెము లోనికి అణగ ద్రొక్కెను. బ్రహ్మ వరాన్ని బట్టి నన్ను చంపక వదలి వేసెను. నాకు తినుటకు ముఖము లేదు. కదలుటకు కాళ్లు లేవు. నా ఆకలి తీరు మార్గము గురించి అతనిని అడిగితిని. సురేంద్రుడు కరుణించి నా గుండె భాగములో పెద్ద పెద్ద కోరలతో నోరును, నాలుగు మైళ్ల పొడవుగల దీర్ఘబాహువులను కల్పించెను. వాటితో దూరములోనున్న పెద్ద పెద్ద జంతువులను లాగుకొని భక్షిస్తూ జీవిస్తున్నాను. దేవేంద్రుని చేతిలో దైన్యమును పొంది నా ఈ వికార స్వరూపము యొక్క మార్పును గురించి ప్రార్థించగా, అతడు కూడ బ్రహ్మ మాటనే బలపరిచి రామలక్ష్మణులు నీ బాహువులను ఖండించి, నీ దేహాన్ని దహించిననాడు నీ పూర్వ సుందర రూప పునఃప్రాప్తి కలుగునని కరుణతో వరమిచ్చెను.

మీరు నా బాహువులను ఛేదింపగానే మీ గురించి జ్ఞాపకము వచ్చింది. మీరు నా ఈ దేహాన్ని ఒక గోతిలో వేసి దహించగానే నా అపురూపమైన రూపము, నా పూర్వ

స్మృతి లభిస్తాయి. దానివలన మీ కార్యములో నేను సహాయము చేయగలను" అని తన పూర్వ విషయమును తెలియజేసెను.

అప్పుడు శ్రీరాముడు తన అరణ్యావాసము గురించి, తన భార్యాపహరణము గురించి తెలిపెను.

కబంధుడు "సీతను అపహరించిన రాక్షసుని రూప, బలాలను గురించి, వాడి నుండి సీతను సంపాదించే మార్గము గురించి సూటిగా తెలిపే దివ్యజ్ఞానము తనకు లేదని, కాని ఆ రావణాసురుని గురించి తెలిసి, అతడి నుండి సీతను తిరిగి లభించే ప్రయత్నంలో శ్రీరామునికి సహాయమొనరించే ఒక మహానుభావుని గురించి తెలియజేస్తానని, సూర్యాస్తమయము కలిగే లోపే తనను గోతిలో పడవేసి, కాల్చుమని" తెలిపెను.

రామలక్ష్మణులు కబంధుని దేహాన్ని ఒక పెద్ద గోతిలో పడవేసి ఎండు పుల్లలతో దానిని కాల్చివేసిరి. మండుతున్న ఆ చితి నుండి ఒక మహాపురుషుడు పైకి వచ్చెను. తెల్లని వస్త్రములతో, దివ్యపుష్పహారములతో, అనేక అలంకారములతో, హంసలు మోయు చున్న విమానములో కూచొని తన తేజస్సుతో సర్వ దిశలను ప్రకాశమానము చేయుచుండెను.

అతడు అంజలి ఘటించి, "శ్రీరామచంద్రా! రాజులు శత్రు విజయముకై "సంధి, విగ్రహము, యానము, ఆసనము, ద్వైధీభావము, ఆశ్రయము" అనే ఆరు ఉపాయాలను అవలంబిస్తారు. నీవిప్పుడు రాజ్యబల సంపదలు లేనివాడవు కనుక ఒక స్నేహితుని సహాయమును సంపాదించుకొనవలెను.

నీకు సహాయము చేయగలవాడు "సుగ్రీవుడ"నే వానరుడు. కోతి అని అతనిని తక్కువ చేయవద్దు. ఆయన సూర్యకుమారుడు. కామరూపుడు. అతడు ఇంద్రపుత్రుడైన "వాలి" అనే తన అన్న చేతిలో భార్యా రాజ్యములను కోల్పోయి, దెబ్బలు తిని, మరణభయంతో పంపాతీరంలో ఋష్యమూక పర్వతముపై నలుగురు మంత్రులతో దాగి ఉన్నాడు. నీవు వాలిని వధించి సుగ్రీవునికి దారా రాజ్యములను ఇప్పించిన నాడు, నీకు కృతజ్ఞుడై, అతడు వానర సేనతో సీతాన్వేషణములో సహాయము చేయగలడు. వాలి భయముతో అన్ని దేశములలో సంచరించినవాడు కనుక అన్ని ప్రదేశముల జ్ఞానము కలవాడు. అతనిని ఆశ్రయించి, మైత్రి చేసికొని, అతనికి సహాయమొనర్చు" మని సలహా నిచ్చెను.

అంతేకాదు ఋష్యమూకమునకు వెళ్లేప్పుడు పంపానదికి మరొకవైపు మతంగ మహా ముని ఆశ్రమముంటుందని, ఆ ఆశ్రమములో "శబరి" అనే ఒక వృద్ధ వనిత వారి రాక కొరకు నిరీక్షిస్తుందని ఆమెను దర్శించి సుగ్రీవుని చేరుకొనుమని తెలిపెను.

పూర్వము బ్రహ్మచే నిర్మితమైన ఋష్యమూకపర్వతము ఋషిగణ నిలయమై ఉండేదని వారి తపః ప్రభావము వలన ఆ పర్వతము మహిమావంతమైనదని, ఆ గిరిపై నిద్రించిన వాడు కలలో కాంచిన వస్తువును మెలకువ రాగానే పొందగల్గుతాడని, పాపాత్ములు ఆ పర్వతమును అధిరోహిస్తే, రాత్రిలో రాక్షసులు వారిని అపహరించి, హత్య కావిస్తారని తెలిపెను.

అతడు అందించిన సుగ్రీవ, శబరి సమాచారాన్ని ఆలకించి రామలక్ష్మణులు హర్ష పరవశులై అతనిని అతని స్థానానికి వెళ్లుటకు అనుమతించిరి.

× × × ×

అరణ్యకాండలో విరాధునితో ఆరంభమైన రాక్షస వైరము కబంధునితో అంతమైనది.

ఈ ఇద్దరు రాక్షసులలో కొన్ని పోలికలు, కొన్ని తేడాలు ఉన్నాయి. ఇద్దరు కూడ తమ ఆహారము కొరకు అన్యులను బాధించినవారే. ఇద్దరు హింసాపరాయణులే. ఇద్దరు శాపసంతప్తులే. ఇద్దరు శ్రీరాముని శ్రీ హస్తాలలో నిహతులై పూర్వ రూపములను పొందినవారే. అయితే ఇద్దరిలో విరాధుడు ఖననము చేయబడ్డవాడు. కబంధుడు దహనము చేయబడ్డాడు.

విరాధ కబంధులిద్దరికి శాపాల తరువాత కూడ పూర్వజ్ఞానము ఉన్నది. అయితే విరాధుడికి ఖననము ద్వారానే శాప శరీరము తొలగింది కాని గోతిలో త్రోయబడ్డ కబంధుని శరీరముపై ఎండుకట్టెలను పేర్చి దానిని దహనము చేయడం జరిగింది.

దహనము వలన కబంధుడికి దివ్య స్వరూపము దివ్యజ్ఞానములు కలిగాయి. ఆ దివ్యజ్ఞానంతోనే "సుగ్రీవ మైత్రి", "ఋష్యమూక పర్వత మహిమ", "శబరి సందర్శనము" ల గురించి దనుపుత్రుడు శ్రీరామునికి నివేదించాడు.

ఇతిశం

# శబరి - ఆచార్య నిష్ఠ

గాయత్రీమంత్రంలోని "తత్సవితుః". శబ్దార్థాన్ని ప్రతిపాదిస్తూ శ్రీరామావతారము నుండి పరశురామ నిగ్రహము వరకు సూర్యవంశ వైభవాన్ని బాలకాండ తెలిపింది.

అయోధ్యకాండ "వరేణ్యం" శబ్దార్థాన్ని తెలుపుతూ శ్రీరామచంద్రుని కల్యాణ గుణాలు, సత్యనిష్ఠ, పితృవాక్య పాలనములను తెలిపి రామభద్రుని గొప్పదనాన్ని (వరేణ్యతను) ప్రకటించింది.

ఇక ఈ అరణ్యకాండ గాయత్రీ మంత్రములోని "భర్గ" శబ్దార్థాన్ని వివరించింది. "భర్గః" అనగా తేజస్సు. సూర్యాంతర్వర్తి అయిన పరమాత్మ తేజస్సు.

శరభంగ, సుతీక్ష్ణాగస్త్యాది మహానుభావులు సంభావించుటచేత, ఋషుల శరణాగతి చేత, విరాధ, ఖర, కబంధాది రాక్షస నిధనం వలన శ్రీరాముని తేజస్సు అరణ్యకాండలో స్పష్టంగా ప్రకాశించింది.

అంతేకాదు ఆ పరమాత్మ తేజస్సును స్వయంగా ఉపాసించి, ముముక్షువులందరికి అందించేవారే భాగవతోత్తములు, (స్వయం తీర్ణః పరాన్ తారయతి) ఆచార్యులు కూడ.

అరణ్యకాండ భాగవతోత్తముల వైభవాన్ని తెలిపే "తాపసాశ్రమ మండల" దర్శనంతో ఆరంభమయి "ఆచార్యోపాయ వైభవాన్ని" ప్రకాశింపజేసే "శబరి" దర్శనంతో సమాప్తమయింది. ఆచార్య వైభవము ఆశ్రితులకు ఉత్తారకమై, పరమాత్మకు అత్యంత ప్రీతిపాత్రమైనది.

"శబరి" ఒక శాబర (బోయ) కన్య. అనాథ. అయితే ఆమె శిశువుగానే అదృష్టవశాత్తు మాతంగ మునుల కటాక్షాన్ని అందుకొంది. వారి సంరక్షణలో పెరిగింది. వారినే ఆశ్రయించింది. వారి ఆచార, వ్యవహారాలను ఆమూలాగ్రం ఆకళింపు చేసికొంది. వారి "ఆచార్య నిష్ఠను" అనుభవ పర్యంతము అవగాహనము చేసికొంది. వారి వారసురాలిగా ఆచార్య వైభవాన్ని రామలక్ష్మణుల ముందు ప్రకాశింప జేసింది. శ్రీరామభద్రుని మనోదైన్యాన్ని కూడ తొలగించి, ఆయన మనస్సులో సంతోషోత్సాహాలను నింపింది. శిష్యత్వానికి మహోజ్వలోపమానము శబరి.

"శబరి" అనే పదాన్ని "వబయోర్నభేదః" అనే వ్యాకరణ సూత్రాన్ని బట్టి "శవరి" అని కూడ వ్యవహరింపవచ్చు. "శేతేవరే ఇతి శవరీ" అని వ్యుత్పత్తి. వరుడైన ఆచార్యుని యందు సమస్త భారములను ఉంచి (న్యాసము) విశ్రాంతి తీసికొన్నది కనుకనే "శబరి" అని అర్థము.

దను సుతుడైన కబంధుని సూచనల మేరకు రామలక్ష్మణులు క్రౌంచవనాన్ని దాటి పంపాతీరంలోని మతంగమహాముని వనప్రాంతాన్ని చేరుకొన్నారు. మతంగ వనమే శబరి ఆశ్రమ ప్రాంతము.

మతంగాశ్రమ ప్రాంతము పరమ ప్రశాంతమైనది. పరస్పర వైర స్వభావములు కల భయంకరమృగాలు సయితము సాధు స్వభావములు కలిగి మైత్రితో మెలుగుతాయి. ఆ వనంలోని శుకపికాలు, "రామా! రామా" అని ఆరంభించి వేదవాక్కులను పలుకుతున్నాయి.

రామలక్ష్మణులు శబరి ఆశ్రమంలో ప్రవేశించగానే, శబరి తన చిరకాల నిరీక్షణ తపస్సు ఫలించిందనే ఆనందంతో వారికి ఎదురేగింది. అంజలి ఘటించి వారికి పాదాభివందన మాచరించింది.

**"రామస్య పాదౌ జగ్రాహ**
**లక్ష్మణస్య చ ధీమతః**

రాముడు శ్రీమన్నారాయణుడు. ఆయన చరణ యుగళిని శరణు వేడింది. అంతటితో ఆగలేదు. భగవద్భక్తి బుద్ధి సంపన్నుడైన (ధీమతః) లక్ష్మణుని పాదములకు కూడ ప్రణమిల్లింది. సౌమిత్రి పురుషకారంతోనే రామచంద్ర స్వామి సమాశ్రయణము సార్థక మవుతుందని ఆమెకు అవగతమే. ఎంతటి భాగవత నిష్ఠాగరిష్ఠురాలో కదా శబరి!

స్వామి ఆమె కుశలాన్ని ప్రశ్నించాడు. "శబరీ! నీ తపస్సు చక్కగా సాగుతున్నదా? విఘ్నములేవి కల్గడం లేదు కదా? నియమాలు పాటిస్తున్నావా? నీ మనస్సు సుఖంగా ఉందా? నీ గురు శుశ్రూష సఫలమైందా?" శబరి ఈ ప్రశ్నలకు తరువాత సమాధాన మివ్వాలనుకొంది.

వారి పాదపంకజములందు దోసిళ్లతో పూలను చల్లింది. సుఖాసనాలను సమర్పించింది. అర్ఘ్య, పాద్య, ఆచమనీయాలను అర్పించింది. రుచ్యములయిన ఫలాలను సమర్పించింది.

స్వామి స్వాంతములో ఒక చమత్కారోహ మెదిలింది. "స్నాన సంధ్యాదులను ఆచరింపక పూర్వమే ఆ ఫలాలను ఆరగించాలా? ఆమె అలాగే ఆరగింపు సమర్పిస్తుందా?" అని అడిగాడు.

"స్వామీ! మీరు సహజంగానే పవిత్రమూర్తులు కదా! మర్యాదా మహానిధులు కదా! మీకు కూడ సామాన్యులకు వలె స్నానాది నియమాలు కావాలా?" అని అమాయకంగా శబరి అడిగింది.

స్వామి ఆమె అందించిన మహాభోగ్యములైన మధుర ఫలాలను అత్యంత ప్రీతితో ఆరగించాడు. అంతటి మహా ఫలాలను సమీకరించడంలో శబరి పడిన శ్రమను ప్రశంసించాడు.

శబరి సవినయంగా సమాధానమిచ్చింది. "స్వామీ నీవిచ్చిన చేతులు ఉన్నాయని పూలు క్రుచ్చాను. నీవు మొలిపించిన చెట్లున్నాయని పండ్లను తెచ్చాను. నీవొసగిన ఈ శరీరము ఉన్నదని నీ దగ్గరికి వచ్చాను. నీవనుగ్రహించిన చిత్తము ఉందని నిన్ను స్మరించాను, ధ్యానించాను. నేను పరిచారికను "నన్ను ఇంతగా ప్రశంసించడము అవసరమా? ఇందులో స్వయంగా నేను చేసినదేముంది?". ఒక బోయవనిత ఆచార్య కటాక్షము వలన ఎంత చక్కని స్వరూప జ్ఞానవతి అయిందో చూడండి.

అయినా స్వామీ! ఇంత తీయని పండ్లు అగస్త్యాది మహామునుల వనాల్లో కూడ ఉండవు. నీవు వస్తావని, నీకు ఆతిథ్యమివ్వాలని చిరకాలం నుండి కలలు కంటున్నాను. ఇన్నాళ్లకు నా కనుల వెలుగు మలగక ముందే నా కలలు సఫలం చేశావు. నా ముందు కనుల పండుగగా నిలిచావు. ఇది నీ నిర్హేతుక కృపయే కదా! మా ఆచార్యుల ఆచార్య వైభవము ఫలించినట్లుగా మధురాతి మధురంగా పక్వమయిన ఈ మహా ఫలాలను ఆరగించు" మని శబరి ప్రార్థించింది.

సౌమిత్రి సహితంగా రామచంద్రస్వామి ఆ అపురూప ఫలాలను ఆరగిస్తూ శబరిని అత్యంత ప్రీతితో అవలోకిస్తూ ఇలా సంభాషించాడు:

స్వామి: అమ్మా! నా నిరీక్షణలో నీ శిరస్సు ముగ్గుబుట్ట అయిందే?

శబరి: అవును స్వామీ! నీ పాదముల ముందు ఆ ముగ్గుతో రంగ వల్లులను అలంకరించడానికి.

స్వామి: అవ్వా! నీ ఆయువెల్లా వార్చి నీవు పూర్తిగా ఎండిపోయావే?

శబరి: అవును స్వామీ! నీ స్నేహం చేత ఆర్ద్రం చేసి దీపంగా వెలిగించడానికి.

స్వామి: నీ తీవ్ర వ్రతముతో శ్రమణీ! నీ ప్రాణాలు మాత్రమే నీ గూటిలో నిలిచాయే?

శబరి: అవును స్వామీ! గూటిలోని ఆ ప్రాణాలు నీ సన్నిధిలో సత్వరమే చేరాలని. (ఈ సంభాషణ శ్రీమద్రామాయణ కల్పవృక్షము ఆధారంగా)

శ్రీరామభద్రుడు శబరి సమాధానాలతో సంతోష భరితుడయ్యాడు. ఆమె ధర్మనైపుణికి ఆశ్చర్య పరవశుడయ్యాడు. కబంధుని ద్వారా విన్న ఆశ్రమ వైభవాన్ని రామచంద్రుడు ప్రత్యక్షంగా శబరి సహాయంతో సందర్శించాలనుకొని ఆ ఆశ్రమ వివరాలను అడిగాడు.

శ్రీరాముని శ్రిత వాత్సల్యానికి, సౌశీల్యానికి శబరి హర్షపరవశ అయింది. ఆయన కృపా విశేషంతో ఆయన ప్రశ్నలకు సమాధానంగా ఆ ఆశ్రమంలో తన తపస్సు నిర్విఘ్నంగా కొనసాగుతున్నదని తెలిపింది. శ్రీరామ పూజతో తన గురు శుశ్రూష సఫలమైందని తన జన్మ ధన్యమైందని, తనకు ఉత్తమోత్తమ గతి లభిస్తుందని తెలిపింది. ఆయనకు ఆ ఆశ్రమాన్ని అంతా సంతోషంతో సందర్శింప జేసింది.

"రామచంద్రా! మా ఆచార్యులు వారి ఆచార్యులయిన మతంగ మహాముని ఆజ్ఞను అనుసరించి మీకు ఆతిథ్యమివ్వాలని చిరకాలము నిరీక్షించారు. మీరు చిత్రకూటములో ఉండగానే మహేంద్రుడు తెచ్చిన మాణిక్య కింకిణులు గల సుందర మహా రథముపై సుఖాసీనులయి వారు స్వర్గానికి చేరారు. అలా వెళ్లుతూ మీకు తమ ప్రతినిధిగా ఆతిథ్యమివ్వడానికి నన్ను నియమించి వెళ్లారు. వారి పరిచర్యా ఫలంగా నాకు కూడ అక్షయ లోకాలు లభిస్తాయని వారు అనుగ్రహించారు.

రామభద్రా! ఈ మహా వన ప్రాంతమంతా ఆ మహామహుల ఆదర్శ ఆచార్య నిష్ఠకు ప్రత్యక్షోదాహరణంగా నిలిచింది.

వారు తమ ఆచార్యులు ఆచరించే యాగార్థము సమిధలను సమీకరించే ప్రయత్నంలో చెమట బిందువులను స్రవింపజేశారు. ఆ చెమట బిందువుల వలననే అసంఖ్యాకంగా చెట్లు మొలిచాయి. అవి ఇప్పటికి అలాగే వాడకుండా ఆర్ద్రంగా నిలిచి ఉన్నాయి. ఆ చెట్లపై పూసిన పూలు నేటికి సువాసనలను వెదజల్లుతూ చెట్లపై అలాగే నిలిచి ఉన్నాయి. ఈ మహారణ్యాన్ని అంతటిని వారు తమ ఆచార్యుల పేరుతోనే 'మతంగ మహావనము" అని వ్యవహరించారు. ఇది అలాగే ప్రసిద్ధమైనది.

మా ఆచార్యులు యావజ్జీవము ఆచరించిన యజ్ఞాల వేదిక ఈనాటికి జ్వలిస్తున్న అగ్నిశిఖలతో వెలుగుతున్నది.

మా ఆచార్యులు శక్తి ఉన్నంతవరకు అనుదినము సప్త సాగరాలలో స్నానము చేసి వచ్చేవారు. వారి వృద్ధాప్యంలో ఆ సప్త సాగరాలే స్వయంగా సూక్ష్మ స్వరూపములో ఇదిగో ఇక్కడికి వారికోరిక మేరకు వచ్చాయి. ఈ సప్త సాగర స్నానము సర్వపాప విమోచనము, సకల శ్రమాపహారము.

మా ఆచార్యులు స్నానానంతరము ఆరవేసుకొన్న వల్కలాలు ఇప్పటికి ఆర్ద్రంగా ఉన్నాయి చూడు"మని రామలక్ష్మణులిద్దరికి ఆ వనమంతా చూపెట్టింది. ఆచార్యాజ్ఞను నెరవేర్చి కృతకృత్యురాలనయ్యాననే సంతోషంతో ఆమె తన తనువును వదలడానికి నిశ్చయించుకొంది.

రామభద్రా! నీ చల్లని చూపులతో నేను పవిత్రతను పొందాను. (చక్షుషా తవ సౌమ్యేన పూతాఽస్మి రఘునందన) మా ఆచార్యుల ఆజ్ఞను నెరవేర్చి నేను ధన్యురాలి నయ్యాను. ఇక నాకు ఇక్కడ ఉండడానికి అర క్షణము కూడ అవసరము లేదు.

స్వామీ! మా ఆచార్యులు స్వర్గానికి వెళ్లినప్పటి నుండి నా సేవలు లేకుండా ఉన్నారు. నేను కూడ స్వాచార్య విరహాన్ని సహింపలేకుండా ఉన్నాను. మేము పరస్పర నిరీక్షణతో వేర్వేరుగా ఉన్నాము. అందువలన వెంటనే మా ఆచార్యులను చేరుకోవాలి. దాని కొరకు నా శరీరత్యాగాన్ని అనుమతించు"మని అర్థించింది. అంతేకాని రాముడు పరమాత్మే అని గ్రహించి కూడ ఆయనను ఏ వరమో కావాలని యాచింప లేదు.

**"పాదమూలం గమిష్యామి యానహం పర్యచారిషం"**

తాను సేవించిన ఆచార్య శ్రీపాదములను చేరుకోవడమే తనకు పరమప్రాప్యమని విశ్వసించింది. ఆమె శరీర త్యాగానికి స్వామి అనుమతించిన తక్షణమే ఆమె అగ్నిని ప్రజ్వరిల్ల జేసింది. అందులో తన దేహాన్ని ఆహుతి ఇచ్చింది.

ఆ అగ్నిజ్వాలల నుండి అద్భుతంగా ఒక దివ్య దేహము పైకి లేచింది. దివ్య మాలలను, దివ్యాభరణాలను, దివ్యాంబరాలను ధరించింది. మెరుపు తీగ వంటి తన దేహకాంతితో ఆ ప్రాంతాన్ని ప్రకాశింపజేస్తు, స్వామికి అంజలి ఘటించి అంబరానికి దూసుకు వెళ్లింది. స్వామి సంభ్రమంగా ఆ దృశ్యాన్ని కటాక్షించాడు. ఆచార్య వైభవ సందర్శనముతో అతని మనస్సు ఆనందంతో నిండిపోయింది.

శబరి దివ్యదేహము భగవంతుని విశ్వరూపము కంటె అద్భుతమైనది. స్వామి విశ్వరూపాన్ని చూచి అర్జునుడు ఆశ్చర్య భీతి పరవశుడయ్యాడు. స్వామిని భగవంతునిగా గుర్తించుటకు ఆ విశ్వరూపము అవసరమైంది.

శబరి దివ్యదేహము సర్వ స్వామి అయిన శ్రీరామునే ఆశ్చర్య చకితుని చేసింది. స్వామి స్వాంతంలో ఆచార్య వైభవము మహోజ్వలంగా ప్రకాశించింది. శబరి సందర్శనంతో స్వామి మనస్సులో సీతా విరహ దైన్యము తొలిగింది. ఇక ఇక్కడి నుండి ప్రధానంగా రామపరత్వమే ప్రకాశిస్తుంది.

**ఇతిశమ్**

# పంపా సరోవరము

శ్రీరాముడు శబరి యొక్క ఆచార్య నిష్ఠను, మతంగ మహాముని శిష్యుల ప్రభావాన్ని కనులార కటాక్షించాడు. ఆయనకు ఆశ్చర్యము కలిగించింది అతులితమైన శబరి ఆచార్య మహిమ. ఆయన మనస్సులో దైన్యము తొలగింది. ధైర్య బీజమంకురించింది. ఆ సప్త సముద్ర జలాలతో స్నానాదులను కావించి తర్పణములను విడిచారు. శుభము కలుగుతుందనే సూచనలు వారికి కనిపించాయి. పంపా నది యొక్క తూర్పు తీరము వైపు వారు ప్రయాణించారు. చతుర్మంత్రి సమేతుడైన సుగ్రీవుని చేరుటకు వారు త్వర పడసాగారు.

పుణ్యజన సంసేవితమైన పంపానదిని వారు సందర్శించారు. నానా వృక్ష సమాకీర్ణమై, స్వచ్ఛ జలసంభరితమై, పుష్ప పరిమళ పరిపూర్ణమై పంపా సరోవరము పవిత్రమై ఒప్పారింది. ఆ నది యొక్క "మతంగసర" మనే మడుగులో స్నాన సంధ్యలను అనుష్ఠించారు. సితసైకతములతో, వికసిత కుసుమములతో ఆ నదీమతల్లి సర్వాలంకార భూషిత అయిన ప్రమదవలె ప్రకాశించింది. ఆ సరోవర సౌందర్య సౌగంధ్యాలకు రాముని మనస్సు కామపరవశమైనది. సుగ్రీవుని త్వరగా చేరుకోవాలని వారు నిశ్చయించు కొన్నారు.

ఒక బోయ వనిత అయిన శబరిని పరమాత్మకు ప్రీతకరంగా తీర్చిదిద్దిన ఆచార్య వైభవాన్ని కనులార గమనించిన శ్రీరామచంద్ర పరమాత్మ – సీతాదేవి శోకాన్ని నివారింపగల, ఆమెకు తన సందేశాన్ని వినిపింపగల, ఆమె అనన్య మానసిక పరిస్థితిని తనకు నివేదింపగల విలక్షణ, లక్షణ విశిష్టుడైన ఆచార్యుని అన్వేషించుటకు ప్రయత్నాన్ని ఆరంభించాలని ఆలోచించాడు.

ఆచార్యుడు భాగవతోత్తముల మధ్యలో వారితో కలసే ఉంటాడు. ఆయన ఆశ్రితుల యొక్క దైన్యాన్ని తొలగిస్తాడు. పరమాత్మ యొక్క స్వరూప స్వభావాలను వారికి తెలియ జేస్తాడు. పరమాత్మ వైపు నుండి అభయాన్ని అందిస్తాడు. అంతిమంగా జీవ పరమాత్మల సంశ్లేషను కలిగిస్తాడు.

ఈ విధంగా ఆచార్య వైభవ స్ఫోరకమైన శబరి సందర్శనంతో సమాప్తమైన ఈ అరణ్యకాండ ఆచార్యాన్వేషణతో ఆరంభమయ్యే కిష్కింధకాండకు మార్గదర్శకమవుతుంది.

ఇతిశమ్

# ఉపయుక్త గ్రంథావళి


1. "వాల్మీకి రామాయణము" శ్రీ గోవిందరాజ వ్యాఖ్యా సమేతము
2. "మంథర రామాయణము" శ్రీ వావి కొలను సుబ్బారావుగారు
3. "రామాయణ రత్నాకరము" శ్రీ తె.కం. గోపాలాచార్య స్వామి వారు
4. "రామాయణ తత్వదీపిక" శ్రీ భాష్యం అప్పలాచార్య స్వామివారు
5. "అంతరార్థ రామాయణము" శ్రీ వేదుల సూర్యనారాయణ శాస్త్రిగారు
6. "శ్రీ వాల్మీకి రామాయణ దర్శనము" శ్రీ పాండురంగ శాస్త్రి అఠావలె
7. "రామాయణ కల్పవృక్షము-అరణ్యకాండ" శ్రీ విశ్వనాథ వారు
8. "శ్రీ మద్రామాయణము-విశ్వశ్రేయము" డా మల్లాది గోపాల కృష్ణ శర్మగారు
9. రామాయణము ఉషశ్రీ గారు


ఇతిశం

రచయిత పరిచయము

# పేరు : ఆచి శ్రీనివాసాచార్య



జననము : శ్రీశాల (కరీంనగర్ జిల్లా),

విక్రమ సం. మాఘశు. భీష్మాష్టమి

| | | |
|---|---|---|
| తల్లిదండ్రులు | : | శ్రీమతి ఆచి వేంకట నరసమాంబ, శ్రీ ఉ.వే.ప్ర. ఆచివేంకట నృసింహాచార్య (అవునూరు) స్వామివారు |
| విద్యార్హతలు | : | ఎం.ఏ.బి.ఎడ్. |
| వృత్తి | : | విశ్రాంత "ప్రభుత్వ పాలనా శాస్త్ర" ఉపన్యాసకులు |
| ప్రవృత్తి | : | ఉపన్యాసాలు, కాలక్షేపాలు కవిత్వము |
| సంప్రదాయ విద్యార్హతలు | : | శ్రీమద్రామాయణ, గీతాభాష్య, ఉపనిషత్, శ్రీ భాష్యాది సంస్కృత ప్రబంధాలలో "భగవద్విషయాది" తమిళ ప్రబంధాలలో ప్రవేశము. |
| శాశ్వత సభ్యత్వము | : | "ఉభయ వేదాంతాచార్య" పీఠము, సీతానగర్ |
| ఉపన్యాసాలు | : | శ్రీరామాయణ, భగవద్గీతా, ఉపనిషత్తులు, శ్రీ భాష్య విషయాలలో తిరుప్పావై, భగవద్విషయాది దివ్య ప్రబంధాలలో |
| ఉపన్యసించిన స్థలాలు | : | సీతానగర్, విజయవాడలో 1983 సం. నుండి "ఉభయ వేదాంత పండిత సదస్సులలో. యాదగిరి, హైద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకొల్లు, చీరాల, శ్రీ రంగాది దివ్య స్థలాలు. |
| ముద్రిత రచనలు | : | శ్రీరామాయణానుభవము:- బాలకాండ, అయోధ్యకాండ, అరణ్యకాండలు ముముక్షుప్పడి, దివ్యదేశాలు, తిరుప్పావై. |